నవంబర్
2025

235

సంపుటి : 21 సంచిక : 6

వెల రూ. 15/-

# MARXISTU
# మార్క్సిస్టు

## సైద్ధాంతిక మాసపత్రిక

### ఈ సంచికలో........

సోషలిజానికి పరివర్తనలో కార్మిక-కర్షక ఐక్యసంఘటన
వాయిదా పడిన ఉచిత గ్రంథాలయాల కల
ఢిల్లీ సుల్తానుల కాలం: పాలనావ్యవస్థ, సామాజిక జీవనం
ఆధునిక బానిసత్వం: మహిళలు
ప్రజలపై అమెరికా ముడిచమురు ధరల భారం
సమాఖ్య విధానానికి విరుద్ధంగా కేంద్ర ప్రభుత్వ వాదనలు
నిరంకుశత్వానికి ప్రతిఘటన 'నో కింగ్స్ డే 2.0'
'సంఘ్‌పరివార్‌కు వివేకానందుడు సైద్ధాంతిక శత్రువు'
సావర్కర్ విచ్ఛిన్నకర వాదనలు

ఆర్‌ఎస్‌ఎస్ తప్పుడు సిద్ధాంతాలు

# సావర్కర్ విచ్ఛిన్నకర వాదనలు



పిబి చారి

రచయిత హైదరాబాద్ ఇసిఐఎల్‌లో రిటైర్డ్ సీనియర్ మేనేజర్

ఆర్‌ఎస్‌ఎస్ అంటే రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్. ఇది 1925 విజయదశమి రోజున స్థాపించబడింది. కేసు బలరాం హెడ్గే వార్ దీని వ్యవస్థాపకుడు. ఈ సంస్థ ఐదు మంది మరాఠీ చిత్ పవన్ బ్రాహ్మణులతో ప్రారంభించబడింది. వినాయక దామోదర్ సావర్కర్, మరొక హిందూ సభ నాయకుడైన డాక్టర్ బి.ఎస్. ముంజి ఆశీస్సులతో ఇది ఏర్పడింది. ఆర్‌ఎస్‌ఎస్ స్వాతంత్ర ఉద్యమంలో ఎన్నడు పాల్గొన్న పాపాన పోలేదు. పైగా బ్రిటిష్ వాళ్లతో షరీకైన సంస్థ. అందుకే బ్రిటిష్ వలసవాదులు దాన్ని దువ్వి సమాజ విచ్ఛిన్నానికి విత్తనాలు చల్లేందుకు ఆర్‌ఎస్‌ఎస్‌ను ఉపయోగించుకున్నారు. ఆర్‌ఎస్‌ఎస్ ప్రజాస్వామ్యానికి, సోషలిజానికి బద్ధవ్యతిరేకి. భారత్ సాంఘిక వ్యవస్థకు అత్యంత ప్రమాదకారి.

ఆర్‌ఎస్‌ఎస్ మాతామహుడైన వీ.డి. సావర్కర్ సైద్ధాంతిక భావజాలం అర్థం చేసుకుంటే ఆర్‌ఎస్‌ఎస్ చరిత్ర ఎలాంటిదో మనం గ్రహించ గలుగుతాము.

**సావర్కర్ హిందూత్వ భావాలు**

వినాయక దామోదర్ సావర్కర్ మహారాష్ట్రలోని నాసిక్ దగ్గరలో "భాగూర్"అనే గ్రామంలో 1883 మే 23న చిత్ పవన్ సరస్వత బ్రాహ్మణ కుటుంబంలో జన్మించాడు. 1906 – 1910 మధ్య పైచదువులకై బ్రిటన్ వెళ్ళాడు. ఆయన బ్రిటన్‌లో ఉన్న రోజుల్లో హిందువులు అంటే ఎవరు? హిందువు అంటే ఏమిటి? అన్న ప్రశ్న ఎదుర్కొన్నాడట. ఆర్య సమాజం వారు, అలానే సనాతనవాదుల, సిక్కులు, బౌద్ధులు, జైనులు ఇందరున్నారు. మరి హిందువు అంటే ఎవరు? ఆనాడు బ్రిటన్‌లో వెలువడిన హూ ఈజ్ హిందూ? అనే పుస్తకంలో హిందువుకు 50 కి పైగా నిర్వచనాలు ఇవ్వబడ్డాయి. ఈ హిందూ అనే మాట ఎంతో విశాలమైనది, ఇందులో ఫలానా వాడు హిందువు అని చెప్పటానికి వీలు లేదు. కనుక హిందూ అంటే అనిర్వచనీయం అన్నారు. అనిర్వచనీయమంటే ఎలా? హిందూ అన్నది గొప్ప జాతి. దానికి నిర్వచనం కనిపెట్టాలి అని ప్రారంభించాడు సావర్కర్. 1906 – 1910 మధ్య చర్చకు ప్రతిస్పందనగా తాను నిర్వచించే పనిని మొదలెట్టాడు. 1923 నాటికి హిందూ: హిందువు ఎవరు? అన్న పుస్తకాన్ని రాసి దానిని జైల్లో ఉన్న సహచరులతో బయటికి పంపించాడు. నాగపూర్‌లో లాయర్ గా ఉన్న వి.వి. ఖేల్కర్ చేత "ఓ మరాఠీ" అన్న అజ్ఞాత పేరుతో ముద్రించబడి బయటకు వచ్చింది. ఆ పుస్తకంలో హిందువు అంటే ఎవరంటే "సింధూ నది నుండి సముద్రాల వరకు వ్యాపించి ఉన్న భరత వర్షం అనే ఈ భూమిని, తన పితృభూమిగా, పుణ్యభూమిగా, తన మతపుటుయ్యాలగా భావించే వ్యక్తి మాత్రమే హిందువు అవుతాడు" అని పేర్కొన్నాడు. అంటే ఆసేతుహిమాచలం అన్నమాట. కానీ ఆనాటికి భారతదేశం అంతా ఏకఖండంగా లేదు. బ్రిటిష్ ఇండియాలో 565 సంస్థానాలున్నాయి. వాటన్నటినీ కలిపి బ్రిటిష్ ఇండియా అని అనటానికి కూడా ఆనాటికి వీల్లేదు. మన దేశంలో ఆనాడు లేని అనేక భూభాగాలు ఇవాళ ఉన్నాయి. అందువలన ఆయన మతాన్ని ప్రాతిపదికగా తీసుకున్నాడే కానీ జాగ్రఫీని కాదు. అంతకన్నా ముఖ్యమైనది ఆయన దీన్ని పితృభూమి అనుకోవాలాన్నడు. యూరోపియన్ల సాంప్రదా యంలో పితృభూమి అంటారు. దీన్నే ఆయన స్వీకరించాడు, లేక సావర్కర్ పితృ స్వామిక ఆలోచన అయి ఉండవచ్చు. పితృభూమి మాత్రమే కాదు పుణ్యభూమి అనుకోవాలి, పవిత్ర భూమి అనుకోవాలి. అలా అనుకునే వాళ్ళు మాత్రమే హిందువులు. ఇలా హిందు వులకు సంబంధించిన చాలా సంకుచితమైన నిర్వచనం ఇచ్చాడు. హిందూ అన్నది మతం కాదు. హిందూ ధర్మం అంతకన్నా కాదు. నేను కొత్త నిర్వచనం ఇస్తున్నాను. అది "హిందుత్వ". ఈ హిందుత్వకు హిందూ వాదానికి, హిందూ ధర్మానికి ఎలాంటి సంబంధం లేదు అని అన్నాడు. హిందుత్వ –హిందూనెస్ అనే పదపు భావం "హిందూయిజం"అనే పదం కన్నా విస్తృతమైన అర్థాన్ని వ్యక్తం చేస్తుంది. విస్తృతమైన అర్థంలో చెప్పాలంటే అది "హిందూ సాంస్కృతిక జాతీయ వాదం". దాని అర్థం ప్రాదేశిక జాతీయ వాదాన్ని నిరాకరించటమే. ఈ ప్రాదేశిక జాతీయవాదం ప్రపంచమంతటా తెలిసిన వాదం. భౌగోళికంగా భారత భూభాగంలో పుట్టిన వాడల్లా పుట్టుక మూలంగానే భారతీయుడు. ఈ భావాన్ని గాంధీజీ, నెహ్రూలు సుసంపన్నం చేశారు. భారత దేశం లౌకిక తత్వ ప్రజాస్వామ్య దేశం. మన దేశం వైవిధ్య భరిత సంస్కృతులకు నిలయం. తాను దేవుడిని నమ్మననీ, నాస్తికుడననీ చెప్పుకున్న సావర్కర్ పుణ్యభూమికి ఇచ్చిన నిర్వచనంలో మతానికి అత్యంత ప్రాధాన్యత ఇచ్చాడు. ఈ నిర్వచనం ద్వారా ముస్లింలను, క్రైస్తవులను జాతీయ పరిధికి దూరంగా ఉంచాడు. సావర్కర్ హిందువులు ఒక జాతి అనే సిద్ధాంతాన్ని తన రచన "హిందుత్వ" ద్వారా ముందుకు తెచ్చాడు. అంతేకాదు "రాజకీయాలను హిందుత్వంతో నింపండి, హిందువులను సైనికీకరించండి"అని కూడా సావర్కర్ ప్రభోదించాడు."ఒకే రాజ్యం, ఒకే జాతి, ఒకే సంస్కృతి, ఒకే భాష, ఒకే ప్రజ". ఇదే హిందుత్వ కీలక లక్షణాలు. ఒకే భాష అంటే అది సంస్కృతం. ఇక్కడ సావర్కర్ సహచరుడు అయిన డాక్టర్ బి ఎస్ ముంజి గురించి కొంత తెలుసుకోవాలి. 1922లో బెనిటో ముసోలినీ నాయకత్వంలో ఇటలీలో ఇటాలియన్ ఫాసిస్ట్ పార్టీ అధికారంలోకి వచ్చింది. డాక్టర్ బి ఎస్ ముంజి అనే హిందూ సభ నాయకుడు 1930 –1931లో ఇటలీకి వెళ్లి ముసోలినితో కలిసి అక్కడ పర్యటించి వాళ్లు ఆయుధ శిక్షణ ఎలా ఇస్తారు, మానసిక శిక్షణ ఎలా ఇస్తారు, మనుషులను ఫాసిష్టులుగా మార్చి పార్టీలో ఎలా ఇముడ్చుకుంటారు, వాళ్ల మెదళ్ళలో ఫాసిస్టు భావాలను నింపడం ఎలా ఇలాంటివన్నీ అక్కడ తెలుసుకొని ఇండియాకు వచ్చాడు.

(మిగతా 34వ పేజీలో)

## ఈ సంచికలో...


1. సావర్కర్ విచ్ఛిన్నకర వాదనలు

పిబి చారి.........2

2. సోషలిజానికి పరివర్తనలో కార్మిక-కర్షక ఐక్యసంఘటన

ప్రభాత్ పట్నాయక్, ఉత్సా పట్నాయక్.....4

3. వాయిదా పడిన ఉచిత గ్రంధాలయాల కల

మృదులా కోషీ.....10

4. ఢిల్లీ సుల్తానుల కాలం: పాలనావ్యవస్థ, సామాజిక జీవనం

ఎంవిఎస్ శర్మ......15

5. ఆధునిక బానిసత్వం: మహిళలు

కె పద్మ......18

6. ప్రజలపై అమెరికా ముడిచమురు ధరల భారం

ఎ కోటిరెడ్డి.........23

7. సమాఖ్య విధానానికి విరుద్ధంగా కేంద్ర ప్రభుత్వ వాదనలు

ఎస్ వెంకట్రావు........28

8. 'సంఘ్‌పరివార్‌కు వివేకానందుడు సైద్ధాంతిక శత్రువు'

వి గోవిందకృష్ణన్‌తో ఇంటర్వ్యూ........31



సంపాదకుడు :

**ఎస్.వెంకట్రావు**

సంపాదక వర్గం :

**బి.వి.రాఘవులు**

**తమ్మినేని వీరభద్రం**

**ఎస్.వీరయ్య**

**తెలకపల్లి రవి**

భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు)
ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కమిటీ తరపున

ప్రచురణ కర్త, ముద్రాపకుడు: **బి.వి.రాఘవులు**
సంపాదకుడు : ఎస్.వెంకట్రావు
**ఫోన్: ఎడిటర్ : 94900 99333**

**ముద్రణ:** ప్రజాశక్తి ప్రింటర్స్ అండ్ పబ్లిషర్స్ ప్రై. లి., 14-12-19, కృష్ణనగర్, తాడేపల్లి(మ), గుంటూరు(జి)
**మేనేజర్: కె.హరికిషోర్: 94900 99422**
email:venkataraosankarapu@gmail.com
email:marxistap@gmail.com
visitcpi(m)site at:cpim.org


# శభాష్ కేరళ

ఈ నెల ఒకటో తేదీన కేరళ రాష్ట్రచరిత్రలో మరో గొప్ప మైలు రాయి దాటింది. ఇప్పటికే అనేక విజయ మాలలు కంఠాన ధరించిన ఆ రాష్ట్రాన్ని నవంబర్ 1న తన 70వ అవతరణ దినోత్సవం సందర్భంగా కటిక పేదరికాన్ని పూర్తిగా నిర్మూలించిన రాష్ట్రంగా ప్రకటించారు. దేశంలో ఈ విజయం సాధించిన రాష్ట్రాల్లో కేరళ మొదటిది అయింది. దీంతో మోడీ తరహా కాదు, యోగీ తరహా కాదు భారత దేశానికి కేరళ తరహా అభివృద్ధి మార్గమే ఆదర్శనీయమని మరోమారు రుజువు చేసుకుంది. కేరళ సాధించిన ఈ విజయం వెనుక ఖచ్చితంగా కేరళ ప్రజల పట్టుదల, కమ్యూనిస్టుల కృషి, వారి నాయకత్వంలోని ప్రభుత్వాల ప్రజానుకూల విధానాలు ముఖ్యపాత్ర పోషించాయనడంలో సందేహం లేదు.

కేరళ ఇటువంటి విజయాలు సాధించడం ఇదే ప్రథమం కాదు కానీ ఇంత పెద్ద విజయాన్ని అందుకోవడం మాత్రం ఇదే మొదటిసారి. గతంలో 1991లోనే కేరళ 100 శాతం అక్షరాశ్యత సాధించింది. ఇటీవలి కాలంలో 'డిజి కేరళం' ప్రాజెక్టు ద్వారా 100 శాతం డిజిటల్ లిటరసీ కూడా సాధించింది. ఉత్తమ పరిపాలన, ఉత్తమ ఇ-గవర్నెన్స్ వరుస సంవత్సరాల్లో అందుకుంది. పంచాయితీల ద్వారా అధికార వికేంద్రీకరణ, ప్రజలందరికీ ఆరోగ్యం, డిజిటల్ మౌలిక సదుపాయాలు, పర్యావరణ పరిరక్షణ వంటి అనేక అంశాల్లో కేరళ సాధించిన విజయాలను దేశం గుర్తించడమే కాదు, ఐక్య రాజ్య సమితి కూడా అనేక సందర్భాల్లో శ్లాఘించింది. అందుకే దీన్ని కేరళ నమూనా అభివృద్ధి మార్గం అంటున్నారు.

అయితే కేరళకు ఈ విజయం కొద్ది రోజుల్లోనో, కొద్ది సంవత్సరాల్లోనో రాలేదు. ప్రపంచంలోనే మొట్టమొదటి సారిగా బూర్జువా వర్గ రాజ్యాంగం కింద ఎన్నికల ద్వారా కమ్యూనిస్టులు కేరళలోనే అధికారంలోకి వచ్చారు. కామ్రేడ్ ఇఎంఎస్ నంబూద్రిపాద్ నాయకత్వంలో 1957లో అధికారంలోకి వచ్చిన ప్రభుత్వం రాష్ట్రంలో భూ సంస్కరణల అమలుతోపాటు అనేక సంస్కరణలకు శ్రీకారం చుట్టింది. ఇది సహించలేని పాలక వర్గాలు ప్రజాస్వామికంగా ఎన్నికైన ప్రభుత్వాన్ని రద్దు చేశారు. అయినప్పటికీ వారు కేరళలో కమ్యూనిస్టులను అధికారం నుండి శాశ్వతంగా దూరం చేయలేకపోయారు. కమ్యూనిస్టుల నాయకత్వంలోని ప్రభుత్వాలు అమలు చేసిన భూ సంస్కరణలు, విద్య, వైద్యం, పరిపాలన, పర్యావరణ రంగాల్లో వారు అమలు చేసిన పురోగామి విధానాల వల్లే కేరళ ఈనాడు దేశంలోనే అగ్రభాగాన నిలిచింది. అంతర్జాతీయంగా కూడా ఒక నమూనాగా పేరుగాంచింది.

పేదరికాన్ని తక్కువగా చూపడం కోసం మోడీ ప్రభుత్వం పరామితులను, అంకెలను తారుమారు చేసినప్పటికీ దేశంలో ఇంకా 17 శాతం వరకు పేదరికం ఉందని అధికారికంగా చెబుతున్న తరుణంలో, 80 శాతం మంది ప్రజలు ఇప్పటికీ ప్రభుత్వం ఇచ్చే ఉచిత బియ్యం మీద బ్రతకాల్సిన పరిస్థితుల్లో కేరళలో దారిద్ర్యాన్ని పూర్తిగా నిర్మూలించడం సామాన్యమైన విషయం కాదు. దీనికోసం వామపక్ష ప్రభుత్వం చాలా పెద్ద కృషి చేసింది. ముందుగా అధికార యంత్రాంగమంతా పూనుకుని రాష్ట్రంలో ఎంతమంది అతి పేదలున్నారో సమగ్ర సర్వే చేసింది. ఈ సర్వేలో 14 లక్షల మంది పాల్గొన్నారు. రాష్ట్ర వ్యాపితంగా 1,032 పంచాయితీలు, మున్సిపాలిటీల్లో 64,006 కుటుంబాలు 1,03,099 మంది వ్యక్తులు కటిక పేదరికంలో జీవిస్తున్నారని తేలింది. వారందరినీ పేదరికం నుండి బయటపడేయడానికి గాను తక్షణ, మధ్య కాలిక, దీర్ఘకాలిక ప్రణాళిక రచించింది. తక్షణం ఐడి కార్డులు ఇచ్చి ఆహారం అందించడంతోపాటు, ఆరోగ్యాన్ని సంరక్షించే చర్యలు తీసుకుంది. 432 కోట్ల రూపాయలతో 4.5 లక్షల ఇళ్లు నిర్మించి ఇచ్చింది. దానితో ఆగకుండా మళ్లీ వారు పేదరికంలోకి పోకుండా ఉండేందుకు గాను ఉపాధి పొందే నైపుణ్యాలు అభివృద్ధి చేసింది. ఉపాధిలో వారు నిలదొక్కుకుని పేదరికం నుండి పూర్తిగా విముక్తి పొందారు. వారు దాన్ని నిలుపుకునేట్లు చూడ్డానికి నిరంతర పర్యవేక్షణ యంత్రాంగాన్ని కూడా రూపొందించింది.

ఈనాడు కేరళ సాధించిన విజయాలు దేశానికి స్ఫూర్తినిస్తున్నాయి, ప్రత్యామ్నాయ అభివృద్ధి మార్గాన్ని చూపుతున్నాయి. అయితే ఎల్‌డిఎఫ్ నాయకత్వంలోని రాష్ట్ర ప్రభుత్వం ముందు అనేక సవాళ్లు కూడా ఉన్నాయి. పరిమితమైన అధికారాలు, పరిమిత వనరులు, మోడీ ప్రభుత్వ మతతత్వ, నయా-ఉదారవాదపు ఒత్తిళ్లు, అంతర్జాతీయంగా పెట్టుబడిదారీ సంక్షోభం అనేక సమస్యలను సృష్టిస్తున్నాయి. రానున్న కాలంలో సవాళ్లు మరింత పెరిగే అవకాశం ఉంది. అందువల్ల కేరళ తను సాధించిన విజయాలను నిలుపుకుని మరింత ముందుకు సాగాలంటే మోడీ ప్రభుత్వం అనుసరిస్తున్న నయా-ఉదారవాద, మతతత్వ విధానాలను ఓడించి ప్రత్యామ్నాయ పాలనను నెలకొల్పాల్సిన అవసరం ఉంది.

# సోషలిజానికి పరివర్తనలో కార్మిక-కర్షక ఐక్యసంఘటన

ప్రభాత్ పట్నాయక్,
ఉత్సాపట్నాయక్



రచయితలు ప్రముఖ మార్క్సిస్టు ఆర్థిక వేత్తలు.
మంత్లీ రివ్యూలో వారు రాసిన వ్యాసాన్ని పునర్ముద్రిస్తున్నాం

సమాజాన్ని విప్లవాత్మకంగా మార్చటంలో కార్మిక-కర్షక ఐక్య సంఘటన ప్రాధాన్యత గురించి 'జర్మనీలో రైతుయుద్ధం' పుస్తకంలో ఫ్రెడరిక్ ఏంగెల్స్ మొదటగా నొక్కి చెప్పాడు. "ప్రజాస్వామిక విప్లవంలో సోషల్ డెమొక్రసి రెండు ఎత్తుగడలు" అన్న గ్రంథంలో విఐ లెనిన్ శ్రామికవర్గ నాయకత్వంలో జరిగే నిరంతర విప్లవంలోని రెండు దశలను గురించి సైద్ధాంతికంగా విశదీకరించాడు. మొదటి దశ అయిన ప్రజాస్వామిక విప్లవంలో "నిరంకుశ పాలకుల ప్రతిఘటనను ఎదుర్కొని, సాయుధంగా ఓడించడం కోసం, బూర్జువావర్గ అస్థిరతను తటస్థీకరించటం కోసం కార్మిక వర్గం రైతాంగంతో మైత్రిని నెరపు తుంది". రెండవ దశ సోషలిస్టు విప్లవంలో "పెటి బూర్జువా, రైతాంగ బాహుళ్య అస్థిరతను అధిగమించటం కోసం, బూర్జువావర్గ ప్రతిఘటనను బల ప్రయోగం ద్వారా అణచివే యటం కోసం కార్మికవర్గం అర్ధ శ్రామిక వర్గంతో ఐక్య సంఘటనను నెరపుతుంది". ఈ సూత్రం ప్రాతిపదికగా ప్రజాస్వామిక విప్లవదశలో కార్మిక-కర్షక ఐక్య సంఘటనలో విస్తారమైన రైతాంగం భాగంగా ఉంటారు. సోషలిస్టు విప్లవ దశలో రైతాంగంలోని అర్ధ శ్రామికులు మాత్రమే భాగంగా ఉంటారు. లెనిన్ చెప్పిన ఈ అంశాన్ని ప్రాతిపదికగా తీసుకొని ప్రజాస్వామిక దశనుండి సోషలి జానికి పరివర్తన చెందే క్రమంలో, ఏ ప్రత్యేక దశలో రైతాంగంలోని ఏ తరగతులను విశాలమైన ఐక్య సంఘటన నుండి మినహా యించాలన్న అంశంపై మార్క్సిస్టు దృక్పథంతో తర్వాత కాలంలో విశ్లేషణలు చేశారు.

రష్యన్ పరిస్థితుల నేపథ్యంలో లెనిన్ రచించిన సోషల్ డెమొక్రసీ రెండు ఎత్తుగడలు పుస్తకంలో సామ్రాజ్యవాద ఆధిపత్యంలో ఉన్న నిర్దిష్ట దేశాన్ని గురించి లెనిన్ ప్రస్తావించలేదు. తర్వాతి కాలంలోని మార్క్సిస్టులు భారతదేశం, చైనా లాంటి వలస, అర్ధ వలస దేశాలలో సామ్రాజ్యవాద ఆధిపత్యాన్ని గురించి చేసిన విశ్లేషణలలో సామ్రాజ్యవాదం, ఫ్యూడలిజం (సామ్రాజ్య వాదం ఫ్యూడలిజానికి మద్దతు ఇస్తుంది)లకు వ్యతిరేకంగా పోరాటం చేసే దశలో కార్మికవర్గం, విస్తారమైన రైతాంగంతో పాటు కొన్ని తరగతులు ఐక్య సంఘటనలో ఉండాలని చెప్పారు. ఈ వర్గ సంఘటనకు కార్మికవర్గం నాయకత్వం వహిస్తే సోషలిజానికి విప్లవాత్మకంగా పరివర్తన జరుగుతుంది. మొదటి దశలో భాగంగా ఉన్న కొన్ని తరగతుల రైతాంగాన్ని రెండవ దశలో విప్లవ సంఘటన నుండి మినహాయించాల్సి ఉంటుంది (కార్మికవర్గం నాయకత్వ స్థానంలో లేకపోతే వారు నాయకత్వ స్థానంలోకి వచ్చే వరకు ఈ సంఘటన వేచి ఉండాల్సి ఉంటుంది). మరో మాటలో చెప్పాలంటే సామ్రాజ్య వాద ఆధిపత్యాన్ని గురించి, రెండవ దశ పరిణామ క్రమంలో ఏ ప్రత్యేక వర్గాలను ఐక్య సంఘటన నుండి మినహాయించాలి, వారిని ఏ విధంగా గుర్తించాలి అన్న అంశంపై స్పష్టత కోసం చర్చ జరుగుతున్న సందర్భంలో కూడా లెనిన్ విశ్లేషణ ప్రాధాన్యత కలిగి ఉన్నది.

మూడవ ప్రపంచదేశాలకు సంబంధించి చేసిన మార్క్సిస్టు విశ్లేషణలలో ప్రజాస్వామ్యం కోసం సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా చేసిన పోరాటాలు పూర్తి కాలేదనీ, ఒకసారితో అవి సంపూర్ణంగా పూర్తి కావన్న అంశంపై తగినంత స్పష్టత ఇవ్వలేదు. గతంలో సామ్రాజ్య వాదం బలమైన శక్తిగా ఉన్నప్పటికీ, సోవియట్ యూనియన్ ఉనికి వలన, ఆ దేశాలు విముక్తి అయిన తర్వాత కొద్దికాలం పాటు వాటిపై వలస దోపిడీ అంతమైనట్లుగానే కనిపించి ఉండవచ్చు. కాబట్టి కొద్ది సవరణలతో ఇప్పటికీ లెనిన్ దృక్పథాన్ని మూడవ ప్రపంచ దేశాలకు వర్తింపజేయవచ్చు. ఈ దృక్కోణంతో పరిశీలించినపుడు వలస దోపిడీ నుండి విముక్తి అయిన దేశాలలో కార్మికవర్గ నాయకత్వంలో, విస్తారమైన రైతాంగం మద్దతుతో ప్రజాస్వామిక విప్లవాన్ని ముందుకు తీసుకుపోవటం కోసం కృషి చేయాలి. తర్వాత రైతాంగంలోని కొన్ని వర్గాల మద్దతుతో సోషలిజానికి పరివర్తన చెందటం కోసం పోరాటం చేయాలి.

దీనిని మరోవిధంగా చూస్తే, వలస దోపిడీకి వ్యతిరేకంగా ఏర్పడిన ఐక్య సంఘట నకు కార్మికవర్గం నాయకత్వం వహించిన దేశాలలో కొద్దిపాటి మార్పులతో లెనిన్ ఊహించిన విధంగానే తర్వాతి అభివృద్ధి క్రమం జరిగింది. కార్మికవర్గ నాయకత్వంలో కాకుండా, జాతీయ బూర్జువా వర్గ నాయకత్వంలో ఈ పోరాటాలు జరిగి బూర్జువా నాయకత్వంలో

ప్రభుత్వాలు ఏర్పడిన దేశాలలో పరిస్థితి వేరుగా ఉంది. ఆ దేశాల్లో కార్మికవర్గ నాయకత్వంలో ప్రజాస్వామిక విప్లవ కర్తవ్యాలను పూర్తి చేయాలంటే ముందుగా బూర్జువా ప్రభుత్వాలను అధికారం నుండి తొలగించాలి. వలసవాదం అనంతరం ఆయా దేశాలలో బూర్జువావర్గం అనివార్యంగా ఫ్యూడలిజంతో రాజీపడటాన్ని ప్రతిఘటిస్తూ, ఫ్యూడల్ భారాల నుండి రైతాంగాన్ని విముక్తి చేసి, గతంలో రైతాంగంలో శ్రామిక వర్గానికి మిత్రులుగా ఉన్న కొన్ని తరగతులను మినహాయిస్తూ సోషలిజం కోసం సాగిపోవాలి.

“వలస కాలంలో “మిగులు ఉత్పత్తిని తరలించుకు వెళ్ళినపుడు” చేసినంతగా ఇప్పుడూ రైతాంగాన్ని దోపిడి చేస్తుండటంతో రైతాంగం ప్రధాన బాధితురాలుగా ఉన్నది. అందువలన ఈ ప్రభుత్వానికి వ్యతిరేకంగా జరిగే పోరాటంలో రైతాంగం ఊగిసలాట లేకుండా ప్రతిపక్ష పాత్ర పోషిస్తుంది.”

అయినప్పటికీ వలస దోపిడీ అంతం కావటంతోనే సామ్రాజ్యవాదం నుండి విముక్తి కావటం పూర్తి కాదు (ఎందుకంటే సామ్రాజ్యవాదం చేతులు ముడుచుకుని కూర్చోదు). కాబట్టి రైతాంగంలోని కొన్ని వర్గాలను విప్లవ సంఘటన నుండి మినహాయించే అంశాన్ని పునరాలోచించాల్సి వస్తున్నది. అభివృద్ధి చెందిన మెట్రోపాలిటన్ దేశాల పెట్టుబడిలో సామ్రాజ్యవాదం ఒక అంతర్భాగంగా ఉంటుంది. ఈ అభివృద్ధి చెందిన దేశాల పెట్టుబడి అలా ఉన్నంత కాలం తన ఆధిపత్యాన్ని కొత్త కొత్త రూపాలతో కొనసాగిస్తూనే ఉంటుంది. ఇపుడు ఇదే జరుగుతున్నది. సామ్రాజ్యవాదం తన రూపం మార్చుకొని, వలస దోపిడీ నుండి బయటపడిన దేశాలలో ఏర్పడిన ప్రభుత్వాలను అధికారం నుండి తొలగించి, నయా-ఉదారవాద ప్రభుత్వాలను అధికారంలో కూర్చోబెట్టింది. వలస దోపిడీకి వ్యతిరేకంగా మూడవ ప్రపంచదేశాలు చేసిన పోరాటంలో రూపుదిద్దుకున్న వర్గ సంఘటనను కొత్తరూపు దాల్చిన సామ్రాజ్య వాదం విచ్ఛిన్నం చేసింది. అంతర్జాతీయ పెట్టుబడిదారుల కూటమిలో బడా బూర్జువా వర్గాన్ని భాగస్వామిగా చేసింది. సామ్రాజ్యవాద దేశాల నుండి వస్తున్న పెట్టుబడుల ద్వారా ఏర్పాటు చేసే సంస్థలలో ఉద్యోగాలు ఇస్తామనే వాగ్దానంతో పట్టణ మధ్య తరగతిలోని గణనీయమైన భాగం మద్దతును కూడా పొంద గలిగింది. “విజాతీయకరణ చేయటం” ద్వారా అది మూడవ ప్రపంచదేశాలలోని సహజ వనరులపై ఆధిపత్యాన్ని సాధించింది. అన్నిచోట్లా కార్మికవర్గంపై దాడులకు దిగింది. అభివృద్ధి చెందిన దేశాలలో కార్మిక వర్గంపై పారిశ్రామిక కార్యకలాపాలను వెనుకబడిన దేశాలకు తరలిస్తామని బెదిరించటం, నిజంగా తరలించడం ద్వారా దాడి చేసింది. వెనుకబడిన దేశాలలో వాణిజ్య సరళీకరణ ద్వారా సాంకేతిక మార్పులను శీఘ్రతరం చేయడం ద్వారా, స్వాతంత్ర్యం సాధించుకున్న తర్వాత ఏర్పడిన ప్రభుత్వాలు వ్యవసాయ రంగానికీ, చిన్న ఉత్పత్తిదారులకూ కల్పించిన రక్షణలను తొలగించటం ద్వారా శ్రామిక ప్రజలలో నిరుద్యోగాన్ని పెంచింది. ఫలితంగా ఈ రంగాలలో పని చేస్తున్నవారు దరిద్రంలోకి జారిపోయి, ఇతర చోట్ల ఉపాధిని వెదుక్కోవలసి వస్తున్నది. సామ్రాజ్యవాద ఆధిపత్యానికి వ్యతిరేకంగా నిలబడుతున్న సోవియట్ యూనియన్ కూలిపోవటంతో నూతన రూపం లో సామ్రాజ్యవాదం ఆధిపత్యం సాధించటం సులభమైంది.

నూతన రూపంలో ఉన్న సామ్రాజ్యవాదం ఆధ్వర్యంలో అధికారంలోకి వచ్చిన నయా-ఉదారవాద ప్రభుత్వాలు సమాజంలో సంపద, ఆదాయ అసమానతలను తీవ్రం చేశాయి. పేద ప్రజల మాదిరిగా ధనికులు తమ ఆదాయంలో ఎక్కువ శాతిన్ని వినియోగం కోసం ఖర్చు పెట్టరు కాబట్టి మొత్తం ఆదాయాలతో పోల్చినపుడు మొత్తం వినిమయం తగ్గింది. వినియోగంలో తగ్గుదలతో డిమాండ్ తగ్గి, అధికోత్పత్తి సమస్య వస్తుంది. ఇటువంటి సంక్షోభ సమయంలో ప్రపంచ గుత్త పెట్టుబడులతో మమేకమైన బడా పెట్టుబడిపై పెరుగుతున్న వ్యతిరేకతను దారి తప్పించటానికి నయా-ఉదారవాద ప్రభుత్వాలు సమాజంలో చీలికలు తీసుకురావటం, ప్రజల ప్రతిఘటనా శక్తిని మొద్దు బార్చటం, ఉద్యమాలను అణచివేయటం కోసం నయా-ఫాసిస్టు శక్తులతో జట్టు కడుతున్నాయి. ఈ మధ్యకాలంలో ఇటు వంటి పరిణామాలను అనేక దేశాలలో (మూడ వ ప్రపంచ దేశాలలో కూడా) చూస్తున్నాం.

అందువలన అంతర్జాతీయ ద్రవ్య పెట్టుబడుల ఆధ్వర్యంలో సామ్రాజ్యవాదం నూతన రూపం తీసుకున్న సందర్భాన్ని దృష్టిలో పెట్టుకొని, ఈ రోజు కార్మిక-కర్షక సంఘటన అంశాన్ని పరిశీలించాలి. ఫ్యూడల్ శక్తులతో సత్సంబంధాలను కొనసాగిస్తూ, అంతర్జాతీయ ద్రవ్య పెట్టుబడులతో మమేకమైన జాతీయ బడా పెట్టుబడి ఆధిపత్య కూటమికి వ్యతిరేకంగా ఈ రోజు మూడవ ప్రపంచ దేశాలలో పోరాటాలు జరగాలి. మూడవ ప్రపంచ దేశాలలో కార్మికవర్గం సంఖ్య తక్కువ కాబట్టి ఈ కూటమికి వ్యతిరేకంగా పోరాడే శక్తులలో రైతాంగం పెద్ద సంఖ్యగా ఉన్నది. ఈ కూటమి సామ్రాజ్యవాద దేశాల మద్దతుతో పాటు మూడవ ప్రపంచ దేశాలలోని నయా-ఫాసిస్టు ప్రభుత్వాల మద్దతు కూడా పొందుతున్నది. స్వాతంత్ర్యానంతర ప్రభుత్వాలు వ్యవసాయా నికి కల్పించిన రక్షణలు, మద్దతును తర్వాత ఏర్పడిన ప్రభుత్వాలు ఉపసంహరిస్తున్నాయి. అందువలన వలస కాలంలో “మిగులు ఉత్పత్తిని తరలించుకు వెళ్ళినపుడు” చేసినంతగా ఇప్పుడూ రైతాంగాన్ని దోపిడి చేస్తుండటంతో రైతాంగం ప్రధాన బాధితురాలుగా ఉన్నది. అందువలన ఈ ప్రభుత్వానికి వ్యతిరేకంగా జరిగే పోరాటంలో రైతాంగం ఊగిసలాట లేకుండా ప్రతిపక్ష పాత్ర పోషిస్తుంది.

భారతదేశంలో లభిస్తున్న లెక్కలు నయా-ఉదారవాదం కింద రైతాంగం ఎదుర్కొంటున్న దుస్థితిని కళ్ళకు కడుతున్నాయి. గ్రామీణ ప్రాంతంలో తలకు, రోజుకు 2,200 కేలరీల ఆహారం తీసుకోలేని వారు నయా-ఉదారవాద విధానాలు ప్రారంభమైన (1991) 1993-94లో 58 శాతం ఉన్నారు. ఇది కనీస ఆహారమని గతంలో దేశంలో ఉన్న ప్రణాళికా సంఘం నిర్ణయించింది. 2011-12లో ఇది 68 శాతానికి పెరిగింది. 2017-18 నాటికి పరిస్థితి పూర్తిగా దిగజారింది. ప్రభుత్వం సర్వే వివరాలను వెల్లడించకపోవటంతో పాటు సర్వే పద్ధతిని కూడా మార్చివేసింది. దానితో గత సంవత్సరాల లెక్కలతో ప్రస్తుత సమాచారాన్ని పోల్చటం కష్టంగా మారింది. బహిరంగంగా లభిస్తున్న సమాచారాన్ని ఉపసంహరించారు. సమాచారాన్ని ఉపసంహరించిన 2017-18లో నిర్దేశిత కేలరీల ఆహారం అందని వారు 80.5 శాతానికి పెరిగారు.

> **“ కులవ్యవస్థతో విభజించబడిన గ్రామీణ సమాజంతో కూడిన భారత్ లాంటి దేశంలో కులాలతో కూడిన అనేక సమూహాలు ఉన్నాయి. ఆర్థికవ్యవస్థలో పెట్టుబడిదారీ విధానం అభివృద్ధి అవుతున్నప్పటికీ ఈ సమూహాలలో సహృద్భావం కొనసాగుతున్నది. ప్రజా సమూహాలలో కొనసాగుతున్న ఈ భావజాలం నయా-ఉదారవాదానికి, నయా-పాసిస్టు విధానాలకు వ్యతిరేకంగా చేస్తున్న పోరాటా లలో రైతాంగానికి తరగని బలంగా ఉన్నది. ”**

ఇందులో వెల్లడైన వివరాలు మరో అంశాన్ని కూడా బలపరుస్తున్నాయి. 1991, 2011 తర్వాత జనాభా లెక్కలు సేకరించ లేదు. 1991, 2011 మధ్య సేకరణలను పోల్చినపుడు రైతుల సంఖ్య 1.50 కోట్లు తగ్గిపోయింది. వారు వ్యవసాయ కార్మికులుగా మారటం లేదా ఉపాధిని వెదుక్కొంటూ పట్టణాలకు వలస పోవటం జరిగింది. ఉపాధి కల్పన చాలా తక్కువగా ఉండటంతో, వీరి చేరికతో ఉన్న పనిని పంచుకొనే వారి సంఖ్య పెరిగింది. ఫలితంగా కార్మికులకు వస్తున్న సగటు ఆదాయం తగ్గిపోయింది.

### సామ్రాజ్యవాద వ్యతిరేక పోరాటంలో బలమైన శక్తి రైతాంగం

నయా-ఉదారవాద విధానాల బాధితులుగా ఉన్న రైతాంగం ఆ విధానాలకు వ్యతిరేకంగా జరిగే పోరాటంలో అత్యంత బలమైన శక్తిగా ఉన్నారు. బ్రిటన్‌లో సాంప్రదా యికంగా పెట్టుబడిదారీ విధానం అభివృద్ధి చెందుతున్న క్రమంలో, పురాతన పద్ధతిలో పెట్టుబడిని సమీకరించటం కోసం రైతులు భూములలోకి వెళ్ళకుండా నిరోధించటానికి భూముల చుట్టూ కంచెలు వేయటాన్ని కార్ల్ మార్క్స్ చూశాడు. రైతులు అదృశ్యం కావటం, వ్యవసాయంలో రైతు స్థానంలో పెట్టుబడిదారీ వ్యవసాయం రావటంతో గ్రామీణ జీవితానికి వెన్నెముకగా ఉన్న పాత సమాజం కూడా ధ్వంసమైపోయింది. పునాది లేని, చెల్లాచెదరై ఒకరికొకరు తెలియని వ్యక్తులు కొత్తగా ఉని కిలోకి వస్తున్న పెట్టుబడిదారి ఫ్యాక్టరీలలో ఉద్యోగాలను వెదుక్కొంటూ పట్టణాలలో గుమికూడారు. పరస్పర సంబంధాలు, కార్మికసంఘాల ద్వారా కాల క్రమంలో ఒక సమాజంగా ఉనికిలోకి వచ్చారు. ఈ సమాజం లోకి విప్లవ సిద్ధాంతాన్ని బయటి నుండి ప్రవేశపెట్టాలనీ, పాత సమాజాన్ని ధ్వంసం చేసిన (బూర్జువా) వ్యవస్థను ఈ వర్గం నాశనం చేస్తుందని మార్క్స్ అర్థం చేసుకున్నాడు.

యూరోపియన్‌లు సమశీతోష్ణ వాతావరణం ఉన్న “కొత్త ప్రపంచ” దేశాలకు వలస వెళ్లారు. అక్కడి స్థానికులను తరిమివేసి, వారి భూములను ఆక్రమించుకొని వ్యవసాయం చేపట్టారు. అయితే వారు ఆ మాటకున్న వాస్తవ అర్థంలో చూస్తే ఏ విధంగానూ “వ్యవసాయ సమాజం” కాలేరు. కానీ సమశీతోష్ణ మండలాలలోని “సెటిల్ మెంట్ కాలనీలకు” భిన్నంగా జనసాంద్రత అధికంగా ఉండే ఉష్ణప్రాంతాలలో “దురాక్రమణతో ఏర్పరుచుకున్న కాలనీల్లోని” పాత రైతాంగం గతంలో వలెనే వ్యవసాయం చేసుకొంటున్నారు. సామ్రాజ్యవాద పాలకులు ఆ రైతుల ఆదాయాలను పూర్తిగా కుదించే విధానాలను అనుసరించారు. వలస పాలన లోని పన్నుల విధానం ద్వారా వచ్చిన ఆదాయాన్ని ఉపయోగించుకొని, అభివృద్ధి చెందిన దేశాలలో పండించలేని, అక్కడి ప్రజలకు అవసరమైన ప్రాథమిక ఉత్పత్తులను పూర్తి ఉచితంగా తరలించుకు వెళ్ళారు. అభివృద్ధి చెందిన దేశాలలో తయారైన పారిశ్రామిక ఉత్పత్తులను తప్పనిసరిగా దిగుమతి చేసుకోవాలని ఆంక్షలు విధించటం ద్వారా స్థానిక వృత్తులను నాశనం చేసి, వృత్తులు కోల్పోయినవారు వ్యవసాయం మీద ఆధార పడేలా చేశారు. తద్వారా వ్యవసాయంపై ఆధారపడి బతుకుతున్న ప్రజల ఆదాయాన్ని పరోక్షంగా తగ్గించారు. ప్రభుత్వం తగినన్ని పెట్టుబడులు పెట్టకపోవటంతో వ్యవసాయం చేసే భూమి విస్తరించలేదు. ఫలితంగా కౌలు రేట్లు పెరిగి, కూలిరేట్లు తగ్గిపోయాయి. వలస పాలనలో తరచుగా కరువులు చుట్టుముట్టటం, గ్రామీణప్రాంతంలో తీవ్రమైన కడగండ్లు ఉన్నప్పటికీ భారతదేశంలోని పాత సమాజం–రైతాంగం– దాదాపు యధాతథంగా కొనసాగింది.

వలస పాలకులు ఆక్రమించుకున్న దేశాలలో, ప్రధానంగా ఆసియాలోని వలస, అర్థ వలస దేశాలలోని రైతాంగం వలస పాలనలోనూ, తర్వాత స్వతంత్ర ప్రభుత్వాలు ఏర్పడినపుడు, ఆ తర్వాత నయా–ఉదారవాద ప్రభుత్వాలు ఉనికిలోకి వచ్చిన తర్వాత కూడా ఒక సమాజంగా యధాతథంగా కొనసాగుతున్నారు. భూస్వాములు దాదాపుగా ఈ సమాజానికి బయట ఉంటారు. వలస పాలకులు భూములకు పట్టాలు ఇచ్చి, భూమిని సరుకుగా మార్చటంతో డబ్బు సంపాదించటం కోసం “బయటివారు” తరచుగా ఈ భూముల పట్టాలను కొన్నారు. సంవత్సరంలో ఎక్కువ కాలం అక్కడ నివసించని ఈ భూస్వాములు వ్యవసాయ సమాజంపై రుద్దబడ్డారు. అయితే వీరు రైతులతో కూడిన పాత సమాజం కొనసాగటాన్ని నిరోధించలేకపోయారు. కులవ్యవస్థతో విభజించబడిన గ్రామీణ సమాజంతో కూడిన భారత్ లాంటి దేశంలో కులాలతో కూడిన అనేక సమూహాలు ఉన్నాయి. ఆర్థికవ్యవస్థలో పెట్టుబడిదారీ విధానం అభివృద్ధి అవుతున్నప్పటికీ ఈ సమూహాలలో సహృద్భావం కొనసాగుతున్నది. ప్రజా సమూహాలలో కొనసాగుతున్న ఈ భావజాలం నయా–ఉదారవాదానికి, నయా–పాసిస్టు విధానాలకు వ్యతిరేకంగా చేస్తున్న పోరాటాలలో రైతాంగానికి తరగని బలంగా ఉన్నది.

ఈ మధ్యకాలంలో భారతదేశంలో ప్రభుత్వం ఆర్డినెన్స్‌ల రూపంలో తీసుకొచ్చిన మూడు వ్యవసాయ చట్టాలకు వ్యతిరేకంగా రైతాంగం సంవత్సరం పాటు చేసిన పోరాటంలో ఈ అంశం స్పష్టమైంది. రైతాంగానికి మిగిలిన రక్షణలను కూడా ఈ చట్టాలు తొలగించాయి. ఉదాహరణకు ఆహారధాన్యాల ఉత్పత్తికి ప్రభుత్వం ఇప్పటికీ “కనీస మద్దతు ధరలు” ఇస్తున్నది. వాణిజ్యపంటలకు ఈ మద్దతు ధరల విధానాన్ని రద్దు చేయటంతో పంటల ధరలు పడిపోయి, రైతాంగం అప్పుల ఊబిలో చిక్కుకొని, పెద్దసంఖ్యలో ఆత్మహత్యలు చేసుకొంటున్నారు. రైతులు వ్యతిరేకిస్తున్నప్పటికీ ఆహార వాణిజ్యంలో పాల్గొంటున్న దేశ, విదేశీ సంస్థలు రైతులతో ప్రత్యక్షంగా కాంట్రాక్టు వ్యవసాయం కోసం ఒప్పందాలు చేసుకొనే విధంగా ఈ చట్టాలను రూపొందించారు. రైతు ఉద్యమంతో ప్రభుత్వం ఈ చట్టాలను ఉపసంహరించుకోవాల్సి వచ్చింది. ఐనా తన పథకాన్ని రద్దు చేసుకోలేదు. అంతిమంగా రైతులు విజయం సాధించారు. తమ సమాజం నుండి లభించిన శక్తివంతమైన మద్దతుతోనే ఈ విజయం సాధ్యమైంది.

ఫ్యూడలిజానికి వ్యతిరేకంగా మాత్రమే కాకుండా సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా

**"సోషలిజానికి జరిగే పరివర్తన క్రమంలో కార్మిక-రైతాంగ సంఘటనలోని ఒక భాగాన్ని విడిచిపెట్టాలనే సమస్యే ఉత్పన్నం కాదు. ఎందుకంటే శ్రామికవర్గ నాయకత్వంలో ప్రజాస్వామిక విప్లవ దశ ముగిసిన వెంటనే అది తనకు వ్యతిరేకంగా మారుతుందని తెలిస్తే, రైతాంగంలోని ఏ ఒక్క భాగమైనా, ఉదాహరణకు ధనిక రైతాంగం అసలు ప్రజాస్వామిక విప్లవంలోనే పాల్గొనదు. ఇటువంటి పరిస్థితులలో అసలు విప్లవమే అసంభవమవుతుంది."**

కూడా జరిగే పోరాటంలో కూడా రైతులు ప్రధానశక్తిగా ఉంటారు. ఇప్పటికీ వారి మధ్య సామాజిక సంబంధాలు బలంగా కొనసాగుతుడటం వారికి మరింత బలాన్నిచ్చింది. మూడవ ప్రపంచ దేశాలలోని శ్రామిక ప్రజలు సామ్రాజ్యవాద ఆధిపత్యానికి వ్యతిరేకంగా పోరాడాలంటే శ్రామికవర్గంతో స్థిరమైన సంబంధాలు కొనసాగించాలి. అనేక ప్రధానాంశాలపై మనం కేంద్రీకరణ చేయాల్సిన అవసరాన్ని ఇవి ముందుకు తెస్తున్నవి.

**పెట్టుబడిదారీ పునఃప్రతిష్ఠికున్న అవకాశాలు**

సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా జరుగుతున్న పోరాటంలో రైతాంగం కీలకమైన పాత్ర నిర్వహిస్తున్నది ఈ పాత్ర పరిస్థితులకు అనుగుణంగా కాకుండా దీర్ఘ కాలంపాటు, అభివృద్ధి చెందిన దేశాలలో పెట్టుబడిదారీ విధానం అంతమయే వరకు కొనసాగుతుంది. అపుడు మనం అనేక నిర్ణయాలకు రావలసి ఉంటుంది. మొదటగా 1920లో సోవియట్ పారిశ్రామికీకరణపై జరుగుతున్న చర్చ సందర్భంలో ఎవ్‌గెని ప్రియోబ్రజెవ్‌స్కీ చేసిన "పురాతన సోషలిస్టు సంపద సమీకరణ" అన్న భావనను తిరస్కరించాలన్న విషయం ముందుకొస్తుంది. సోషలిస్టు పారిశ్రామికీకరణకు వనరులను సమీకరించటం కోసం ధనిక రైతుల ఆదాయాలను కుదించే విధానాలను అనుసరించాలని ప్రియోబ్రజెవ్‌స్కీ ప్రతిపాదించాడు. సైద్ధాంతికంగా ఈ ప్రతిపాదన సమర్ధనీయం కాదు. విప్లవం తరువాత తరుణ సోవియట్ యూనియన్ అవసరాలు ఏవైనప్పటికీ, ఏ విషయంలోనూ పెట్టుబడిదారీ విధాన అభివృద్ధి క్రమాన్ని కాపీ కొట్టే విధంగా సోషలిస్టు నిర్మాణాన్ని కొనసాగించకూడదు. కాబట్టి పెట్టుబడిదారీ విధానానికి ప్రాథమిక పెట్టుబడి సంచయం ఉన్నట్లే సోషలిస్టు వ్యవస్థ అభివృద్ధికి కూడా అదే విధమైన ప్రాథమిక పెట్టుబడి సంచయం ఉండాలని వాదించటం సమర్ధనీయం కాదు. (పెట్టుబడిదారీ విధాన అభివృద్ధికి సామ్రాజ్యవాదం అవసరం కాబట్టి సోషలిస్టు విధాన అభివృద్ధికి కూడా "సామ్రాజ్యవాదం" అవసరం అన్న భావనను ఈ వాదన సమర్థిస్తుంది). సోషలిజం నిర్మాణం కోసం ఏ తరగతి రైతులనూ లక్ష్యంగా పెట్టుకోవలసిన అవసరం లేదు. వ్యవసాయం, ఆహారధాన్యాల ఉత్పత్తిని అభివృద్ధి మార్గాన్ని సోషలిజం అనుసరించాలి. అప్పుడు రైతులు, కార్మికులు తాము చేసిన ఉత్పత్తులను పరస్పరం మార్చుకుంటారు. సామ్రాజ్యవాదం కొనసాగినంత కాలమూ కార్మికులు, రైతాంగ సమూహం మధ్య సంఘటన కొనసాగుతూనే ఉండాలి కాబట్టి ఈ క్రమంలో సోషలిస్టు ప్రాథమిక పెట్టుబడి సంచయం అన్న భావన ఆచరణ రీత్యా అనవసరమైనదిగా మారుతుంది.

రెండవది, సోషలిజానికి జరిగే పరివర్తన క్రమంలో కార్మిక-రైతాంగ సంఘటనలోని ఒక భాగాన్ని విడిచిపెట్టాలనే సమస్యే ఉత్పన్నం కాదు. ఎందుకంటే శ్రామికవర్గ నాయకత్వంలో ప్రజాస్వామిక విప్లవ దశ ముగిసిన వెంటనే అది తనకు వ్యతిరేకంగా మారుతుందని తెలిస్తే, రైతాంగంలోని ఏ ఒక్క భాగమైనా, ఉదాహరణకు ధనిక రైతాంగం అసలు ప్రజాస్వామిక విప్లవంలోనే పాల్గొనదు. ఇటువంటి పరిస్థితులలో అసలు విప్లవమే అసంభవమవుతుంది. రెండవది, ప్రజాస్వామిక విప్లవం కేవలం ఫ్యూడల్ శక్తులకు వ్యతిరేకంగా మాత్రమే కాకుండా నూతన రూపంలో ఉన్న సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా కూడా జరుగుతున్నప్పుడు ఈ విప్లవం ఎప్పుడూ తమకు వ్యతిరేకంగా మారదని రైతాంగానికి హామీ ఇవ్వాల్సి ఉన్నది. అపుడు ఆ వర్గం విప్లవానికి దృఢమైన మద్దతుదారుగా ఉంటుంది. నయా-ఉదారవాద ప్రభుత్వాలను గద్దె దించటానికి, ప్రజాస్వామిక విప్లవాన్ని ముందుకు తీసుకువెళ్ళటానికి సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా ఏర్పాటు చేసిన వర్గ సంఘటన సోషలిజానికి పరివర్తన చెందే క్రమం పూర్తయ్యే వరకూ చెక్కు చెదరకుండా ఉంటుంది. సోషలిజానికి పరివర్తన చెందే క్రమంలో ఆస్తి సంబంధాలలో అవసరమైన మార్పులను తప్పనిసరిగా స్వచ్ఛందంగా తీసుకురావాలి (ఉదాహరణకు వ్యక్తిగత ఆస్తిని సహకార, ఉమ్మడి ఆస్తిగా మార్పుచేసే చర్యలు). సంబంధించిన వారందరికీ ఈ మార్పులు ప్రయోజనం కల్పిస్తాయని ఉదాహరణల ద్వారా చూపిస్తూ, ప్రతివారికీ ప్రయోజనం కలిగించే విధంగా ఉత్పత్తిశక్తులు అభివృద్ధి చెందుతాయని వారిని ఒప్పించాలి.

ధనికరైతులు నమూనా పెట్టుబడిదారీ సమాజంగా ఉంటారు. పెట్టుబడిదారీ విధానం, మిగిలిపోయిన ఫ్యూడల్, సామ్రాజ్య వాద అవశేషాల ఆధిపత్యానికి వ్యతిరేకంగా పోరాటాలు అభివృద్ధి చెందుతూ, సోషలిజానికి పరివర్తన చెందే క్రమంలో వారిని కార్మిక-కర్షక సంఘటనలో ఉంచుకోవటం లోపలి నుండి పెట్టుబడిదారీ విధాన అభివృద్ధికి దారి తీయదా అన్న సందేహాలు వస్తాయి. దానితో పాటు పరివర్తన కాలంలో సరుకుల ఉత్పత్తి ఉంటుంది కాబట్టి, కార్మిక-కర్షక సంఘటనలో ధనిక రైతులను మినహాయించకుండా కలుపుకుపోవటం (పెట్టుబడిదారీ విధానం అభివృద్ధి క్రమంలో రైతులలో వర్గీకరణ జరుగుతుంది) వలన పెట్టుబడిదారీ విధాన పునరుద్ధరణ వైపుకు పోవటానికి, సోషలిజానికి జరిగే పరివర్తనను దెబ్బతీయటానికి దారి తీస్తుందని భావిస్తారు.

సరుకు ఉత్పత్తిని గురించిన పొరపాటు భావనలే ఈ తప్పుడు వాదనకు దారితీస్తాయి. మార్కెట్ కోసం ఉత్పత్తి చేసే ప్రతి ఉత్పత్తి సరుకు కాదు. కాబట్టి పెట్టుబడిదారీ విధాన పునరుద్ధరణకు దారితీయదు. భారతదేశం, చైనా లాంటి దేశాలలో కొన్ని సమయాలలో కూలీలను కూడా వినియోగించుకొని, శతాబ్దాల తరబడి చిన్న, సన్నకారు ఉత్పత్తిదారులు మార్కెట్ కోసం చేస్తున్న ఉత్పత్తి పెట్టుబడిదారీ విధానానికి దారితీయటం లేదు. ఉత్పత్తి క్రమంలో ఉత్పత్తిదారుల మధ్య అసమానతలను పెంచే సహజ లక్షణం సరుకుల ఉత్పత్తి విధానంలో ఉంటుందని, అది పెట్టుబడిదారీ విధానానికి దారి తీస్తుందని మార్క్స్ చెప్పిన అర్థంలో జరిగే సరుకుల ఉత్పత్తి ఇది కాదు.

సరుకుల ఉత్పత్తిని కొనుగోలు చేసిన వారికి మారకపు విలువ, ఉపయోగపు విలువ రెండూ ఉన్నప్పటికీ, అమ్మేవారు దానిలో మారకపు విలువను, డబ్బును మాత్రమే చూస్తారు. ఆల్‌ఫ్రెడ్ మార్షల్ సృష్టించిన చేపలను అమ్మే

> **“ కార్మిక-కర్షక సంఘటనలో రైతాంగం లోని అర్ధకార్మిక శక్తులే కాకుండా రైతాంగ బాహుళ్యం మొత్తం ఉండి కూడా సోషలిజానికి పరివర్తన చెందేటపుడు పెట్టుబడిదారీ లక్షణాలు వ్యక్తం కాకపోయినప్పటికీ ఈ సంఘటనలో తీవ్రమైన వైరుధ్యాలు ఉంటాయి. పరిణామకాలంలో ఐక్య సంఘటనకు నాయకత్వం వహిస్తున్న ప్రభుత్వం ఈ వైరుధ్యాలను పరిష్కరించాలి. ”**

వ్యక్తి, మార్కెట్‌లో అమ్మగా మిగిలిన వాటిని తన అవసరానికి వినియోగించుకుంటాడు. అతడు సరుకుల ఉత్పత్తిదారుడు కాదు. అదే విధంగా భారతదేశంలోని జాజ్‌మని విధానం లోవలె వివిధ రకాలైన సరుకులు, సేవలను ఉత్పత్తి చేసేవారు ఆ సరుకులను తమ మధ్య మారకం చేసుకోవటానికి ధనాన్ని వినియోగించినప్పటికీ, వారు సరుకుల ఉత్పత్తిదారులు కాదు. ఉదాహరణకు సుదూర ప్రాంతాలలో జరిగే వాణిజ్యంలో వలె కొనుగోలుదారుడు, అమ్మకందారుడు ఒకరికొకరు తెలియకపోవటం సరుకుల ఉత్పత్తిలో ప్రధానమైన అంశం. తెలియని మార్కెట్ కోసం జరిగే వాణిజ్యం కూడా అవసరమైన పరిస్థితిని మాత్రమే కల్పిస్తుంది. కానీ ఉత్పత్తిదారుల మధ్య వర్గీకరణను పెంచి, పెట్టుబడిదారీ విధాన అభివృద్ధికి దారి తీయటానికి అది మాత్రమే సరిపోదు.

పెట్టుబడిదారీ విధానం ఏ విధంగా ప్రారంభం అయింది, ఎలా అభివృద్ధి అయింది అన్న అంశాలపై సరైన అవగాహన లేకపోవటం వలననే ధనికరైతును పక్కన పెట్టకపోతే సోషలిజానికి పరివర్తన జరిగే క్రమంలో లోపలి నుండే పెట్టుబడిదారీ విధానాభివృద్ధి జరుగుతుందనే తప్పుడు అవగాహన కలుగుతున్నది. పెట్టుబడిదారీ విధానం అనేది సంక్లిష్టమైన పరిసితులనుండి ఉద్భవిస్తుంది. అది ఉత్పత్తిదారుల మధ్య అలుపు తీర్చుకోడాని బ్రతకడానికి అవకాశం లేని డార్వినియన్ పోరాటాన్ని సృష్టిస్తుంది. అది నిరంతరాయంగా మరింత, మరింత ఎక్కువ ఉత్పత్తిని సాగించే డార్వీనియన్ పోరాటం. ఇటువంటి వ్యవస్థకు అంటే పెట్టుబడిదారీ వ్యవస్థకు దారితీసే సరుకుల ఉత్పత్తి కేవలం మార్కెట్ కోసం సరుకుల ఉత్పత్తి చేయడం వల్ల ఏర్పడదు, అటువంటి ఉత్పత్తిలో వేతన కార్మికులను ఉపయోగించుకున్నప్పటికీ. అందువల్ల రైతాంగంలోని అర్ధకార్మికవర్గంతో సహా మొత్తం రైతాంగం కార్మిక-కర్షక సంఘటనలో భాగంగా ఉంటే పెట్టుబడిదారీ వ్యవస్థ పునరుద్ధరించబడుతుంది అనే భయాలు అతిశయోక్తితో కూడుకున్నవి మాత్రమే.

**సోషలిజానికి పరివర్తన దశలో వైరుధ్యాలు**

కార్మిక-కర్షక సంఘటనలో రైతాంగం లోని అర్ధకార్మిక శక్తులే కాకుండా రైతాంగ బాహుళ్యం మొత్తం ఉండి కూడా సోషలిజానికి పరివర్తన చెందేటపుడు పెట్టుబడిదారీ లక్షణాలు వ్యక్తం కాకపోయినప్పటికీ ఈ సంఘటనలో తీవ్రమైన వైరుధ్యాలు ఉంటాయి. వారిలో ఉన్న వివిధ తరగతులకు వివిధ రకాలైన ప్రయోజనాలు ఉంటాయి. వ్యవసాయ కార్మికుల వేతనాలు తక్కువగా ఉంచాలని ధనికరైతు భావిస్తాడు. అది వ్యవసాయ కార్మికుల ప్రయోజనాలకు, సోషలిజం నిర్మాణానికి విరుద్ధమైనది. పరిణామ కాలంలో ఐక్య సంఘటనకు నాయకత్వం వహిస్తున్న ప్రభుత్వం ఈ వైరుధ్యాలను పరిష్కరించాలి.

కొన్ని విషయాలలో రాజీ ధోరణితో వ్యవహరించాలి. కొన్నింటిలో రాజీ పడ కూడదు. పని పరిస్థితులు, వేతనాలను నిర్ణయించటం, వ్యవసాయోత్పత్తుల ధరలను నిర్ణయించటంలో రాజీ లేకుండా వ్యవహరించాలి. వ్యవసాయ కార్యకలాపాలను యాంత్రీ కరణ చేసేటపుడు వ్యవసాయ కార్మికుల సహకార సంఘాలను ఏర్పాటు చేసి, మానవ శ్రమ స్థానంలో వినియోగించే యంత్రాలకు వారిని యజమానులను చేయాలి. ఫలితంగా యాంత్రీకరణ వలన పనులు కోల్పోవటంతో వచ్చిన వేతన నష్టాన్ని యంత్రాలను అద్దెకివ్వటం ద్వారా వచ్చిన లాభాలతో భర్తీ చేసుకుంటారు.

ఇటువంటి చర్యలు మంచి ఫలితాలను ఇవ్వాలంటే తప్పనిసరిగా కొన్ని ఇతర చర్యలు కూడా తీసుకోవాలి. నిరుద్యోగం లేకుండా చేయకపోతే వేతనాల విషయంలో తీసుకొనే చర్యలు తగిన ఫలితాలను ఇవ్వవు. యజమానులు కొన్నిసార్లు బహిరంగంగా, కొన్ని సందర్భాలలో రహస్యంగానూ నిర్ణయించిన వేతనాల కన్నా తక్కువ వేతనాలను వ్యవసాయ కార్మికులకు చెల్లిస్తారు. యజమానులు- కార్మికుల మధ్య, ఇంకా ఇటువంటి వైరుధ్యంతో కూడిన సంబంధాలను ప్రభుత్వం సమగ్ర దృక్పథంతో క్రమబద్ధీకరించాలి. ఇటువంటి సమగ్రమైన పరిస్థితులను కల్పించటం కోసం రాజ్యాంగబద్ధంగా గ్యారంటి చేయబడిన సామాజిక, రాజకీయ హక్కులు, ప్రాథమిక, సార్వజనీన హక్కులతో పాటు న్యాయమైన ఆర్థిక హక్కులు కల్పించాలి.

పెట్టుబడిదారీ విధానం నాశనం చేసిన సమాజం స్థానంలో నూతన సమాజాన్ని నిర్మించటం కోసం కృషి చేస్తున్నపుడు ఇది అనవసరమని కొందరు భావించవచ్చు. వ్యక్తులకు హక్కులు కల్పించటం వారిని ఇంకా దిగువస్థాయి వారిగా చూడటానికి దారి తీస్తుందని, ఇది సోషలిజం సాధించాలనే లక్ష్యాన్ని ఓడించటానికి కారణమౌతుందని కొందరు భావిస్తారు.

ఒక వ్యక్తి లేదా కొందరు వ్యక్తులు సమాజం నుండి మినహాయించబడినపుడు, సమాజం చేత వారు పీడనకు గురయే పరిస్థితులు ఉన్నపుడు వ్యక్తికి హక్కులు ఇవ్వటం అనే సమస్య వస్తుంది. వ్యక్తిని లేదా కొందరు వ్యక్తులను సమాజం నుండి మినహాయించటం లక్ష్యంగా పెట్టుకున్నపుడు హక్కులు ఇవ్వటం ద్వారా వారికి రక్షణ కల్పిస్తారు. కొందరు వ్యక్తులను లక్ష్యంగా పెట్టుకొని, వారిని హింసకు గురిచేస్తున్నపుడు వ్యక్తిగత హక్కులు రక్షణ కవచంలా పనిచేస్తాయి. ప్రభుత్వం ప్రతివ్యక్తికి మౌలికమైన ఆర్థికహక్కులు ఇచ్చినపుడు వారికి తగిన స్వేచ్ఛ లభిస్తుంది. నూతన సమాజ నిర్మాణానికి అది ప్రాతిపదిక అవుతుంది. వ్యక్తులకు కొన్ని మౌలికమైన ఆర్థికహక్కులు ఇచ్చినపుడు సోషలిజానికి పరివర్తన చెందటమే కాకుండా, సోషలిజాన్ని నిర్మించటమే జరుగుతుంది (రాజకీయ, సామాజిక హక్కులను గురించి ఇక్కడ మనం చర్చించటం లేదు).

నిజానికి పెట్టుబడిదారీ విధాన పునరుద్ధరణ జరగకుండా ఉండాలన్నా, సోషలిజానికి జరిగే పరివర్తనను ఆటంకపరిచే చారిత్రాత్మక ప్రయత్నాలను నిరోధించాలన్నా ఇటువంటి వ్యక్తిగత హక్కుల వ్యవస్థ అవసరం. అటువంటి మౌలిక ఆర్థిక హక్కులలో ముఖ్యమైనది ఉద్యోగ హక్కు. ఒకవేళ ఉద్యోగం ఇవ్వలేకపోతే అతనికి నిరోద్యోగ భృతికి బదులుగా పూర్తి వేతనం చెల్లించాలి. కార్మిక రిజర్వు సైన్యం అంటే నిరుద్యోగులు లేకుండా పూర్తి ఉపాధి కల్పనకూ, పెట్టుబడిదారీ విధానానికీ పొస

గదు. దీనికి భిన్నంగా గత సోషలిస్టు దేశాలైన సోవియట్ యూనియన్, తూర్పు యూరప్ దేశాలలో పూర్తి ఉద్యోగిత ఉండటమే కాకుండా, కార్మికుల కొరత కూడా ఉండేది. పెట్టుబడిదారీ దేశాలలో వలె "డిమాండ్ కొరత" కాకుండా, "వనరుల కొరత"తో ఉన్న దేశాలని జానోస్ కొర్నాయ్ లాంటి ఆర్థికవేత్తలు వీటిని గురించి పేర్కొన్నారు. సోషలిజానికి పరివర్తన జరిగేట ప్పుడు పెట్టుబడిదారీ పెడధోరణులకు దారితీసే లక్షణాలలో నిరుద్యోగం ఒకటి. సార్వజనీన ఉద్యోగ హక్కు ను చట్టబద్ధం చేయటం ద్వారా పెట్టుబడిదారీ విధానం వైపుకు జారిపోకుండా రక్షణ కల్పించవచ్చు (ఎటువంటి చట్టబద్ధ హక్కులు కల్పించినా ప్రతీఘాత విప్లవాన్ని నిరోధించలేం).

> **"అనేక కారణాల వలన సహకార సంఘాలు, రైతుల భూములను కలిపివేసి సహకార వ్యవసాయం చేయవలసిన అవసరం కలుగుతుంది. అటువంటి సహకార సంఘాలలో స్వచ్ఛందంగా చేరటానికి వారికి అవి ప్రోత్సా హకాలుగా కూడా ఉపయోగపడతాయి. భూముల కొరత తీవ్రంగా ఉన్న ఆసియా దేశాలలో వ్యవసాయోత్పత్తులను పెంచటానికి తద్వారా మొత్తం అభివృద్ధికి "భూమి గరిష్టీ కరణ" కీలక మైనది."**

**స్వచ్ఛందంగా సహకార సంఘాలను ఏర్పాటు చేసే దిశగా**

సామ్రాజ్యవాదంతో కూడిన నయా-ఉదా రవాదానికి వ్యతిరేకంగా జరుగుతున్న పోరాటానికి పునాదిగా కార్మిక-కర్షక ఐక్యత రాయిలాగా స్థిరంగా ఉంటుందని ఇప్పటి వరకు చర్చించాం. సోషలిజానికి పరివర్తన జరిగే కాలమంతటిలోనూ రైతాంగంలోని ఏ తరగతినీ వదులుకోకుండా కార్మికవర్గం ఈ ఐక్య సంఘటనను కొనసాగించాలి. ప్రపంచ బడా పెట్టుబడులతో సమ్మిళితమై వ్యవహరిస్తున్న దేశీయ గుత్త పెట్టుబడి ఆధిపత్యానికి, నయా -ఉదారవాద పెట్టుబడిదారీ విధానానికి వ్యతిరేకంగా జరుగుతున్న పోరాటంలో ధనిక రైతులతో పాటు మొత్తం రైతులు భాగస్వాములు గా ఉంటారు. సోషలిజానికి జరిగే పరివర్తనా కాలంలోనూ వీరు మిత్రులుగానే ఉంటారు.

మొదటి సంఘటనలోని మిత్రులైన ధనికరైతులను ఒదులుకోకపోవటం వల్ల పెట్టుబడిదారీ విధానం పునరుద్ధరించబడు తుందన్న భయాలు ఉన్నాయి. ఆ భయాలను మరీ ఎక్కువ చేసి చెబుతున్నారని మనం వాదిస్తు న్నాం. కొన్ని మౌలిక హక్కులను చట్టబద్ధం చేయటం ద్వారా పెట్టుబడిదారీ విధాన పునరుద్ధరణకు అడ్డుకట్ట వేయవచ్చు.

సోషలిజానికి జరిగే పరివర్తనలో కార్మిక-కర్షక ఐక్య సంఘటనలో రైతాంగం అంతా భాగస్వామిగా ఉంటారు. అదే సమయంలో భూమితో పాటు ఆస్తులపై రైతాంగ యాజమా న్యం స్థానంలో స్వచ్ఛం దంగా సహకార సంఘాల యాజమాన్యాన్ని తీసుకురావాలి. భూమి విలువ ప్రాతిపదికగా సహకార సంఘంలోని రైతు వాటా విలువను మొదట నిర్ణయిస్తారు. సహకార సంఘం విలువ పెరిగే కొద్దీ భూమి విలువ తగ్గుతుంది. తర్వాత శ్రమ పై వచ్చిన ఆదాయం ప్రాతిపదికగా రైతులకు చెల్లింపులు చేస్తారు.

అనేక కారణాల వలన సహకార సంఘా లు, రైతుల భూములను కలిపివేసి సహకార వ్యవసాయం చేయవలసిన అవసరం కలుగు తుంది. అటువంటి సహకార సంఘాలలో స్వచ్ఛందంగా చేరటానికి వారికి అవి ప్రోత్సా హకాలుగా కూడా ఉపయోగపడతాయి. భూము ల కొరత తీవ్రంగా ఉన్న ఆసియా దేశాలలో వ్యవసాయోత్పత్తులను పెంచటానికి తద్వారా మొత్తం అభివృద్ధికి "భూమి గరిష్టీ కరణ" కీలకమైనది. అంటే అర్థం సాధ్యమై నంతవరకు భూమి విస్తీర్ణాన్ని పెంచడం, పంట దిగుబడితో పాటు, బహుళపంటల విధానంతో వ్యవసాయ ఉత్పాదకతను పెంచడం. భూమిని గరిష్టీకర ణలో వ్యక్తిగత రైతు ఉత్పత్తి కన్నా సహకార ఉత్పత్తి మేలైనది. ఈ పాయింటులో అనేక అంశాలున్నాయి.

మొదటిది, రైతులు వ్యక్తిగత భూములకు ఏర్పాటు చేసిన సరిహద్దు గట్లతో భూమి వృథా అవుతున్నది. సహకార వ్యవసాయం కోసం భూములను కలిపివేసినపుడు ఈ గట్లను తొలగించటంతో, ఎంత తక్కువగా అయినప్ప టికీ భూమి విస్తీర్ణం పెరుగుతుంది. రెండవది, రైతుల వ్యక్తిగత, కుటుంబ పొలాలలో కాకుండా భూములు, శ్రామికులను కలిపి సహకార ఉత్పత్తి చేసేటపుడు పెట్టుబడి పెట్టటం ద్వారా కొన్ని పథకాలను అమలు చేస్తే భూమి ఉత్పాదకత పెరుగుతుంది. నీటి పారుదల ప్రాజెక్టులను నిర్మించటం, నీటిని సక్రమంగా అందించటం కోసం అడ్డుకట్టలు వేయటం, వ్యవసాయం చేయని భూమిని సాగులోకి తీసుకురావటం, భూమి కోతను నివారించటం, కొండ ప్రాంతాలలో భూ చరియలు విరిగిపడ టాన్ని నివారించటం, అడవులు పెంచటం, అటవీ ప్రాంతాలలో క్రూర జంతువులు పంటలను నాశనం చేయకుండా రక్షణలు ఏర్పాటు చేయటం తదితరాలను ఉదాహరణగా చెప్పుకోవచ్చు. చైనాలో కమ్యూన్‌లలో ఉన్న ప్రజలు వీటి వలన బాగా లబ్ధిపొందారు. కేంద్ర పథకాల ద్వారా ఈ కమ్యూన్‌లకు వచ్చిన నిధులకు అదనంగా తమ స్వంత నిధులు, శ్రమతో ఈ కమ్యూన్‌లలోని ప్రజలు కొన్ని పథకాలను అమలు చేశారు. మూడు, వాటి అనుకూలతను బట్టి వివిధ రకాల భూములలో వివిధ రకాల ప్రత్యేక పథకాలను అమలు చేశారు. వ్యక్తిగత వ్యవసాయంలో ఇది సాధ్యం కాదు. నాలుగు, కొన్ని పంటలకు భూములు బాగా సిద్ధం చేయాలి. సహకార వ్యవసాయం లోనే అలా చేయటం సాధ్యమౌతుంది. వ్యక్తిగత వ్యవసాయంలో ఇలా చేయటం సాధ్యం కాదు. ఐదు, ఇంతకు ముందే చెప్పుకున్నట్లుగా మానవ శ్రమకు బదులుగా వాడే యంత్రాలు శ్రామికుల సహకార సంఘాలలో ఉండాలి. ఒకసారి సహకార వ్యవసాయం ప్రారంభమైన తర్వాత భూములు ఉన్నవారు, భూమిలేని శ్రామికులు వాటిలో సభ్యులుగా ఉన్నపుడు, ఉత్పత్తికి అవసరమైన అన్నింటినీ ఒకచోటు నుండి పని చేయించటం కోసం యంత్రాలను సహకార సంఘాలకు అప్పగించాలి. ఆరు, సామాజి కంగా నిర్ణయాలు చేయటాన్ని, ఆర్థికాభివృద్ధిని సోషలిజం వికేంద్రీకృతం చేస్తుంది. కాబట్టి, సహకార సంఘాలు కేవలం ఆర్థికవ్యవస్థనే కాకుండా సామాజిక, రాజకీయ, సాంస్కృతిక రంగాల అభివృద్ధి కూడా కృషి చేస్తాయి. సరైన అర్థంలో అది ఒక కమ్యూన్‌గా ఉంటుంది. కాలక్రమంలో స్వంతంగా పరిశ్రమలు ఏర్పాటు చేసుకోవటం, ఇతర వ్యవసాయేతర కార్యకలా పాలలో కూడా భాగస్వామి అవుతుంది.

ఈ విధంగా జరుగుతున్న కార్యకలాపాలు ధనిక రైతులతో పాటు రైతులందరూ సహకార సంఘాలలో సభ్యులయేలా ఆకర్షిస్తాయి. ఆ సహకార సంఘం చుట్టూ రూపుదిద్దుకుంటున్న నూతన సమాజంలో కూడా భాగస్వాములయే

*(మిగతా 34వ పేజీలో)*

# వాయిదా పడిన ఉచిత గ్రంథాలయాల కల



రచయిత ఉచిత లైబ్రరీ ఉద్యమ కార్యకర్త, రచయిత్రి. ఆమె ఫ్రీ లైబ్రరీస్ నెట్‌వర్క్‌లో కమ్యూనిటీ ఆర్గనైజర్‌గా పనిచేస్తున్నారు

**మృదులా కోషీ**

సమాజం అనేది సమాచారం చుట్టూ ఏర్పడిన నిర్మాణం. ముఖ్యంగా సమాజం తాను ఎలా నిర్మించబడిందో ఊహించుకుంటూ, ఆ సమాచారం ఆధారంగానే ఆర్గనైజ్ అవుతుంది. కాగితంపై భారతదేశం తనను ప్రజాస్వామ్యంగా ఊహించుకుంది. ఆ ఊహలో అది స్వేచ్ఛ, న్యాయం, సమానత్వం, సోదరభావం అనే విలువలను గౌరవిస్తుంది. కానీ ఆ ఊహను ప్రజల అనుభవంగా మార్చాలంటే భారతదేశం సామూహిక సామాజిక ఊహకు అవసరమైన మౌలిక సదుపాయాలు సృష్టించుకోవాలి. పార్లమెంట్‌లో వేదికలపై చూపే చిన్న పుస్తకాన్ని, అంటే రాజ్యాంగాన్ని గురించి మనం తెలుసుకోవాలి. దానిలోని ప్రతి అంశాన్ని అర్థం చేసుకోవాలి. రాజ్యాంగాన్ని అర్థం చేసుకోవడమనే సామూహిక ఊహలో ప్రతి ఒక్కరమూ భాగమవ్వాలి.

గ్రంథాలయాలను అనేక రూపాలుగా చెప్పవచ్చు. అవి జ్ఞానం నిర్మాణమయ్యే తీరును వివరించే సజీవ హృదయాలు. అవి మానవత్వపు ఆత్మను నిల్వచేసే కేంద్రాలు. మన పూర్వీకులు మనతో నిరంతరం మాట్లాడే వేదికలు! మన దైనందిన జీవితంలో యాంత్రికత నుంచి బయటపడేసే ఉత్సవాలు. మనం ఇప్పటికే సంభాషణ ప్రారంభించి, కొనసాగిస్తున్న మన భవిష్యత్తు. అంతేకాదు, గ్రంథాలయాలు మన సామూహిక ఊహాశక్తికి చెందిన మౌలిక సదుపాయాలు. మన రోజువారి జీవితంలో అన్యాయం, అక్రమాలు గాఢంగా ప్రభావం చూపినప్పుడు గ్రంథాలయాలు స్వేచ్ఛ, న్యాయం, సమానత్వం, సోదరభావాలను సాధించడానికి, విమర్శనాత్మక ఆలోచనల స్వప్నాలకు, వాటిని సాకారం చేసుకునే క్రమబద్ధమైన ఉద్యమాలకు ఆధారమైన వేదికలుగా నిలుస్తాయి.

అది దేశరాజధాని ఢిల్లీ నగరంలో పేద ప్రజలుమాత్రమే నివసించే ఒక క్యాంప్ ప్రాంతం. అక్కడ ఉన్న ఒక అంగన్‌వాడీలో ఉచిత లైబ్రరీ వారం సాగుతోంది. పిల్లలు తమ అభిప్రాయాలను స్వేచ్ఛగా ఏర్పర్చుకునేందుకు వీలు కలిగించే సామూహిక పఠన కార్యక్రమం అది! ఈ కార్యక్రమం ప్రారంభమై ఇప్పటికే ఐదు వారాలు గడిచాయి. ప్రస్తుం ఆరవవారం సాగుతోంది. ఈ కార్యక్రమంలో భాగంగా అక్కడ ఉంచిన కొన్ని పుస్తకాలు రియాజ్ అనే చిన్నారికి చిన్నగా ఉంటాయి. అతని చిన్న చేతిలో సులభంగా ఇమిడిపోతాయి. కానీ కనీసం ఒక పుస్తకమైనా రియాజ్ కూర్చున్నప్పుడు ఉన్న పొడవుకంటే రెండింతలు పెద్దదిగా ఉంటుంది. మొదటి వారాల్లో ఆ పుస్తకాలపై చిన్నా పెద్దా తగాదాలు జరిగేవి. అయితే ఈ రోజు మాత్రం ఒకే ఒక వాదన జరుగుతోంది. అది ఆ పెద్ద పుస్తకం గురించే! రియాజ్ పక్కన కూర్చున్న అతని స్నేహితురాలు తన వేళ్లను నోట్లో వేసుకోవడంలో తలమునకలై ఉంది. ఆమె పుస్తకం పేజీలను తాకినప్పుడు, ఆ పేజీలపై ఆమె వేలిముద్రల తడి చారలు మిగిలాయి.

ఆ పుస్తకంలోది ఒక సాదాసీదా కథ మాత్రమే! తన బ్యాట్ పోగొట్టుకున్న ఒక అబ్బాయి దానిని ఆందోళనగా ఇంట్లో వెతుక్కుంటూ తిరిగే కథ. మంచం, అల్మరా, పెట్టెలు అన్నీ చిత్రాలతో సహా ఆ కథలో కనిపిస్తాయి. కథ చివరికి ఉత్కంఠ స్థాయికి చేరుకుంటుంది. ప్రతి పేజీ మీదా ఒక కిటికీ బొమ్మ ఉంటుంది. ఆ కిటికీకి వెలుపల ఎప్పుడూ ఎవరో ఒకరు, వెనుకకు తిరిగి నిలబడి ఉంటారు. కథలోని ఆ అబ్బాయిని రియాజ్ తన స్నేహితుడిలా భావిస్తున్నాడు. అతన్ని పుస్తకం పుటల్లో బంధించినట్టుగా అనిపిస్తోంది. రియాజ్ ఆ అబ్బాయిని హెచ్చరిస్తాడు. "భూత్!" అని అంటాడు. భూతం! ఆ అబ్బాయి విని స్పందించాలని రియాజ్ ఆత్రంగా కోరుకుంటాడు. 'కిటికీ బయట చూడు. భూత్ ఉంది!" అని అరిస్తాడు. రియాజ్‌తో కలిసి ఆ పుస్తకం చదువుతున్న గుడి అనే అమ్మాయి ఆ పేజీ తిప్పేందుకు ప్రయత్నిస్తుంది. ఆమెకు కథలో కూడా రియాజ్ కనపడుతున్నాడు. కథలో కనపడే రియాజ్ తన పక్కన ఉన్న రియాజ్ మాట వినాలని ఆమె అనుకుం టుంది. పేజీలు కొద్దిసేపు ఆమె వేళ్లకు అంటుకుని, ఆపై నెమ్మదిగా తెరుచుకుంటాయి. లైబ్రేరియన్ ఆ పుస్తకాన్ని చదువుతూ కథను నెమ్మదిగా, సాధారణ ముగింపుకు తీసుకెళ్తాడు.

ఆ పుస్తకం సున్నితంగా సూచిస్తున్న మరో అంశం ఏమిటంటే, ఇంట్లో అబ్బాయి తన క్రికెట్ బ్యాట్ కోసం వెతుకుతున్నప్పుడు, కిటికీ బయట ఒక అమ్మాయి అదే పోయిన బ్యాట్‌తో కనిపిస్తుంది. ఆ కిటికీ వెలుపల ఉన్న ఆ అమ్మాయి, అమ్మాయిలు కూడా క్రికెట్ ఆడగలరనే అంశానికి ప్రతికగా కనిపిస్తుంది. కానీ, ఇది గుడికి గాని, రియాజ్‌కు గానీ అర్థం కాలేదు. ఎందుకంటే వారికి ఇంకా ఆటల్లో కూడా లింగ అసమానత (జెండర్ గ్యాప్) ఉంటుందన్న విషయం తెలియదు. అది ఇంకా వారి అనుభవంలోకి రాలేదు. వారు సిమెంట్ నేలపై కూర్చుని, 'పుస్తకాలు చదువుతూ 'అన్ని కథలూ భూతాల కథలే..' అన్న అభిప్రాయానికి వస్తారు. కిటికీల వెనుక నుంచి తొంగిచూసే ముఖాలలో భూతాల కారణంగానే భయం కనపడుతోందని వారు భావిస్తారు. అయితే, పిల్లలు తమంతట తామే ఆ పుస్తకాన్ని గురించి ఆలోచించడం ఈ కథలోని గొప్ప విశేషం. పుస్తకాలు చదువుతూ, ఒకరితో ఒకరు ఆలోచిస్తూ, కలలు కనడం అనేది నిజంగా ఒక గొప్ప ఆనందం!

క్యాంప్ ప్రాంతంలో మూడు అంగన్‌వాడీలు ఉన్నాయి. ఈ మూడు అంగన్‌వాడీలలో ప్రతి ఒక్కదానిలో సుమారు 20 పుస్తకాలు ఉన్న చిన్న ప్లాస్టిక్ బాక్స్ ఉంటుంది. ఆరు నుండి 24 మంది పిల్లలు ఆ అంగన్‌వాడీలకు హాజరవుతారు. కొంచెం దూరంలో ఉన్న మరో రెండు అంగన్‌వాడీలలో ఏ పుస్తకాలు లేవు. అయినా అక్కడ కూడా

కథలు వినేటప్పుడు వాటి వెనుక అర్థాలను ఊహించుకుంటూ, కొత్త ఆలోచనల కోసం తపించే పిల్లలు ఉండవచ్చు. అలా తపించే పిల్లలు ఉన్నప్పటికీ పుస్తకాలు లేని వందల, వేల అంగన్‌వాడీలు మన దేశంలో ఉండే అవకాశం ఉంది.

అమెరికాలో విస్తృతమైన ప్రజా గ్రంథాలయ వ్యవస్థ ఉంది. అది పుట్టుక నుంచే పిల్లలకు పుస్తకాల పరిచయం కల్పిస్తుంది. అక్కడ చిన్నారుల కోసం ఒక ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. దాని లక్ష్యం కిండర్ గార్టెన్ (పాఠశాల ప్రవేశం) నాటికి కనీసం వెయ్యి పుస్తకాలను పిల్లల చేత చదివించడం. మన దేశంలోని రియాజ్, గుడి ఇద్దరూ మూడేళ్ల వయస్సులో ఉన్నారు. ఇప్పటివరకు వారు 24 పుస్తకాలు చదివారు. వారు ఐదేళ్లకు చేరేసరికి కనీసం 200 పుస్తకాలు చదివే అవకాశం ఉంది. కానీ ఆ తర్వాత వారు అంగన్‌వాడీ కార్యక్రమం నుంచి బయటకు వస్తారు. ఆ తరువాత వారి పాఠశాలలో ఇలా చదివించడానికి ప్రత్యేక ప్రణాళిక ఉండదు. 1984లో అమెరికాలో జరిపిన ఒక అధ్యయనం ప్రకారం సాధారణంగా ఒక మధ్యపాఠశాల విద్యార్థి అంటే మన 6, లేదా 7వ తరగతి విద్యార్థి ప్రతి ఏడాది పాఠశాల, ఇంట్లో కలిపి 5 లక్షల నుండి 10 లక్షల పదాలు చదువుతున్నారని తేలింది. ఈ అధ్యయనం ప్రకారం మంచి పాఠకులు. అంటే పుస్తకాలంటే మక్కువ ఉన్న వారుప్రతి సంవత్సరం 1 కోటి అంతకంటే ఎక్కువ పదాలు చదువుతారు. 2022-23లో జరిగిన సర్వే ప్రకారం, అమెరికాలో ఒక సగటు ఆరో తరగతి విద్యార్థి పాఠ్యపుస్తకాలు కాకుండా, ఇతర పుస్తకాల నుండి 3,36,378 పదాలు చదువుతున్నాడు. మనదేశంలో దీనికి పూర్తి భిన్నమైన పరిస్థితి నెలకొంది. ఆరవ తరగతి చదివే విద్యార్థికి ఎన్‌సిఇఆర్‌టి పాఠ్యపుస్తకాలలో ఉండే మొత్తం పదాల సంఖ్య 2లక్షలు మాత్రమే! దీనిని బట్టిమన విద్యార్థుల నైపుణ్యం, ఊహాశక్తి, వైవిధ్యం ఎంత తక్కువగా ఉంటుందో అర్థం చేసుకోవచ్చు.

“ మన దేశంలోని అనేక ప్రాంతాల్లో, మరో భిన్నమైన ఆందోళనకరమైన దృశ్యం కనిపిస్తోంది. అదే, పుస్తకాలు లేని ప్రైవేటు లైబ్రరీలు. అవి పఠన శాలలే అయినా వాటిలో పుస్తకాలు ఉండవు. విద్యా హక్కు చట్టం పరిధి దాటిన యువతీ యువకులు, ఇక్కడ నమూనా ప్రశ్నాపత్రాలతో సంవత్సరాల తరబడి కుస్తీ పడుతుంటారు. ఉద్యోగార్థులు అనే కేటగిరీలో ఉండటానికి వారు భారీ మొత్తాల్లో ఖర్చు చేయాల్సివస్తోంది. ”

**జీవితాంతం విద్య కోసం...**

పరిమితులు ఉన్నప్పటికీ, జాతీయ విద్యా విధానం దేశంలో మరిన్ని గ్రంథాలయాలను ఏర్పాటు చేయాలని, ముఖ్యంగా వెనుకబడిన ప్రాంతాల్లో వాటి ఏర్పాటును ప్రోత్సహించాలని పేర్కొంటుంది. అదే విధంగా, పాఠశాల సమయంలోనూ ఆ తర్వాత కూడా సామాజిక అధ్యయన క్లబ్‌లు నిర్వహించడం ద్వారా గ్రంథాలయాలను ఎల్లవేలలా ప్రజలకు అందుబాటులో ఉండేలా చూడాలని సూచిస్తుంది. అంతేకాదు. జాతీయ విద్యా విధానం దేశంలోని అన్ని భాషల్లో పుస్తకాలు అందుబాటులో ఉండాలని, డిజిటల్ వనరులు పెరగాలని, సమాజంలో చదువుకునే సంస్కృతిని పెంపొందించాలని సూచిస్తుంది. ఈ లక్ష్యాలు మనకు ఒక దిశను చూపిస్తాయి. కేవలం ఉద్యోగం కోసమే కాకుండా జీవితమంతా ఆలోచిస్తూ, నేర్చుకునే అలవాటును అభివృద్ధి చేయడమనేదే ఆ దిశ! అటువంటి అలవాటు కోసం చదవడమన్నది గొప్ప ఆలోచన! ఇక్కడ మరో ఆచరణాత్మక పరిష్కారానికి అవకాశం ఉంది. గ్రంథాలయాల స్థాపనలో తరచుగా వినిపించే ప్రధాన అడ్డంకి ప్రభుత్వ నిధుల కొరత. కొత్తగా ప్రజా గ్రంథాలయాలు ఏర్పాటు చేయడానికి పెద్ద మొత్తంలో నిధులు అవసరం కావచ్చు. కానీ, పాఠశాలల్లోనూ కమ్యూనిటీ గ్రంథాలయాలను నెలకొల్పడం ద్వారా తక్కువ ఖర్చుతో ఆ లక్ష్యాన్ని సాధించవచ్చు.

మన దేశంలోని అనేక ప్రాంతాల్లో, మరో భిన్నమైన ఆందోళనకరమైన దృశ్యం కనిపిస్తోంది. అదే, పుస్తకాలు లేని ప్రైవేటు లైబ్రరీలు. అవి పఠన శాలలే అయినా వాటిలో పుస్తకాలు ఉండవు. విద్యా హక్కు చట్టం పరిధి దాటిన యువతీ యువకులు, ఇక్కడ నమూనా ప్రశ్నాపత్రాలతో సంవత్సరాల తరబడి కుస్తీ పడుతుంటారు. ఉద్యోగార్థులు అనే కేటగిరీలో ఉండటానికి వారు భారీ మొత్తాల్లో ఖర్చు చేయాల్సివస్తోంది. గ్రంథాలయాల లేమి సమస్యకు ఇది ఒక భయానక పరిష్కారం. పభుత్వం ఈ ప్రైవేట్ లైబ్రరీలకు నిధులు సమకూర్చడం మొదలుపెడితే, అవి సహకార పఠనాన్ని కాదు. పోటీతో నిండిన జీవనశైలినే నేర్పించే కేంద్రాలుగా మారతాయి. అప్పుడు ఆ అంగన్‌వాడీ పిల్లలు పెద్దవాళ్లయ్యే సరికి, ఒకరిని ఒకరు క్రమబద్ధంగా వర్గీకరించే సమాజంలో భాగమవుతారు.

క్యాంప్ ప్రాంతాన్ని దాటి, లాల్ ఘుంబాద్ ఉన్న సావిత్రి నగర్‌ను దాటి, వేరేవేరుగా ఉన్న ముస్లిం, దళిత బహుజన వాడలకు ఇంకా దూరంగా ఉన్న మధ్యతరగతి నివాస ప్రాంతాలకు వస్తే అక్కడ ఫ్లాట్స్‌లో ఆదివారం ఉదయం కాఫీ తాగుతూ తమ కాలనీకి పేదల రాకను అడ్డుకునేందుకు గేటు పెట్టాలా, వద్దా అంటూ చర్చలు సాగుతుం టాయి. వాటినీ దాటి చూస్తే కొన్ని ఇళ్లు కూల్చివేతకు గురవుతుంటాయి. ఆ కూల్చివేతల గురించి సమాచారం ప్రతిరోజూ క్యాంప్‌కి చేరుతోంది. ఇవన్నీ పెద్దవాళ్లు ఎదుర్కొనే భూతాల్లాంటి భయానక వాస్తవాలు.

క్యాంప్ ప్రవేశద్వారం వద్దకు ఒక చిన్న సమూహం చేరుకుంది. వాట్సాప్‌లో వచ్చిన ఒక సందేశం గురించి వారు చర్చిస్తున్నారు. దానిని చూసి చాలామంది ‘ఇక్కడినుంచి వెళ్లిపోదాం, మన ఊళ్లకు తిరిగి వెళ్లిపోదాం’’ అని నిర్ణయించుకుంటున్నారు. అప్పుడు ఒక యువతి ‘ఇక్కడ కనీసం ఇళ్లలో పని చేసి మనం ఎంతో కొంత సంపాదిస్తాం. కానీ నేను గర్భవతిగా ఉన్నప్పుడు, మా ఊరిలో నాకు ఒక రొట్టె ముక్క కూడా దొరలేదు. అప్పుడు నేను ఎంత ఆకలితో ఉండేదాన్నో’ అని చెప్పింది. కొంతమంది స్పష్టంగా ‘ఏకమవుదాం, ఐక్యంగా నిలుద్దాం’ అని అంటున్నారు. మరికొందరు ఇల్లు ఉన్న వాళ్ల ఐక్యత గురించి మాట్లాడతారు, కానీ ఎన్నిసంవత్సరాలైనా అద్దెకు మాత్రమే ఉండే వాళ్ల సంగతి ఏమిటి అని ప్రశ్నిస్తున్నారు. క్యాంప్‌లోని ఈ చీలిక, ఈ విభేదం తీవ్రమైతే, తరువాత వినిపించే మాట ఏమిటి అంటే ‘క్యాంప్ గుండా వెళ్లే నల్లా (కాలువ) మీద మసీదు కట్టిన వాళ్లు, దాని ఫలితాలు ముందే తెలుసుకోవాల్సింది.’ అని! ఆ తరువాత వారంరోజుల్లో, బెంగాలీ మాట్లాడే ముస్లిం కార్మికులను అరెస్టు చేసినప్పుడు అటువంటి మాటలు, పుకార్లు మరింత బలపడతాయి.

ఇక రియాజ్, గుడి మాత్రం ఆ ఉద్రిక్త వాతావరణం మధ్య కూడా తమ పుస్తకాలను

**"2023 సెప్టెంబర్‌లో భారత ప్రభు త్వం నిర్వహించిన 'ఫెస్టివల్ ఆఫ్ లైబ్రరీస్' కార్యక్రమంలో పలువురు వక్తలు జాతీయ లైబ్రరీ విధానం ఆవశ్యకత గురించి మాట్లా డారు. రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఈ కార్య క్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా రాష్ట్ర జాబితాలో ఉన్న లైబ్రరీలను ఉమ్మడి జాబితాలోకి మార్చాలని నిర్ణయించినట్లు కేంద్ర ప్రభుత్వం ప్రకటించింది. ఆ నిర్ణయాన్ని కేరళ రాష్ట్ర ఉన్నత విద్యాశాఖ మంత్రి ఆర్.బిందు తీవ్రంగా వ్యతిరేస్తున్నట్లు ప్రకటించారు."**

పట్టుకుని, ఒకరినొకరు ఆసరాగా చేసుకుని, కలలలో తేలే పిల్లలుగా ఉంటారు. కానీ వారి చిన్న లైబ్రరీ, దాని అవసరం ఇళ్ల కూల్చివేతలు, అరెస్టులు ఎదుర్కొంటున్న పెద్దలవరకు చేరుకోలేకపోతుంది!

**ప్రజా గ్రంథాలయాల్లో ఉచిత సభ్యత్వం**

ప్రొఫెసర్ డి. పి. చట్టోపాధ్యాయ్ అధ్యక్షతన ఏర్పాటైన జాతీయ గ్రంథాలయ, సమాచార వ్యవస్థలపై విధాన కమిటీ తన నివేదికను 1986లో సమర్పించింది. ఆ నివేదిక దేశవ్యాప్తంగా ఒక జాతీయ గ్రంథాలయ విధాన రూపకల్పనకు పునాదిగా నిలిచింది. ఆ నివేదికలోని 5వ పేజీలో ఒక ముఖ్యమైన అంశాన్ని ప్రస్తావించారు. అదే ఉచిత గ్రంథాలయాల ఆలోచన! ప్రజలకు గ్రంథాలయాల్లో ఉచిత సభ్యత్వం ఇవ్వడం ద్వారా చదవడం అనే భావనను హక్కుగా రూపొందించవచ్చని కమిటీ భావించింది. దురదృష్టవశాత్తు ఈ ఆలోచన అమలులోకి రాలేదు. అది ఒక స్వప్నం లాగే మిగిలిపో యింది.

'వాయిదా పడిన ఒక కలకు ఏమవు తుంది?' అని అమెరికన్ కవి లాంగ్‌స్టన్ హ్యూజ్ తన ప్రసిద్ధ కవితలో అడుగుతాడు. ఆ కవిత, జిమ్ క్రో కాలంలో నల్లజాతి అమెరికన్ల అనుభవాలనుండి పుట్టింది. ఆ కాలంలో వాళ్ళు ఎదుర్కున్న జాతి వివక్షను, అన్యాయాన్ని ప్రతిబింబిస్తుంది. ప్రముఖ రచయిత్రి, జర్నలిస్టు ఇసబెల్ విల్కర్సన్ ఆ జాతి వివక్ష వ్యవస్థను భారతదేశంలో ఉన్న వర్ణవ్యవస్థతో పోల్చారు. హ్యూజ్ తన కవితలో వ్యవస్థాత్మక వర్ణవివక్ష వల్ల, నల్లజాతి ప్రజలు జీవనంలోని ప్రతి రంగంలోనూ సమాన అవకాశాల నుండి దూరమయ్యారని విమర్శిస్తారు. అదేవిధంగా, మనం మన భారతదేశపు వాయిదా పడిన కలల కోసం వెతికితే, అవి మన దేశంలోని కనిపించని గ్రంథాలయాల రూపంలో నిలుస్తాయి. మరి ఆ వాయిదా పడిన కలల శబ్దాన్ని కూడా మనం వినగలిగితే...!

అది రాజా రామమోహన్ రాయ్ లైబ్రరీ ఫౌండేషన్ వెబ్‌సైట్‌లోని మౌన పేలుళ్లలో వినిపిస్తుంది. ప్రజా గ్రంథాలయ వ్యవస్థలను పర్యవేక్షించి, ప్రజా గ్రంథాలయ ఉద్యమాన్ని ప్రోత్సహించే లక్ష్యంతో ఈ సంస్థను ఏర్పాటు చేశారు. అయితే, ఇప్పటికీ మన దేశంలో ఎన్ని గ్రంథాలయాలు ఉన్నాయో స్పష్టంగా చెప్పలేని పరిస్థితి నెలకొంది. లైబ్రరీల జాతీయ మిషన్‌కు కేటాయించిన వెబ్‌సైట్ విభాగం, క్యాంప్‌లో వినిపించే వదంతుల్లాంటి అస్పష్టమైన సమాచారాన్ని ఉత్పత్తి చేస్తోంది. సుమారు వెయ్యి కోట్లు రూపాయలు ఈ మిషన్‌కు కేటాయించనట్లు చెబుతారు. దీని గడువు కూడా అనేక సంవత్సరాలు పొడిగించారు. అయినప్పటికీ, భారతదేశంలోని లైబ్రరీల వాస్తవ పరిస్థితిని సమగ్రంగా సర్వే చేయాలనే ప్రధాన కర్తవ్యాన్ని అది ఇప్పటికీ పూర్తి చేయలేకపోయింది.

ఈ మిషన్ సాధించిన ఒక్క ముఖ్య ఫలితం జాతీయ డిజిటల్ లైబ్రరీ మాత్రమే. అయితే భారతదేశంలోని అనేక 'క్యాంప్' ప్రాంతాల్లో నివసించే ప్రజలకు దాని గురించి ఏమాత్రం అవగాహన లేదు. ఆ వెబ్‌సైట్‌కు వెళ్ళిన ఎవరైనా దానిలో కనిపించే సమాచారం కారణంగా గందరగోళానికి గురవుతారు. అది ప్రధానంగా పాఠ్యపుస్తకాలు, అధ్యయన సామగ్రి, పరీక్షల సిద్ధత వంటి అంశాలపైనే దృష్టి సారించింది. అంటే, కేవలం జ్ఞాపకా ధారిత విద్యాపద్ధతి మీద. చిన్నపిల్లల కథల పుస్తకాలకు కేటాయించిన చిన్న విభాగం ఉంది కానీ అది మన గ్రహం అవశేషాలను పరిశీలించడానికి మరో గ్రహం నుండి వచ్చిన పండితుల కోసం రూపొందించినట్టుగా అనిపిస్తుంది.

పాఠ్యపుస్తకాలను అర్థంచేసుకోవడానికే తంటాలు పడుతున్న సమాజంలోని సామాన్య పిల్ల భూతాలు ఈ డిజిటలైజ్ చేసిన పుస్తకాల్లోని భూతాల కథలను ఎప్పటికీ చదవలేరు. అంతేకాదు, చదవాలన్న ఆకాంక్ష మధ్యలోనే తెగిపోవడంతో పిల్లలకు ఏమి చెప్పాలో, ఎలా చెప్పాలో తెలియని సామాన్య మహిళలకు డిజిటల్ లైబ్రరీ ఒక అర్థంకాని భూతంగానే ఉంటుంది. వారు ఇప్పటికీ తాము మళ్లీ చదువును కొనసాగించడానికి వీలైన సామాజిక పఠనాస్థలాల కోసమే ఎదురుచూస్తున్నారు. అంతేనా! బుల్డోజర్ రాజ్యంలో భాగంగా తమ ఇళ్లను ఎప్పుడు కూల్చేస్తారో అని భయపడే ప్రజలకూ ఈ డిజిటల్ లైబ్రరీ ఉపయోగ పడదు. అటువంటి సమాచారం కోసం వెదుకుతున్న వారికి డిజిటల్ లైబ్రరీలోని సమాచారం నిరుపయోగం!

**స్వయం ప్రతిపత్తి ఎందుకు?**

2023 సెప్టెంబర్‌లో భారత ప్రభు త్వం నిర్వహించిన 'ఫెస్టివల్ ఆఫ్ లైబ్రరీస్' కార్యక్రమంలో పలువురు వక్తలు జాతీయ లైబ్రరీ విధానం ఆవశ్యకత గురించి మాట్లా డారు. రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఈ కార్య క్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా రాష్ట్ర జాబితాలో ఉన్న లైబ్రరీలను ఉమ్మడి జాబితాలోకి మార్చాలని నిర్ణయించినట్లు కేంద్ర ప్రభుత్వం ప్రకటించింది. ఆ నిర్ణయాన్ని కేరళ రాష్ట్ర ఉన్నత విద్యాశాఖ మంత్రి ఆర్.బిందు తీవ్రంగా వ్యతిరేస్తున్నట్లు ప్రకటించారు. గ్రంథాలయాల నిర్వహణ విషయంలో రాష్ట్ర ప్రభుత్వాలకు, పౌరసమాజానికి స్వయం ప్రతిపతి ఉండాలని కేరళ వాదించింది. కేరళ ప్రభుత్వ ఈ వాదన వెనుక ఉన్న ఆంతర్యం ఎవరికైనా సులభంగా అర్థమయ్యేదే! ప్రజలు ఏ జ్ఞానాన్ని పొందాలనకుంటారన్నది వారి సొంత, స్వతంత్ర నిర్ణయంమీదే ఆధారపడి ఉంటుంది. ఇది గంథాలయాల నిర్వహణలో ప్రపంచవ్యాప్తంగా ఇప్పటికే తెలుసుకున్న అంశం. ప్రజలు తమకు అనుకూలంగా ఉండే, తమ మార్గంలో ముందుకు తీసుకెళ్లే జ్ఞానాన్నే కోరుకుంటారు. ఇది పిల్లల ప్రవర్తనలో మరింత స్పష్టంగా కనిపిస్తుంది. వారు కథా పుస్తకాల్లో లింగసమానత్వం బోధించే విషయాలను పట్టించుకోకుండా, తమను ఉల్లాసపరిచే భూతాల కథలను ఎక్కువగా ఇష్టపడడటమన్నది ఆ ధోరణికి ఉదాహరణ. స్వయం ప్రతిపత్తి పట్ల ఉన్న ఆసక్తి కారణంగానే కేరళలో 8,415 లైబ్రరీలు రాష్ట్ర లైబ్రరీ కౌన్సిల్ ఆధ్వర్యంలో నడుస్తున్నాయి. అంటే, ప్రతి 3,000 మంది నివాసితులకు ఒక లైబ్రరీ ఉండాలనే అంతర్జాతీయ ప్రమాణానికి

సమీపంగానే ఇది ఉంది. ఈ స్థాయిని సాధించిన ఏకైక రాష్ట్రంగా కేరళ నిలిచింది. దేశంలోని ఇతర ప్రాంతాల్లో లక్షమంది లేదా అంతకంటే ఎక్కువ మందికి ఒక లైబ్రరీ మాత్రమే ఉంది.

అదే కార్యక్రమంలో ఉమా మహాదేవన్ మాట్లాడుతూ, కర్ణాటక గ్రామీణ ప్రాంతాల్లో తాను చేపట్టిన కేంద్ర లైబ్రరీ కార్యక్రమాన్ని వివరించారు. ప్రస్తుతం దాదాపు 6,000 లైబ్రరీలు పనిచేస్తున్నాయని త్వరలో వాటి సంఖ్యను 12,000 దాటించే ప్రణాళిక ఉందని చెప్పారు. ఈ లైబ్రరీలు నిజంగా జ్ఞాన కేంద్రాలుగా మారుతున్నాయనే విషయం హర్షణీయమైంది. వీటిలో సభ్యత్వం ఉచితం. అందువల్ల ప్రతి ఒక్కరూ జ్ఞాన సృష్టిలో భాగస్వాములు కావచ్చు. ఈ లైబ్రరీల నుండి చదువుకోవడం నేర్చుకుంటున్న మహిళలు, మహిళలు పిల్లలతో కలిసి చదువుతున్న దృశ్యాలు, పిల్లలు పెద్దలతో చెస్ ఆడటం, పెద్దలు పత్రికలు చదవడం వంటి ఫోటోలు వచ్చాయి. ఇవన్నీ చదవడం అనే హక్కును ప్రజలకు అనందిస్తున్నారని స్పష్టం చేస్తున్నాయి. వీటిని చూస్తే ప్రజానీకంలో సౌభ్రాత్రత్వ భావన పెరుగుతోందనిపిస్తుంది.

అదే ఉత్సవంలో, నేషనల్ బుక్ ట్రస్ట్ డైరెక్టర్ మాట్లాడుతూ, పుస్తకాలను దానం చేయాలనుకునే వారు ఉన్నారని, ఆ దానాలను వినియోగించి లైబ్రరీలను ఏర్పాటుచేయవచ్చని అన్నారు. ఉదాహరణకు, పిల్లలు తమ పుట్టినరోజున చాక్లెట్లు ఇవ్వడానికి బదులు పాఠశాలలో పుస్తకాలను ఇవ్వాలని ఆయన సూచించారు. ఇలా చేయడం ద్వారా ఒక పాఠశాల 2,000 పుస్తకాలను సేకరించిందని ఆయన చెప్పారు.

" అదే ఉత్సవంలో, నేషనల్ బుక్ ట్రస్ట్ డైరెక్టర్ మాట్లాడుతూ, పుస్తకాలను దానం చేయాలనుకునే వారు ఉన్నారని, ఆ దానాలను వినియోగించి లైబ్రరీలను ఏర్పాటుచేయవచ్చని అన్నారు. ఉదాహరణకు, పిల్లలు తమ పుట్టినరోజున చాక్లెట్లు ఇవ్వడానికి బదులు పాఠశాలలో పుస్తకాలను ఇవ్వాలని ఆయన సూచించారు. ఇలా చేయడం ద్వారా ఒక పాఠశాల 2,000 పుస్తకాలను సేకరించిందని ఆయన చెప్పారు. "



హైదరాబాద్‌లోని స్టేట్ సెంట్రల్ లైబ్రరీ

**వ్యక్తిగత ప్రయత్నాల పరిమితులు**

ఒక సంవత్సరం తర్వాత, దేశవ్యాప్తంగా 265 కంటే ఎక్కువ లైబ్రరీలను సమీకరించే లక్ష్యంతో 'ఫ్రీ లైబ్రరీస్ నెట్‌వర్క్' అనే లాభాపేక్ష లేని సంస్థ నిర్వహించిన చిన్న సదస్సులో, ఆ సంస్థ నాయకుల్లో ఒకరైన రితుపర్ణా నియోగ్ మాట్లాడుతూ లైబ్రరీల కొరత సమస్యను చిన్నచిన్న వ్యక్తిగత ప్రయత్నాలతో పరిష్కరించడం అసాధ్యమని స్పష్టం చేశారు.

'నేను లైబ్రరీ నడపాలనుకోవడం లేదు, అది నా పని కాదు. వనరులు, నిధులు సమకూర్చడం, స్వయం ప్రతిపత్తికి పూచీపడటం ఇవన్నీ ప్రభుత్వ బాధ్యతలు. అందుకే మేము పబ్లిక్ లైబ్రరీలు కోరుతున్నాం' అని చెప్పారు. 'ఎన్‌జిఓలు పేద పిల్లల కోసం అందంగా లైబ్రరీ నడుపుతున్నారని ప్రజలు సంతోషపడుతున్నారు. అది ఒక అందమైన స్థలం అని అంటున్నారు. కానీ నా దృష్టిలో లైబ్రరీ అనేది అందమైన స్థలం కాదు. అది ప్రజలు తమ హక్కుల గురించి తెలుసుకోవడానికి వచ్చే స్థలం. వారు తమ హక్కుల గురించి మాట్లాడ టానికి వచ్చే స్థలం. వారికి హక్కుగా దక్కాల్సిన స్థలం' అని కూడా ఆమె అన్నారు. నియోగ్ సంస్థ భావన ప్రకారం, లైబ్రరీల ఏర్పాటును ప్రజలు తమ హక్కుగా డిమాండ్ చేయాలి. అవే ప్రజల స్వేచ్ఛకు, సమానత్వ సాధను బాటలు వేస్తాయి. ఈ సదస్సులోనే వారు పీపుల్స్ నేషనల్ లైబ్రరీ పాలసీని విడుదల చేశారు. దాని ఉద్దేశ్యం ప్రభుత్వం రూపొందించే జాతీయ లైబ్రరీ విధానంపై ప్రభావం చూపించడం.

క్యాంప్ ప్రాంతానికి దగ్గరలోని ఢిల్లీ పబ్లిక్ లైబ్రరీ శాఖ దాదాపు ఆరు కిలోమీటర్ల దూరంలో ఉంది. అంతేకాకుండా అది సభ్యత్వ ఫీజు వసూలు చేస్తుంది. క్యాంప్ ప్రాంతం జాతీయ రాజధాని ప్రాంతంలో ఉన్నప్పటికీ, ఆ లైబ్రరీ కేంద్ర ప్రభుత్వ ఆధ్వర్యంలో నడుస్తోంది. అదే సమయంలో, మున్సిపాల్టీ క్యాంప్ నుండి కేవలం మూడు కిలోమీటర్ల దూరంలో మరో లైబ్రరీని ప్రారంభించింది. అయితే ఆ లైబ్రరీ నెలకు వెయ్యి రూపాయల అధిక రుసుము వసూలు చేస్తోంది. అయినా, తక్కువ పుస్తకాలు ఉంటాయి. అయితే అక్కడ కేఫే వాతావరణం, చదువుకోడానికి స్థలం మాత్రం ఉంది. కొన్ని సందర్భాల్లో ఢిల్లీ పబ్లిక్ లైబ్రరీ సభ్యత్వ ఫీజును మాఫీ చేస్తుంది. ఉచిత సభ్యత్వం ప్రజలకు లైబ్రరీలలో ప్రవేశం కల్పించే ప్రధాన సాధనం అని వారికి తెలుసు. కానీ మరో మున్సిపల్ లైబ్రరీ మాత్రం అటువంటి ఉద్దేశం లేకుండా తన తలుపులను గట్టిగా మూసేసి ఉంచింది.

లైబ్రరీ సైన్స్ బోధన ప్రకారం, ప్రజా లైబ్రరీలు సమాజానికి అత్యవసరమైన సమాచార కేంద్రాలు. ముఖ్యంగా సామాజికంగా వెనుకబడిన వర్గాలకు అవి జ్ఞానాన్ని, అవగాహనను, అవకాశాలను కల్పిస్తాయి. ఢిల్లీ వలసల నగరం. ఎక్కడి నుండి వచ్చే ప్రజలకైనా తమ కొత్త నగరాన్ని తెలుసుకోవాలని ఉంటుంది.

> **" భారతదేశంలో జాతి, వర్గం, లింగం ఇంకా ఇతర సామాజిక విభజనలు అనేవి లైబ్రరీలు, ఉచిత విశ్వవిద్యాలయాల తక్కువ సంఖ్యలో ఉండటంలో స్పష్టంగా ప్రతిబింబి స్తాయి. సమాజంలో ప్రతి ఒక్కరికీ సమాన అవకాశాలు లభించవు. విద్య, జ్ఞానాన్ని పొందడం కూడా ఈ అసమానతల వలయంలోనే జరుగుతుంది. అయితే ఉచిత లైబ్రరీలు ఉన్నచోట, ఈ విభజనలను సవాలు చేయడం జరుగుతుంది. "**

వారు అక్కడ తమను నిలబెట్టే సమాజాన్ని నిర్మించుకోవాలి. వారికి రవాణా వ్యవస్థపై సమాచారం కావాలి. పాఠశాలల్లో ప్రవేశాలపై స్పష్టత కావాలి. ఆహార భద్రతపై అవగాహన అవసరం, కార్మికుల హక్కుల గురించి తెలుసుకోవాలి. కొంతమంది ఉద్యోగ అవకాశాల గురించి తెలుసుకోవాలనుకుంటారు, ఇంకొందరికి కొత్త భాష నేర్చుకోవాలని పిస్తుంది. మరికొందరికి సాంకేతికత లేదా ప్రభుత్వ పథకాలపై సమాచారం కావాలి. ఇవన్నీ కలిపి సమాజానికి సంబంధించిన అవసరాలే. ఈ సమాజ సమాచారం అనే పెద్ద అవసరం తీరితే మనం 'సమాజం' అంటే ఏమిటి, పరస్పర సంబంధాలను ఎలా నిర్మించుకోవాలి, మనం కలసి ఎలా జీవించాలి అనే విషయాలపై ఒక సామూహిక ఊహాశక్తిని, ఒక సంఘటిత ఆత్మబలం పొందుతాం.

నిర్బంధాలు వారం రోజుల తర్వాత జరగనున్నాయంటే, ఆలస్యం కావాలని కోరుకునే వారి కోసం భవిష్యత్తు మరింత వేగంగా వస్తుంది. జాతీయ రాజధాని ప్రాంతంలోని కొన్ని ప్రాంతాల్లో కుటుంబాలు తమ ఇంటి సామాన్లను ఆటో టెంపోల్లో ఎక్కించి గ్రామాల వైపు పంపుతున్నాయి. నెల జీతం తీసుకున్న వెంటనే తామూ వెళ్దామనే ఆత్రతతో వేగంగా ఏర్పాట్లు చేస్తున్నారు. కరోనా మహమ్మారి సమయంలో కూడా ఢిల్లీ ఇంకా ఇతర నగరాల నుండి ఇలాగే భారీ స్థాయిలో వలస జరిగింది. అప్పుడు కూడా ప్రజలకు సమాజ సమాచార వ్యవస్థ ఏమీ లేదు. ఆసుపత్రిలో మంచాలు ఎక్కడ లభ్యమవుతాయో, ఆక్సిజన్ సిలిండర్లు ఎక్కడ దొరుకుతాయో, ఆహార బ్యాంకులు ఎక్కడ ఉన్నాయో తెలుసుకునే సామూహిక అవగాహన వారికి లేదు. మహమ్మారిలో ఎంతమంది మరణించారో అన్న సమాచారం ఎప్పటికీ పూర్తిగా వెలుగులోకి రాదు. ఆ మరణాలలో ఎన్ని నివారించవచ్చో అంచనా వేసే అవకాశం కూడా లేదు. భవిష్యత్తులో రాదు.

ఇది కూడా పిల్లల కథల పుస్తకంలోని భూతం లాంటిదే! ఎప్పటికీ రాని సమాధానంకోసం ఏదురుచూసే భేతాళ భూతం లాంటిది! 'ది డాన్ ఆఫ్ ఎవిరీథింగ్' అనే గ్రంథంలో, సమాజ అసమానతల ఉద్భవం, వాటి నిరంతరతపై విశ్లేషణ చేసిన డేవిడ్ గ్రేబర్ 'పారంపరిక (హయరార్కీ) రెండు అంశాలపై ఆధారపడి ఉంటుంది: ఒకటి హింస, మరొకటి సమాచార నియంత్రణ.' అని చెబుతాడు. 'సమానత్వ భావన బలంగా ఉన్న సమాజాల్లో మాత్రం సమాచారం విస్తృతమైన వలయాల ద్వారా ప్రజలకు అందుతుంది. అధికారిక సంస్థల్లో తాళం వేసి దానిని నిలవచేయరు' అని కూడా ఆయన వివరిస్తాడు.

భారతదేశంలో జాతి, వర్గం, లింగం ఇంకా ఇతర సామాజిక విభజనలు అనేవి లైబ్రరీలు, ఉచిత విశ్వవిద్యాలయాల తక్కువ సంఖ్యలో ఉండటంలో స్పష్టంగా ప్రతిబింబి స్తాయి. సమాజంలో ప్రతి ఒక్కరికీ సమాన అవకాశాలు లభించవు. విద్య, జ్ఞానాన్ని పొందడం కూడా ఈ అసమానతల వలయంలోనే జరుగుతుంది. అయితే ఉచిత లైబ్రరీలు ఉన్నచోట, ఈ విభజనలను సవాలు చేయడం జరుగుతుంది. 'ఈ సమాజానికి చెందని వారు' అనే భ్రమలను ఈ తరహా లైబ్రరీల ద్వారానే చెరిపివేయడం సాధ్యమవుతుంది. అణచివేతకు గురైన వారికి అవసరమైన కార్డులు, నింపవలసిన ఫారాలు వంటి వివరాలను వారికి అందించడం వల్ల మాత్రమే కాదు, జ్ఞానాన్ని పంచుకునే వేదికను కల్పించడం ద్వారా సమానత్వ సాధన సాధ్యమవుతుంది.

సమానత్వమంటే పుస్తకాలు చదవడం లేదా పరీక్షలకు సిద్ధం కావడం మాత్రమే కాదు. ప్రజలుగా మనం ఏమిటి, మన అర్థం ఏమిటి, మన మానవ విలువలు ఏమిటి అనే విషయాలను ఒకరికొకరు నేర్పుకోవడం, తెలుసుకోవడం కూడా. ఇది 'సభ్యత్వ కార్డు కలిగిన వ్యక్తుల సమూహం' అనే స్థాయిని దాటి, 'ఒక సమాజంగా మన ఉమ్మడి మానవత్వం' గురించి అవగాహన పెంచే దిశలో ముందుకు తీసుకెళ్తుంది. జ్ఞానం అనేది సహజంగానే మనం పంచుకున్న మానవత్వం పై ఉన్న అవగాహనతో ముడిపడి ఉంటుంది.

లాంగ్‌స్టన్ హ్యూస్ రాసిన ప్రసిద్ధ కవిత ఒక ప్రశ్నల సమాహారం. కానీ ప్రతి ప్రశ్నకూ సమాధానం దానికన్నా ముందున్న ప్రశ్నలోనే దాగి ఉంటుంది. ఆ కవిత చివర్లో హ్యూస్ అడిగే ప్రశ్నే మన సమాజానికి కూడా ఎదురైన ప్రశ్న! అది వాయిదా పడిన కలల గురించి, ఆలస్యం చేసిన ఆశల గురించి, నెరవేరని న్యాయం గురించి. 'వాయిదా పడిన కల... చివరికి పేలిపోతుందా అని ఆయన అడుగుతాడు. మన జ్ఞానం, మన సమాజం, మన మానవత్వం ఇవన్నీ పరస్పరంగా ఎలా ముడిపడి ఉన్నాయో గుర్తుచేస్తూ ఆ ప్రశ్న మనలో ప్రతి ఒక్కరికి వర్తిస్తుంది.


అది ఇప్పటికీ ఒక ప్రశ్నగానే మిగిలి ఉందన్న వాస్తవాన్ని మనం గుర్తించాలి. మనం అందరం కలిసి సృష్టించే జవాబు తప్ప దానికి మరో సమాధానం లేదు. మనం ఇప్పటికే తెలుసుకున్నది ఏమిటంటే రియాజ్, గుడి మూడేళ్ల పిల్లలు. వారు తమ ఇరవై పుస్తకాల పెట్టెను త్వరలో వదిలి, ప్రాథమిక పాఠశాలలో అడుగుపెడతారు. వారు తమ తల్లిదండ్రులతో కలిసి జీవిస్తున్నారు వారిని ఇప్పటివరకు ఎవరూ నిర్బంధించలేదు. కానీ వారు నివసిస్తున్న ఆ కాలనీని కూల్చివేస్తారా, లేదా అన్నది ఇంకా తెలియదు. వారి ఇంటి దగ్గరలో ఒక చిన్న సామూహిక లైబ్రరీ ఉంది. 78 ఏళ్ల ప్రజాస్వామ్య దేశంలో ఒక ఉచిత లైబ్రరీ ఉద్యమం కొనసాగుతోంది.

ఈ దేశం, ఆ ఉద్యమం రెండూ కూడా వారి జీవన హక్కు విలువను కాపాడే భావనపై నిర్మాణమయ్యాయి. వారికి కావలసింది ఉచితమైన, సమగ్రతతో కూడిన ప్రజా లైబ్రరీ వ్యవస్థ. తమ కలల అర్థం గురించి, తమ ఉనికి అర్థం గురించి, తమ సమాజం అర్థం గురించి కలలను కనగల స్వేచ్ఛను ఇచ్చే వ్యవస్థ.

**(అనువాదం: పొగడ దొరువు)**

చరిత్ర

# ఢిల్లీ సుల్తానుల కాలం: పాలనావ్యవస్థ, సామాజిక జీవనం



రచయిత ప్రజాశక్తి మాజీ ఎడిటర్

ఎంవిఎస్ శర్మ

ఢిల్లీ సుల్తానుల పాలన దాదాపు రెండు శతాబ్దాలపాటు కొనసాగింది. భారతదేశంలో అత్యధికభాగం వారి పాలనకింద ఉండేది. అంతవరకూ ఉన్న పాలనా వ్యవస్థ స్థానంలో మార్పులు వచ్చాయి. గుప్తుల కాలంలో మొదలై క్రమంగా ఇక్కడ అధికార వికేంద్రీకరణ జరిగింది. పాలనావ్యవస్థ దాదాపు మండల స్థాయి వరకూ వికేంద్రీకరించబడింది. సుల్తానుల హయాంలో మళ్ళీ కేంద్రీకృత పాలనా వ్యవస్థను నెలకొల్పారు.

డిల్లీ సుల్తానులు ఇస్లాం మతాన్ని అనుసరించారు. ఇస్లామిక్ ప్రపంచానికి టర్కీలో ఉండే ఖలీఫా యే ప్రభువుగా పరిగణించబడేవాడు. డిల్లీ సుల్తానులు కూడా మర్యాద పూర్వకంగా ఖలీఫాయే తమ ప్రభువు అని ప్రకటించారు. ఐతే, ఆచరణలో పాలనాధికారాలు ప్రధానంగా సుల్తానుల వద్దే ఎక్కువగా ఉండేవి. సుల్తానే రాజ్యాధికారి, సైన్యాధికారి, న్యాయాధికారిగా వ్యవహరించేవాడు. రాజు పెద్ద కొడుకే ఉత్తరోత్తరా రాజు కావాలన్న సాంప్రదాయం సుల్తానుల పాలనలో అమలు కాలేదు. ఐతే, సాధారణంగా సుల్తాను సంతానంలోనే సమర్ధుడైనవాడిని రాజుగా ఎంపికచేయడం జరిగేది. ఈ ఎంపికను రాజ్య పెద్దలు బలపరచాల్సివుంది. ఈ పద్ధతి ఎలా ఉన్నా, సైనిక బలగాలమీద పట్టుకలిగినవారు తిరుగుబాటు ద్వారా రాజ్యాధికారాన్ని చేపట్టిన సందర్భాలు చాలానే ఉన్నాయి. అదే సమయంలో ప్రజాభిప్రాయం కూడా అనుకూలంగా ఉండడం ఒక కీలకమైన అంశంగా ఉండేది.

న్యాయమూర్తులను, మంత్రులను సుల్తానే ఎంపికచేసి నియమించేవాడు. పాలనలో సుల్తాను తర్వాత కీలకమైన వ్యక్తి వజీరు. ప్రధానంగా రాబడి-ఖర్చు , ఆర్థిక నిర్వహణ వజీరు బాధ్యతగా ఉండేది. సుల్తాను దండయాత్రలకు వెళ్ళిన సమయంలో మొత్తం పాలనా వ్యవహారాలను చక్కబెట్టేది వజీరే.

సైన్యాధిపతిగా ఉన్నవ్యక్తి సైనిక వ్యవహారాలకు బాధ్యత వహించే విధానం అంతవరకూ ఉండేది. ఎప్పుడైతే సుల్తాను స్వయంగా సర్వసైన్యాధికారిగా వ్యవహరించసాగాడో అప్పుడు సైనికుల నియామకాలు, ఆయుధాల కొనుగోళ్ళు, సైనికులకు జీతభత్యాల పంపిణీ వంటివి చూసేందుకు ఒక ప్రత్యేకమైన రక్షణ శాఖను ఏర్పాటు చేశారు. ఈ శాఖ అధిపతిని అర్జ్-ఎ-మాలిక్ అని పిలిచేవారు. వజీరు తర్వాత ప్రాధాన్యత కల పదవి ఇది. నగదు రూపంలో సైనికులకు జీతాలను చెల్లించే విధానాన్ని తొలుత ప్రవేశపెట్టినవాడు అల్లావుద్దీన్ ఖిల్జీ. సైనిక బలగాలను పెంచుకోవడం, వారికి శిక్షణ ఇవ్వడం అత్యంత ప్రాధాన్యతగల అంశంగా ఉండేది. ఆ బలంతోటే మంగోలుల దండయాత్రలను తిప్పికొట్టగలిగారు డిల్లీ సుల్తానులు, అదే బలంతో దక్కనును కూడా స్వాధీనం చేసుకోగలిగారు. తుపాకులు, ఫిరంగులు ఎక్కువగా వినియోగించేవారు. అందకు కావలసిన మందుగుండు సామగ్రి తయారీ కూడా చేపట్టారు.

ఇతర దేశాలతో దౌత్య సంబంధాలను చూసేందుకు ఒక ప్రత్యేకమైన శాఖ ఉండేది. దాని అధికారిని దివాన్-ఎ-ఇన్షా అని పిలిచేవారు. మత వ్యవహారాలను, ముస్లింలు అధికంగా నివసించే ప్రాంతాల్లో పౌర చట్టాల అమలును చూసే విభాగం అధికారి దివాన్-ఎ- రియాసత్. ఇతడినే ఖాజీ అని వ్యవహరిస్తారు. ముస్లింలకు షరియా ప్రకారం పౌర చట్టాలు అమలు జరిగేవి. అదే హిందువులు నివసించే ప్రాంతాలలో వారి మతాచారాల ప్రకారం చట్టాలు, శిక్షలు అమలు జరిగేవి. కులపెద్దలు న్యాయమూర్తులుగా వ్యవహరించేవారు. ఐతే, నేర చట్టాలు మాత్రం అన్ని కులాలకు, మతాలకు సమానంగా వర్తించేవి.

రాజమందిరం, లేదా రాజుగారి కోట వ్యవహారాలను, రాచకుటుంబీకుల, మహిళల వ్యవహారాలను చూసే విభాగం ఒకటి ప్రత్యేకంగా ఉండేది. రాజమందిరానికి అవసరమైన వస్తువులను, ఉపకరణాలను తయారు చేసే కర్మాగారాలు కూడా రాజమందిరం ఆధీనంలోనే నడిచేవి.

ఇక నీటికాలువల నిర్వహణ, ప్రజల వినియోగార్థం అవసరమైన భవంతుల నిర్మాణం కోసం ఒక విభాగం ఉండేది. ప్రత్యేకంగా గూఢచారి విభాగం ఒకటి ఉండేది. దాని అధికారిగా సుల్తాను పట్ల పూర్తి విశ్వాసంతో ఉండేవాడినే నియమించేవారు.

దేశాన్ని పాలనా సౌలభ్యం కోసం అనేక భాగాలుగా విభజించారు. వాటిని 'ఇక్తా' లు అనేవారు. తర్వాత ఈ ఇక్తాలే 'సుబా'లు గా (రాష్ట్రాలు) మారాయి. ఇక్తాకు బాధ్యత వహించే ఉన్నతాధికారిని వలీ లేక ముక్తీ అని పిలిచేవారు. తమ ఇక్తాలో అన్ని కార్యకలాపాలకూ ముక్తీలే బాధ్యత వహించాలి. శాంతి భద్రతలు, పన్నుల వసూలు బాధ్యతలు వీరివే. ఐతే, వీరు వసూలు చేసే పన్నుల ఆదాయాలను, వ్యయాలను ఖచ్చితంగా లెక్కించి ఖర్చులు పోగా తక్కినది సుల్తాను ఖజానాకు జమచేయవలసివుండేది. ఇందులో తేడాలు వస్తే ముక్తీలు కఠిన శిక్షలకు గురయేవారు.

సుబాలను పరగణాలుగా తిరిగి విభజించారు. ఒక్కో పరగణా కింద 100 నుండి 84 వరకు గ్రామాలు ఉండేవి. అంటే ఇప్పటి మండలం విస్తీర్ణానికి రెండు లేదా మూడు రెట్లు ఉండివుండాలి. గ్రామస్థాయిలో పట్వారీలు శిస్తువసూలుకు బాధ్యత వహించేవారు. భూస్వాములు, గ్రామ పెద్దలు గ్రామాన్ని పాలించేవారు. సాధారణంగా శిస్తు సక్రమంగా చెల్లిస్తూన్నంతకాలం గ్రామ వ్యవహారాల్లో పైనుంచి జోక్యం ఉండేది కాదు.

గ్రామసీమల్లో సారవంతమైన భూముల్లో వరి సాగు ఏడాదికి మూడు సార్లు కూడా చేసి నట్టు చరిత్రలో ఉంది. చెరుకు, పత్తి, తదితర వాణిజ్య పంటలు కూడా సాగు చేసేవారు. వాటి ఆధారంగా నూనె, బెల్లం, నేత పరిశ్రమలు నడిచేవి.

**రైతాంగం పై పీడన**

గ్రామ పెద్దలు, భూస్వాములు రైతులను పీడించేవారు. తమ భూముల్లో పండిన

> **❝ బ్రాహ్మణులకు ధర్మశాస్త్రాలు ఉన్నత స్థానాన్ని కొనసాగిస్తూవచ్చాయి. పౌరోహిత్యం తోబాటు వారికి వ్యవసాయం చేసుకునే హక్కు కూడా ఉండేది. ఆయుధాలను ధరించి తిరిగే అధికారం ఒక్క క్షత్రియులకు మాత్రమే ఉండేది. శూద్రులపై అన్ని ఆంక్షలూ కొనసాగాయి. అన్ని విధులూ చేయవలసి వచ్చేది. చదవడం శూద్రులకు నిషిద్ధం. ❞**

పంటలమీద చెల్లించవలసిన శిస్తులను కూడా రైతులనుండే వసూలు చేసేవారు. చాలా విలాసవంతంగా జీవించేవారు. మరోపక్క రైతులు నానా ఇబ్బందులకూ గురయ్యేవారు. కరువులు, లేదా యుద్ధాలు తరచూ సంభవించేవి. వాటినుండి రైతులను ఆదుకునే నాథుడు లేకుండా పోయాడు.

చాలా సుబాలను పూర్వం పాలించిన హిందూ రాజులే డిల్లీకి సామంతులుగా ఉంటూ ఇప్పుడూ పాలించసాగారు. వారిమీద సుల్తాను ఎక్కువగా ఆధారపడేవాడు.

**వాణిజ్యం-పరిశ్రమలు-రవాణా**

విశాలమైన భూభాగం మీద ఆధిపత్యం ఏర్పడడంతో అన్ని ప్రాంతాలకూ సంచరించ డానికి వీలుగా రహదారులు ఏర్పడ్డాయి. వ్యాపారం విస్తరించింది. వెండి నాణేలను తనకా అని, రాగి నాణేలను దిర్హామ్ అని పిలిచేవారు. పట్టణజీవితం పెరిగింది. డిల్లీతో బాటు దౌలతాబాదు (ఇప్పటి దేవగిరి, మహారాష్ట్ర) కూడా పెద్ద నగరంగా ఉండేది. వాయవ్యాన లాహోర్, ముల్తాన్, ఈశాన్యంలో లక్నౌతి, పశ్చిమాన కాంబే, అన్హిల్‌వారా వంటి నగరాలు పేరుపొందాయి. నాణ్యమైన వస్త్రాల తయారీ, బంగారు, వెండి ఆభరణాలు, చర్మ ఉత్పత్తులు, కంచు ఉత్పత్తులు, తివాచీలు సుదూర ప్రాంతాలకు సైతం ఎగుమతయ్యేవి. ముల్తానీలు, గుజరాతీలు, తమిళులు సముద్ర వ్యాపారంలో అరబ్బులకు గట్టి పోటీనిచ్చారు. వీరిలో ఎక్కువమంది హిందువులు, జైనులు. చాలా విలాసవంతమైన జీవితాన్ని గడిపేవారు. ముల్తానీ వ్యాపారులవద్ద అధికారులు తమ అవసరాలకోసం తరచూ రుణాలు తీసుకునే వారు.

రహదారులు ఏర్పడినందువలన సుల్తానులు తపాలా వ్యవస్థను ఏర్పాటు చేశారు. దారి వెంబడి చౌకీలను ఏర్పాటు చేశారు. ఒక చౌకీ నుండి తర్వాత చౌకీకి లేఖలను, సరుకులను చేరవేసేందుకు పరుగెత్తి పోయే ఉద్యోగులు ఉండేవారు. ప్రయాణంలో ఉన్న సుల్తాను తాగునీటి అవసరాలకు కూడా ఈ వ్యవస్థను ఉపయోగించారు.

బావులనుండి నీటిని తోడే చక్రాకారం లో ఉండే రాహత్ అనే యంత్రాలను వినియోగంలోకి తెచ్చారు. లోహ పరిశ్రమ అభివృద్ధి చెందింది. కాగితం తయారీ మొదలైంది. గాజు తయారీ విస్తరించింది.

ఉత్పత్తి సాధనాలలో తయారీ పద్ధతులలో వచ్చిన అభివృద్ధి వలన దేశంలో సంపద బాగా పెరిగింది.

సుల్తాను, ఉన్నతాధికారులు అత్యంత విలాసవంతమైన జీవితాన్ని గడిపేవారు. చాలా విశాలమైన భవనాలను నిర్మించుకుని, పటిష్టమైన కాపలా ఏర్పాటు చేసుకుని ఖరీదైన వస్తువులతో భవనాలను అంకరించుకుని, దేశ విదేశాలనుండి తెప్పించుకున్న ఖరీదైన దుసులను, ఉపకరణాలను ఉపయోగించేవారు.

**పట్టణ జీవితం**

పట్టణాల్లో అన్ని వర్గాల జనాభా ఉండేవారు. ఉన్నత, మధ్యస్థాయి అధికారులు, కింది స్థాయి అధికారులు, దుకాణదారులు, చేతివృత్తులవారు. బిచ్చగాళ్ళు-ఇలా ఉండే వారు. విద్యాబోధన ముస్లిం ఉలేమాల చేతుల్లో ఉండేది. వారి ఆలోచనలే ఎక్కువగా ప్రభావితం చేసేవి. పట్టణాల్లో నౌకర్లు, బానిసలు పెద్ద సంఖ్యలో ఉండేవారు. యుద్ధాల్లో బందీలుగా చిక్కినవారిని ఎక్కువగా బానిసలుగా మార్చేవారు. బానిస సంతలు కూడా పుట్టుకొచ్చాయి. నైపుణ్యంగల బానిసలకు, అందమైన మహిళలకు ఎక్కువ ధర పలికేది. బానిన యజమాని తన బానిసలకు తప్పనిసరిగా తిండి, గూడు, బట్ట ఏర్పాటు చేయవలసివచ్చేది. అదే నౌకరు విషయంలో అటువంటి బాధ్యత లేదు. కేవలం జీతం మాత్రమే చెల్లించేవారు. అది చాలా తక్కువగా ఉండేది. దాంతో స్వతంత్రుడైన నౌకరు జీవితం కన్నా బానిస జీవితమే మెరుగుగా ఉండేది. ఐతే సమాజంలో బానిస జీవితం అంటే చాలా నీచమైనదని పరిగణించేవారు. బానిసలకు విముక్తి కల్పించిన యజమాని చాలా ఉదాత్తుడిగా గౌరవించబడేవాడు. హిందూ, ముస్లిం యజమానులు ఇద్దరూ బానిసలను ఉపయోగించుకునేవారు.

నైపుణ్యం లేని కార్మికులు, చేతివృత్తిదారులు ఆర్థికంగా చాలా దయనీయమైన జీవితాలను గడిపేవారు. పట్టణాల్లో సమాజం అసమానతలతో నిండివుండేది. ఐతే ఈ అసమానతలు ముస్లిం సమాజంలోనే ఎక్కువగా ఉండేవి. దీనికి కారణం హిందువులలో అత్యధికభాగం తమ తమ గ్రామాల్లోనే కొనసాగడం. ఆ గ్రామీణ ప్రాంతాలలో అసమానతలు పట్టణాల్లో ఉన్నంత తీవ్రంగా ఉండేవి కావు. పండుగలు, తిరునాళ్ళు వంటి సందర్భాలలో మాత్రమే పేదలకు కాస్తంత ఆనందం దక్కేది.

**కులం-సామాజిక ఆచారాలు**

బ్రాహ్మణులకు ధర్మశాస్త్రాలు ఉన్నత స్థానాన్ని కొనసాగిస్తూవచ్చాయి. పౌరోహిత్యం తోబాటు వారికి వ్యవసాయం చేసుకునే హక్కు కూడా ఉండేది. ఆయుధాలను ధరించి తిరిగే అధికారం ఒక్క క్షత్రియులకు మాత్రమే ఉండేది. శూద్రులపై అన్ని ఆంక్షలూ కొనసాగాయి. అన్ని విధులూ చేయవలసివచ్చేది. చదవడం శూద్రులకు నిషిద్ధం. ఐతే పురాణాలను మాత్రం వినవచ్చు. ఐతే, విన్నవాటిని తిరిగి ఎక్కడా ప్రవచనాలుగా చెప్పకూడదు. శూద్రులలో తప్ప తక్కిన కులాల్లో వితంతు పునర్వివాహం నిషిద్ధం. సతి దురాచారాన్ని పాటించేవారు. బాల్యవివాహాలు జరిగేవి. పర్దా పద్ధతి ఉన్నత కులాల మహిళలలో ఉండేది.

ముస్లిం సమాజం కూడా జాతి భేదాలతో చీలిపోయివుండేది. తురుష్కులు, ఇరానీయులు, ఆఫ్ఘన్‌లు, భారతీయ ముస్లింలు ఒకరి నొకరు వివాహం చేసుకునేవారు కాదు. ఒక విధమైన హిందూ సమాజపు కుల వివక్షత వంటిది ఇక్కడా చోటు చేసుకుంది. హిందువులనుండి ఇస్లాం స్వీకరించినవారు తక్కువ కులాలవారైతే వారిపట్ల మతం మారిన తర్వాత కూడా వివక్షత పాటించబడేది.

హిందూ ఉన్నతవర్గాల వారు శూద్రులకు వర్తింపజేసే వివక్షతనే ముస్లింలకు కూడా వర్తింపజేశారు. అదే సమయంలో సామాజిక అవసరాల రీత్యా పరస్పరం సంపర్కం పెంచుకోక తప్పలేదు. సైన్యంలో చాలామంది హిందువులను చేర్చుకున్నారు. ప్రభుత్వాధికారుల్లో హిందువులు గణనీయంగా ఉండేవారు. స్థానికపరిపాలనా యంత్రాంగం ప్రధానంగా హిందువుల చేతుల్లోనే ఉండేది.

డిల్లీ సుల్తానులు తమ పాలన సాఫీగా కొనసాగడం కోసం గ్రామీణ హిందూ భూస్వాములతో అధికారపంపిణీకి సంబంధించి లోపాయికారీ అవగాహన కొనసాగించారు. అక్కడక్కడా ఏర్పడిన ఘర్షణలకు మతం రంగు పులిమే ప్రయత్నం కొందరు చరిత్రకారులు చేశారు. కాని ఈ ఘర్షణలు ప్రధానంగా భూములకు సంబంధించి గానీ, పండిన పంటలో వాటాకు సంబంధించి కానీ జరిగేవి.

**దేశం మొత్తానికి ఇస్లామిక్ చట్టాన్ని (షరియా)ను వర్తింపజేయడం కుదరదని సుల్తానులు నిర్ణయించారు. దేశంలో ముస్లింల పరిస్థితి వంటకంలో ఉప్పు మాది రిగా ఉందని, అందుచేత పౌరులందరకీ షరియాను వర్తింపజేయడం సాధ్యం కాదని తేల్చి చెప్పారు. రాజ్యం మొత్తానికి ఉపయో గపడే చట్టాలు అవసరం అని భావించి కొన్ని చట్టాలను రూపొందించారు. ఈ కారణం చేత అప్పటి చరిత్రకారుడు బరౌనీ భారత దేశాన్ని ఇస్లామిక్ రాజ్యంగా పరిగణించడా నికి నిరాకరించాడు. రాజ్యం ప్రాపంచిక, లేదా లౌకిక విలువలమీద ఆధారపడివుం దని అతడు వ్యాఖ్యానించాడు.**

సుల్తాను ఇస్లాం మతస్థుడైనప్పటికీ, ఉన్నత వర్గాల హిందువులను, ప్రత్యేకించి బ్రాహ్మ ణులను, క్షత్రియులను, వ్యాపారులను మతం విషయంలో ఒత్తిడి చేయులేదు. రైతాంగం మీద కూడా శిస్తు విధించే చర్య చేపట్టారు తప్ప ఆ పేరుతో మతం విషయంలో ఒత్తిడి చేయలేదు. పన్నువసూలు చేసే బాధ్యత ఉన్న ముస్లిం మత పెద్దలు మాత్రం హిందువులను వేధించడం, అవమానించడం వంటివి చేసే వారు. ఉన్నతస్థా యికి చేరని మెజారిటీ హిందూ సమాజాన్ని ఈ పాలన ఏ మాత్రమూ ప్రభావితం చేయలేకపోయింది.

**“ సుల్తాను ఇస్లాం మతస్థుడైనప్పటికీ, ఉన్నత వర్గాల హిందువులను, ప్రత్యేకించి బ్రాహ్మణులను, క్షత్రియులను, వ్యాపారులను మతం విషయంలో ఒత్తిడి చేయలేదు. రైతాంగం మీద కూడా శిస్తు విధించే చర్య చేపట్టారు తప్ప ఆ పేరుతో మతం విషయంలో ఒత్తిడి చేయలేదు. పన్నువసూ లు చేసే బాధ్యత ఉన్న ముస్లిం మత పెద్దలు మాత్రం హిందు వులను వేధించడం, అవమానించడం వంటివి చేసేవారు. ”**




### సుల్తానుల పాలనలో మతస్వేచ్ఛ

తురుష్కుల దండయాత్రలలో ఎన్నో నగరాలను, దేవాలయాలను ధ్వంసం చేశారు. తమ ఆధిపత్యం చాటుకోవడం కోసం దేవాలయాలను కూల్చిన చోట్ల అక్కడక్కడా మసీదులను నిర్మించారు. ఐతే, తాము ఇక్కడ రాజ్యపాలనలో స్థిరపడగానే, స్వంతంగా మసీదులను నిర్మించడం మొదలుపెట్టారు. పాత ఆలయాలను పునరుద్ధరించడానికి అనుమతులిచ్చారు. గ్రామాల్లో దేవాలయాల నిర్మాణంపై ఎటువంటి నిషేధాలూ లేవు. యుద్ధం సమయంలో మాత్రం శత్రువుకు సంబంధించిన భవనాలను, ప్రార్థనాస్థలాలను విడిచిపెట్టేవారు కాదు.

శాంతియుత పరిస్థితుల్లో హిందువులు తమ మతాన్ని బహిరంగంగా, ఉత్సాహభరితంగా పాటించేవారు. కరుడుగట్టిన మతప్రబోధకులు ఎన్ని ఒత్తిడులు తెచ్చినా, సుల్తానులు పర మత సహనం అనే విధానాన్ని తమ పాలనలో పాటించారు. ఇంకోపక్క వైష్ణవ మత ప్రబోధకుడు చైతన్యుడు కొంతమంది ముస్లిం లను హిందువులుగా మార్చాడు. బలవంతంగా మతమార్పిడి చేయగలిగినంత బలహీనంగా హిందూ సమాజం లేదని సుల్తానులు గ్రహించారు.

రాజకీయ ప్రయోజనాలను ఆశించిన వారు, ఆర్థిక తోడ్పాటును ఆశించిన కొందరు ఇస్లాం స్వీకరించినవారు ఉన్నారు. కొందరు సామంతరాజులు కూడా వారిలో ఉన్నారు. కొందరు గిరిజన తెగల నాయకులు కూడా ఉన్నారు. వారివెంట వారి అనుచరులుకూడా మతం మారారు.

సూఫీ ప్రబోధకులు ఇస్లాం మత మృదు స్వభావాన్ని ముందుకు తెచ్చారు. అది కొంత అనుకూల వాతావరణాన్ని తెచ్చింది. ఐతే, తమ పట్ల సాగిన కుల వివక్షత కారణంగా దళితుల్లో ఎక్కువమంది ఇస్లాం మతాన్ని స్వీకరించినట్టు చేస్తున్న వాదనలకు ఆధారాలు లేవు. వ్యక్తిగత, రాజకీయ, ఆర్థిక కారణాలే మత మార్పిడుల వెనుక ప్రధాన కారణం అని చెప్పాలి. పశ్చిమాసియా ప్రాంతం మీద మంగోలులు దండయాత్రలు చేసిన సందర్భంగా అక్కడినుంచి అనేక ముస్లిం కుటుంబాలు భారతదేశానికి వచ్చి తల దాచుకున్నాయి. అలాగే ఆఫ్ఘనిస్తాన్ నుండి ఎక్కువ వలసలు జరిగాయి. ఎన్ని జరిగినా సుల్తానుల పాలనాకాలంలో దేశంలో ముస్లింల సంఖ్య చాలా తక్కువగానే ఉండేది. (చూ. 14వ శతాబ్దపు డిల్లీ సుల్తానుల రాజ్యం పటం)

***(తరువాయి వచ్చే సంచికలో)***

# ఆధునిక బానిసత్వం: మహిళలు


రచయిత రిటైర్డ్ ఎకనామిక్స్ ప్రొఫెసర్

ప్రొ॥ కె. పద్మ

సమాజ పరిణామక్రమంలో బానిస సమాజం ఒక దశ. ఆఫ్రికా, ఆసియా దేశాలలోని యువతి, యువకులను, ముఖ్యంగా యువకులను దొంగలించి ఓడలలో అత్యంత అమానవీయ పరిస్థితులలో యూరోప్, బ్రిటన్, అమెరికా దేశాలలో వాణిజ్య పంటలు, తేయాకు, చెరకు కాఫీ తోటలలో, గనులలో, పరిశ్రమలలో పనిచేసేందుకు తీసుకునివెళ్ళే వారు. ద ట్రాన్స్ అట్లాంటిక్ డాటా బేస్ ప్రకారం 1526 నుంచి 1875 వరకు 5,01,942ల మంది ఆఫ్రికన్లు బానిసలుగా అమెరికాలో దిగారు. వీరిలో 74 శాతం మంది పురుషులు. బానిసత్వం ద్వారా పురుషుల శ్రమను ఉత్పత్తి కోసం ఒక సరుకుగా మార్చబడింది. అయితే మహిళలను బానిసలుగా చేసింది బానిస పిల్లలను కనడం ద్వారా బానిస వ్యవస్థను కొనసాగించడానికి కానీ వారిని వ్యభిచారంలోకి దించడానికి కాదు. అయితే, ఆధునిక బానిసత్వంలో 71 శాతం మంది మహిళలే ఉన్నారు. మహిళలు జీవించి వున్న సరుకు, అంటే వారి శరీరం సరుకుగా పరిగణించబడుతున్నది. మహిళలను వ్యభిచార వృత్తిలోను, ఉత్పత్తిలో చవక శ్రమగాను ఉపయోగిస్తున్నారు. బానిస తిరుగుబాట్లు, హేతువాదుల ప్రయత్నాలు, బానిస వ్యతిరేక సంస్కరణ వాదుల ఉద్యమాల ఫలితంగా బ్రిటన్‌లో 1833 లోనూ అమెరికాలో 1862 లోనూ బానిసత్వానికి వ్యతిరేకంగా చట్టాలు తీసుకుని వచ్చారు. అదేవిధంగా ప్రపంచంలోని ఇతర దేశాలలో కూడా బానిసత్వాన్ని నిరోధించడం జరిగింది. సుమారు 200 సంవత్సరాల క్రిందట బానిసత్వాన్ని రద్దు చేశారు కానీ ఈ నాటికీ ప్రపంచవ్యాపితంగా బానిసత్వం కొనసాగుతున్నది. ప్రపంచవ్యాపితంగా బానిసత్వం చట్ట విరుద్ధం. పశ్చిమదేశాలలో పునర్జీవన ఉద్యమాలు, సంస్కరణ ఉద్యమాలు, రష్యాలో సోషలిస్ట్ విప్లవం విజయవంతం అయిన తరువాత కార్మికులను బానిసలుగా పరిగణించే ధోరణి వెనక్కి వెళ్లింది. వారికి కొన్ని హక్కులు కల్పించడం జరిగింది. కానీ రష్యాలో సోషలిజం కూలిపోవడం, అమెరికా ప్రపంచంపై ఆధిపత్యం చెలాయించడంతో పాటు అనేక దేశాలలో ఉదారవాద ఆర్థిక విధానాలను అమలు చేయమని అభివృద్ధి చెందిన దేశాలు, అంతర్జాతీయ ద్రవ్య సంస్థలు ఒత్తిడి చేయడం కారణంగా ఆధునిక బానిసత్వం వెలుగులోకి వచ్చింది. ప్రస్తుతం బానిసత్వం ప్రపంచ మంతటా కొత్త రూపంలో వ్యాప్తి చెంది ఉంది. కానీ బయటకు కనబడదు. కార్మికులు సంకేళ్లతో కనబడరు. కానీ వారి మానసిక శారీరక శ్రమ బానిసత్వాన్ని పోలి వుంటుంది. పేదరికం, నిరుద్యోగం, నిర్బంధ శ్రమ లాంటి అవరోధాలు కానరాని సంకెళ్ళుగామారి కార్మికుల స్వేచ్ఛను హరించివేస్తాయి. అదేవిధంగా రాజకీయ, ఆర్థిక, సామాజిక పరిస్థితులు కార్మికులను గత్యంతరం లేక పనిలో కొనసాగేటట్టు చేస్తున్నాయి. ఆధునిక బానిసత్వాన్ని మనం ముఖ్యంగా ఎగుమతుల కోసం ఉత్పత్తి చేసే పరిశ్రమలలో ఎక్కువగా చూస్తాము. మన దేశంలో జౌళి పరిశ్రమ, రెడీమేడ్ దుస్తులు, డైమాండ్లు, రొయ్యలు, చేపలు, మందులు, బొమ్మలు, ఎలెక్ట్రానిక్ వస్తువులు మొదలైనవి ఎగుమతి ఆధారిత పరిశ్రమలు. ఈ పరిశ్రమలలో తయారైన వస్తువులను 100 శాతం ఎగుమతి చేస్తారు. ఈ పరిశ్రమలలో మహిళలు ఎక్కువగా పనిచేస్తారు.

ఉదారవాద ఆర్థిక విధానాలు ఎగుమతులను ప్రోత్సహించే నెపంతో చవక శ్రమ మీద ఆధారపడుతున్నాయి. ప్రభుత్వాలు పెట్టుబడిదారులకు పెట్టుబడులు పెట్టేందుకు ప్రోత్సాహకాలు ఇచ్చే క్రమంలో శ్రామిక చట్టాలలో మార్పులు చేస్తున్నాయి. ప్రజలందరికీ చెందే సంపదను కార్పొరేట్లకు అతి తక్కువ విలువకు అప్పజెప్పుతున్నాయి. ఈ విధానాలు ప్రజల స్వేచ్ఛను హరించివేస్తున్నాయని ప్రముఖ ఆర్థిక వేత్త ప్రభాత్ పట్నాయక్ చెప్పారు. అందువలన కార్మికులు గతంలో పోరాడి సాధించుకున్న హక్కులు, సామాజిక వనరులపైన హక్కులు కోల్పోతున్నారు. వారి జీవనభృతి సవాలుగా మారుతున్నది. వేతనాలు పెరగకపోవడం, ధరలు పెరగడం, నిరుద్యోగం పెరగడం, వ్యవసాయం గిట్టుబాటు కాకపోవడం, విద్య, వైద్యం అంగడిలో సరుకుగా మారడం వలన సామాన్య ప్రజలకు తమ కనీస అవసరాలను తీర్చు కోవడం కష్టమవుతున్నది. ఈ బాధల నుండే మతతత్వ – ఫాసిస్ట్ శక్తులు తలెత్తాయని ప్రఖ్యాత ఆర్థికవేత్త ఉత్సాపట్నాయక్ చెప్పారు. మహిళలు ఈ శక్తుల ఉచ్చులో చిక్కుకుంటున్నారు. మతం, కులం నిర్దేశించిన ఆచారాలు, సంప్రదాయాలు, కట్టుబాట్ల పేరుతో అణచివేతకు గురి అవుతున్నారు. ప్రజలు పేదరికం, సంక్షేమ పథకాల కుదింపు, అభద్రత, నిరుద్యోగం, అనిశ్చిత పరిస్థితులను ఎదుర్కోవలసి వస్తున్నది. ఇటువంటి పరిస్థితులలో కార్మికులు, ఏ కొమ్మ దొరికితే దానిని పట్టుకుని వరద దాటినట్టు, ఏ ఆసరా దొరికితే దాని ఆధారంతో బతుకు బండిని లాగించడానికి ప్రయత్నిస్తున్నారు. ఈ క్రమంలోనే వారు మోసాలకు, దోపిడీకి, హింసకు, లైంగిక వేధింపులకు, అక్రమ రవాణాకు, అత్యంత హీన పరిస్థితులలో పని చేయడానికి సిద్ధపడుతున్నారు. అలాగే మహిళలను, పిల్లలను అమ్మివేయడం జరుగుతోంది. మహిళలు పేదరికం, అభద్రత నుంచి తమ జీవితాలను మెరుగు పరుచుకోవడానికి, తమ కుటుంబాలకు సహకరించడానికి చేసే ప్రయత్నంలో ఈ ఉచ్చులో చిక్కు కుంటున్నారు. నిరక్షరాస్యత, అజ్ఞానం వలన మహిళలు పురుషులతో పోల్చినప్పుడు ఎక్కువగా మోసపోతున్నారు, వేధింపులకు గురవుతున్నారు. ఒకసారి ఆ ఉచ్చులో చిక్కుకున్న వారు బయటి రావడం చాలా కష్టం. పైకి పనికి వెళ్ళి వచ్చినట్టు కనబడుతుంది కానీ వారు అనుభవించే వేధింపులు, హింస కనబడదు.

### ఆధునిక బానిసత్వం

మహిళల నిర్బంధ శ్రమ, అప్పు వెట్టి/ వెట్టి చాకిరీ, కుటుంబపరమైన బానిసత్వం, మానవ అక్రమ రవాణా, నిర్బంధ వివాహం, చిన్న వయస్సులోనే పెళ్లిళ్లు చేయడం, గృహ

బానిసత్వం, సరఫరా గొలుసులో బానిసత్వం...ఇవన్నీ ఆధునిక బానిసత్వం కిందకు వస్తాయి. ఐక్య రాజ్య సమితి అంచనాల ప్రకారం 2021లో 5 కోట్లమంది మహిళలు ఆధునిక బానిసత్వంలో జీవిస్తున్నారు. అందులో 2.8 కోట్ల మంది, అంటే 56 శాతం మంది నిర్బంధ శ్రమ చేస్తుండగా మరో 2.2 కోట్ల మంది, అంటే 44 శాతం మంది బలవంతపు వివాహహం చేసుకున్నారు. ప్రపంచ నలుమూలల ఈ పరిస్థితి ఉన్నప్పటికీ బయటకు కానరాదు. వాక్ ఫ్రీ ఫౌండేషన్, అంతర్జాతీయ కార్మిక సంస్థ, అంతర్జాతీయ వలస సంస్థ సహకారంతో నిర్వహించిన అధ్యయనం ఆధునిక బానిసత్వా నికి సంబంధించి ఖచ్చితమైన అంచనాలను అందచేసింది. 2014లో, ప్రపంచ బానిసత్వ సూచిక అంచనా ప్రకారం ప్రపంచంలో 3.58 కోట్ల మంది ఆధునిక బానిసత్వంలో ఉండగా ఈ సంఖ్య 2016లో 4.03 కోట్లకు పెరిగింది. 2016, 2021 మధ్య కాలం లో అదనంగా 1 కోటి మంది మహిళలు ఆధునిక బానిసత్వంలోకి నెట్టివేయబడ్డారు. జాతి, సంస్కృతి, మతం అనే బేధం లేకుండా ప్రపంచ వ్యా ప్తంగా అన్ని దేశాలలోను మహిళల ఆధునిక బానిసత్వం కనబడుతుంది. నిర్బంధ శ్రామికులలో సగం కంటే ఎక్కువ మంది, బలవంతపు వివాహాలు చేసుకున్నవారే. వారిలో నాలుగోవంతు మంది మధ్యస్థ ఆదాయ దేశాలు, అధిక ఆదాయ దేశాలలో కనబడతారు. మహిళలు, పిల్లలు అసమానలతో ప్రమాదకర పరిస్థితిలో ఉన్నారు. ప్రైవేట్ రంగంలో పనిచేసే నిర్బంధ మహిళా శ్రామికులలో 23 శాతం మంది బలవంతపు వాణిజ్య లైంగిక దోపిడిని అనుభవిస్తున్నారు. ప్రభుత్వ రంగంలోని ఎనిమిది మందికార్మికులలో కనీసం ఒకరు బాలకార్మికుడు లేదా బాలకార్మికురాలు. ఇది నిర్బంధపు వాణిజ్య లైంగిక దోపిడిలో సగం కంటే ఎక్కువ అని 2022 ఐక్యరాజ్య సమితి నివేదిక తెలుపింది. ఆసియా- పసిఫిక్, ఆఫ్రికా దేశాలలో 85 శాతం ఆధునిక బానిసత్వం ఉంది. అమెరికా, సెంట్రల్ ఐరోపా దేశాలలో ఇది 14 శాతంగా ఉంది. అరబ్ దేశాలకు సంబంధించి సమాచారం లేదని అంతర్జాతీయ శ్రామిక సంస్థ నివేదిక తెలియచేసింది. ఆధునిక బానిసత్వపు రెండు ప్రధాన అంశాలు – నిర్బంధ శ్రమ, నిర్బంధ వివాహలు. ఈ రెండు అంశాల నిష్పత్తి 62: 38 గా ఉంది. ఐక్య రాజ్య సమితి 2022 నివేదిక ప్రకారం ప్రైవేట్ రంగంలో 86 శాతం నిర్బంధ శ్రమ ఉంటే

> **“ ప్రపంచంలోనే ఆధునిక బానిసత్వంలో ఉన్న అత్యధిక మంది ఇండియాలో ఉన్నారు. 2021లో దేశంలో 1.1 కోట్ల ప్రజలు ఆధునిక బానిసత్వంలో జీవిస్తున్నారు. ఇది ఏ దేశంతో పోల్చినా చాలా ఎక్కువ. ప్రతి 1000 మండి ప్రజలకు 8 మంది ఆధునిక బానిసత్వంలో జీవిస్తున్నారు. ఈ విషయంలో ఆసియా పసిఫిక్ ప్రాంతంలో భారత్ 6వ స్థానంలో ఉంది. ప్రపంచ వ్యా ప్తంగా 160 దేశాలకు గాను భారత దేశం 34వ స్థానంలో ఉంది. ”**

ప్రభుత్వ రంగంలో 14 శాతం వరకు ఉంది. నిర్బంధ వివాహలలో ఆసియా- పసిఫిక్, ఆఫ్రికాల వాటా 38, 35 శాతాలాగా ఉన్నాయి. ఇతర దేశాల వాటా 3 శాతం. అదేవిధంగా నిర్బంధ శ్రమలో కూడా ఆసియా- పసిఫిక్, ఆఫ్రికా దేశాల వాటా 38, 50 శాతం చెందగా మిగిలిన దేశాలకు 12 శాతం వాటా చెందుతుంది.

భారత దేశం జనాభా పరంగా ప్రపంచంలో మొదటిస్థానంలో ఉంది. ప్రపంచంలోనే ఆధునిక బానిసత్వంలో ఉన్న అత్యధిక మంది ఇండియాలో ఉన్నారు. 2021లో దేశంలో 1.1 కోట్ల ప్రజలు ఆధునిక బానిసత్వంలో జీవిస్తున్నారు. ఇది ఏ దేశంతో పోల్చినా చాలా ఎక్కువ. ప్రతి 1000 మండి ప్రజలకు 8 మంది ఆధునిక బానిసత్వంలో జీవిస్తున్నారు. ఈ విషయంలో ఆసియా పసిఫిక్ ప్రాంతంలో భారత్ 6వ స్థానంలో ఉంది. ప్రపంచ వ్యా ప్తంగా 160 దేశాలకు గాను భారత దేశం 34వ స్థానంలో ఉంది.

### వైవాహిక బానిసత్వం

ఆఫ్రికా దేశంలో బలవంతపు పెళ్లిళ్లు ప్రతి 1000కి 4.8 జరుగుతుండగా ఆసియా- పసిఫిక్ ప్రాంతంలో 1000 కి 2 జరుగుతున్నాయి. బలవంతపు పెంళ్లిల్లు, బాల్య వివాహాలు జరగడానికి పేదరికం, అవకాశాలు లేకపోవడం, యుద్ధాలు, లింగ అసమానతలను బలపరిచే మత ఆధారిత సంప్రదాయాలు, సంస్కృతి కారణాలు. పెళ్లికాని ఆడపిల్లలు అత్యాచారానికి, లైంగిక హింసకు గురయ్యే ప్రమాదం ఉన్నప్పుడు పెళ్లి ఒక సురక్షిత కవచంగా ఉంటుంది. పెళ్లి ఆడపిల్లలకు భద్రతను, భవిష్యత్తుని, కుటుంబం గౌరవాన్ని కాపాడుతుంది. కొన్ని సందర్భాలలో బలవంతంగా పెళ్లికి ఒప్పించడానికి అత్యాచారాన్ని ఆయుధంగా పయోగిస్తున్నారు. ఆఫ్రికాలో బలవంతంపు పెళ్లిల్లను బానిసత్వంలోకి దించడానికి ఒక సాధనంగా వాడుతున్నారు. బలవంతపు పెళ్లికి ఆసియాలో కొన్ని సందర్భాలలో తల్లి తండ్రులు, ఇతర కుటుంబ సభ్యులు చేసే లింగ ఆధారిత హింస కారణం. చిన్న లేదా పెద్ద పిల్లల అంగీకారాన్ని బలవంతంగా పొందడానికి భయపెట్టడం లేదా భౌతిక హింసని ఉపయోగించి బలవంతపు పెళ్లి అనే వుచ్చులో బంధిస్తున్నా రు. బలవంతంగా పెళ్లిని కుదర్చడానికి అనేక కారణాలున్నాయి. బలవంతపు పెళ్లిని సమర్ధించడానికి తల్లి తండ్రులు చెప్పే ప్రధానకారణాలు మత సంప్రదాయాలు, సంస్కృతి, బాధ్యత, గౌరవం. ఇవి వారి ఆడపిల్లల లైంగికతను నియంత్రిస్తున్నాయి. నిర్బంధపు పెళ్లిళ్ళకు, బాల్య వివాహాలు, మహిళల లైంగికత, వ్య క్తిగత నమ్మకాలకు సమాంతర సంబంధం ఉంది. అనేక మంది తల్లి తండ్రులు ఆడపిల్లలను అమ్మేయడానికి పేదరికం కూడా ఒక కారణం. ఆడపిల్లలను ధనవంతులకు అమ్మడం ద్వారా వారు ఆదాయాన్ని పొందుతారు. ఆర్ధిక ఇబ్బందులు కూడా ఆడపిల్లలను బానిసత్వంలోకి దించడానికి ఒక కారణం.

ఒక యువతికి పెళ్లిని నిరాకరించే హక్కు లేనప్పుడు ఆ పెళ్లి 'బానిస వివాహం' గా పరిగణించ బడుతుంది. ఐక్య రాజ్య సమితి కన్వంషన్స్‌లో బలవంతపు వివాహాన్ని బానిసత్వానికి సమానంగా పరిగణించారు. ఒక యువతిని అమ్మేయవచ్చును. యువతి భర్త చనిపోతే వేరే వ్యక్తి ఆమెను వారస త్వంగా పొందవచ్చును. యువతులను, మహిళలను ముసలి సంపన్న పురుషులను పెళ్లి చేసుకోమని బలవంతంచేయడం ద్వారా వారు లైంగిక, గృహ బానిసలు అవుతున్నారు. ఇథోయోపియాలో ఇప్పటికీ ఈ సంప్రదాయం చిన్న వయస్సు ఆడపిల్లలను రేప్ చేయడం ద్వారా కొనసాగుతున్నది. ఇక్కడ నమోదైన మరో రకమైన బానిస వివాహం మహిళలను ప్రీస్ట్‌లకు తాకట్టుపెట్టడం. ఘనా, టాంగో, బెనిన్, నైజేరియాలో కుటుంబ సభ్యులు తమ నేరాలకు

❝భారత దేశంలో నిర్బంధ వివాహాలకు సంబంధించి సరైన సమాచారం లేదు. 2022లో 20 నుండి 24 సవత్సరాలు ఉన్న మహిళల్లో 23 శాతం మంది 18 సవత్సరాలలోపు వివాహం చేసుకున్నారని అంచనాలు తెలియచేస్తున్నాయి. 2021లో 182 మంది మహిళలు నిర్బంధ వివాహాల కోసం అక్రమంగా రవాణాచేయబడ్డా రని ప్రభుత్వం గుర్తించింది. దేశంలో బాల్య వివాహాలను నిషేధించినప్పటికీ బాల్యంలోనే వివాహం జరిగిన 21.6 కోట్ల మంది మహిళలు, ఆడపిల్లలు దేశంలో ఉన్నారు.❞

ప్రాయశ్చిత్తం పొందడానికి మహిళలను ప్రీస్ట్‌లకు తాకట్టు పెట్టుతున్నారు. ఆసియా దేశాలలో కొన్ని సందర్భాలలో యువతులను వారి అనుమతి లేకుండా వధువు ధరను చెల్లించి 'కొనుగోలు' చేయడం జరుగుతున్నది. మన దేశంలో రాజస్థాన్, హరియాన రాష్ట్రాలలో ఎక్క డైతే స్త్రీల నిష్పత్తి తక్కు వగా ఉందో అక్కడ ఇతర రాష్ట్రాలకు చెందిన యువతులను, ముఖ్యంగా ఒడిషా, బిహార్ కు చెందిన యువతులను, వరుడు ధర చెల్లించి కొనుగోలు చేయడం జరుగుతున్నది. వైవాహిక బానిసత్వంలో ఉన్న మహిళలు రేపిస్టుల నుండి, కొనుగోలుదార్ల నుండి, ప్రీస్ట్‌లనుండి భౌతిక, లైంగిక హింసను ఎదుర్కుంటున్నారు.

### వ్యభిచారం

వ్యభిచారం బార్స్‌లోనూ, ప్రైవేట్ స్థలాల్లోనూ అక్రమ నెట్‌వర్క్‌ ద్వారా జరుగుతున్నది. పేదరికం, ఉద్యోగాలు ఇస్తామనిచెప్పి మోసగించి వ్యభిచార వృత్తిలోకి దించడం, కుటుంబ సహకారం, ఆదరణ లేనిపరిస్థితులు, కుటుంబం ఆడపిల్లలను అమ్మి వేయడం వ్యభిచారానికి కారణాలు. మధ్యప్రదేశ్‌లోని బెడియా, బచ్చడా, ఖాంజార్ అనే దళిత కులాల వారు పుట్టిన పిల్లల్లో 13 సవత్సరాల లోపు ఆడపిల్లలను కుటుంబ పోషణకై వ్యభిచార వృత్తిలోకి దింపుతున్నారు. జోగిని, దేవదాసీ ఆచారాలు కూడా ఇదే కోవకు చెందుతాయి. నిమ్న కులాలకు చెందినవారు తమ ఆడపిల్లలను హిందూ దేవుళ్ళతో వివాహం జరిపిస్తారు. ఇది పురోహితులు, గుడి పోషకులకు లైంగిక దోపిడి చేయడానికి అవకాశం కల్పిస్తుంది. 1988లో ఈ ఆచారాన్ని చట్టపరంగా నిషేధించినప్పటికీ ఇంకా కొనసాగుతున్నది. భారత దేశంలో నిర్బంధ వివాహాలకు సంబంధించి సరైన సమాచారం లేదు. 2022లో 20 నుండి 24 సవత్సరాలు ఉన్న మహిళల్లో 23 శాతం మంది 18 సవత్సరాలలోపు వివాహం చేసుకున్నారని అంచనాలు తెలియచేస్తున్నాయి. 2021లో 182 మంది మహిళలు నిర్బంధ వివాహాల కోసం అక్రమంగా రవాణాచేయబడ్డా రని ప్రభుత్వం గుర్తించింది. దేశంలో బాల్య వివాహాలను నిషేధించినప్పటికీ బాల్యంలోనే వివాహం జరిగిన 21.6 కోట్ల మంది మహిళలు, ఆడపిల్లలు దేశంలో ఉన్నారు. ప్రపంచంలోనే భారత్‌లో లింగ అసమానతలు ఎక్కువగా ఉన్నాయి. 2025లో 146 దేశాల లో జెండర్ గ్యాప్ ఆధారంగా భారత దేశం 131వ స్థానంలో ఉంది. లింగ అసమానతల సూచీ ప్రకారం 2025లో ఇండియా ర్యాంక్ 193 దేశాలలో 108వ స్థానంలో ఉంది. పితృస్వామ్య ఆలోచనలు, సంప్రదాయాలు మహిళల పాత్రలను పరిమితంచేసి అభద్రతను పెంచుతున్నాయి. ఉదాహరణకి ఎక్కువ వరకట్నం ఇవ్వాల్సి వస్తుందని ఆడపిల్లలను ఎక్కువగా చదివించకుండా తొందరగా పెళ్లి చేస్తున్నారు. ఆర్థిక భారాన్ని తగ్గించుకోవడానికి కూడా ఆడపిల్లలకు తొందరగా పెళ్లిళ్లు చేస్తున్నారు. నిర్బంధ వివాహం మహిళలను హింసకు గురి చేస్తుంది. సుమారు 30 శాతం మంది పెళ్లి అయిన మహిళలు వారి జీవితకాలంలో జీవితభాగస్వామి నుండి హింసను అనుభవించారు.

### నిర్బంధ శ్రామికుల బానిసత్వం

ఎగుమతుల కోసం ఉత్పత్తి చేసే పరిశ్రమలలో నిర్బంధ శ్రమ నియామకం ఉంది. నిర్బంధ శ్రమను ఉపయోగించడాన్ని ప్రతి దేశం సమర్థించుకుంటున్నది. ఉదాహరణకి ఉజ్బెక్ ప్రభుత్వం గ్రామీణ ప్రాంతాలకు చెందిన బడికి వెళ్తున్న 5 నుండి 14 వయస్సులో ఉన్న పిల్లలను చేతులతో పత్తి ఏరడానికి శరదృతువులో నియమించడాన్ని కొనసాగిస్తున్నది. ఈ సమస్య ఉన్నట్టుగా అంగీకరించడానికి ఉజ్బెక్ ప్రభుత్వం నిరాకరిస్తున్నది. ఉజ్బెకిస్తాన్‌లో 14 లక్షలకంటే ఎక్కువ మంది పిల్లలు పత్తి ఏరివేసే పని చేస్తున్నట్టు అందుబాటులో ఉన్న గణాంకాలు తెలియచేస్తున్నాయి. మీడియాపై తీవ్ర నిర్బంధం ఉన్న కారణంగా వాస్తవంగా ఎంత మంది పిల్లలు పనిచేస్తున్నారు అన్నది తెలుసుకోవడం కష్టం. ఈ మధ్య కాలంలో పత్తి ఏరివేతలో పిల్లల నియామకం పెరిగిందని నివేదికలు తెలియ చేస్తున్నాయి. ఎగుమతుల నుంచి ఆర్జించిన మొత్తం 50 కోట్ల డాలర్లు నిర్బంధ శ్రమ నుంచి కాకపోయినప్పటికి సుమారు ఏడాదికి 10 కోట్ల డాలర్లు నిర్బంధ శ్రమ వాటాగా ఉంటుంది. నేడు ఇటుకల తయారీ, వ్యభిచారం నుండి బహులజాతి కార్పొరేషన్స్ వరకు బానిసత్వం విస్తరించి ఉంది. 'ఆధునిక బానిసత్వం' ప్రపంచ ఆర్థిక వ్యవస్థతో సంక్లిష్ట సంబంధా లను కలిగి ఉంది. పాత బానిసత్వ పద్ధతుల మాదిరి కొత్తగా బానిసలైన ప్రజలకు దీర్ఘకాల పెట్టుబడులు అవసరం లేదు. కొత్త బానిసలు చాలా చవక, అతి తక్కువ సంరక్షణ అవసరం. ఎప్పుడంటే అప్పుడు వారిని వాడి పారవేయ వచ్చును. అంతర్సంబంధమున్న మూడు అంశాలు నూతన బానిసత్వానికి కార ణాలు. అవి: జనాభా పెరుగుదల, వ్యవసాయం ఆధునికరించబడటం, అభివృద్ధి చెందుతున్న దేశాల ఆర్థిక వ్యవస్థలలో మార్పులలో భాగంగా అవినీతి, హింస పెరగడం. పేదరికం, యుద్ధాలు, లింగ అసమానతలు, శ్రామిక వ్యయాన్ని తగ్గించమని నిరంతర ఒత్తిడి, బానిసత్వం పెరగడానికి భూమికను ఏర్పరిచాయి. ప్రైవేటు అప్పుల వలన బాండెడ్ లేబర్‌లో సగం కంటే ఎక్కువ మంది బాధితులవుతున్నారు. ప్రైవేటు నిర్బంధ శ్రమ బానిసత్వంలో పురుషులకన్నా మహిళలు ఎక్కువ బాధితులవుతున్నారు. 57.6 శాతం మహిళలు బాధితులైతే 42.4 శాతం పురుషులు బాధితులు. వ్యక్తిగత ఋణాలను ఉపయోగించుకుని నిర్బంధ శ్రామికులు వ్యవసాయం, గృహ లేదా వస్తుతయారీ పరిశ్రమలలో పనిచేసేటట్టు చూస్తున్నారు. ప్రపంచవ్యాపితంగా వెట్టి ఆకిరీ లేదా ఋణ వెట్టిని ఉపయోగించి ప్రజలను బానిసలుగా చేస్తున్నారు. దక్షిణ ఆసియాలో ముఖ్యంగా భారత్, పాకిస్తాన్, నేపాల్ దేశాలలో వెట్టి చాకిరీ ఎక్కువగా ఉంది. 2016లో మినిస్ట్రీ ఆఫ్ లేబర్ అండ్ ఎంప్లాయిమెంట్ విజన్ డాక్యుమెంట్ ప్రకారం భారత దేశంలో 1.84 కోట్ల మంది వెట్టి కార్మికులుగా ఉన్నారు. వారిలో 80 శాతం మంది ఎస్టీ, ఎస్సీ, ఓబిసి తరగతులకు చెందినవారు. అంతర్జాతీయ కార్మిక సంస్థ (ఐఎల్ఓ) నివేదిక 2017 ప్రకారం గృహ

రంగంలో నిర్బంధ శ్రామికులు ఎక్కువ సంఖ్యలో పనిచేస్తున్నారు. వీరి శాతం 24. ఆ తరువాత నిర్మాణరంగంలో 18 శాతం. తయారీ రంగంలో 15 శాతం మంది పనిచేస్తున్నారు. వీరిలో చాలా మంది అనేక రకాల బలాత్కారాలకు గురిఅవుతున్నారు. వేతనాలు నిలిపివేయడం, హింసిస్తామని బెదిరించడం, కుటుంబ సభ్యులను బెదిరించ డం ద్వారా పని ఒదిలి వెళ్లకుండా చేయడం లాంటివి కొన్ని. పద్ధతులను అమలు చేస్తున్నారు. మహిళలు తరుచూ లైంగిక హింస, లైంగిక దోపిడీకి బాధితులు. పిల్లలు వ్యభిచార బాధితులు. ఆధునిక బానిసలు పర్షియన్ గల్ఫ్‌లో నిర్మాణ రంగంలో, నేపాలీ అమ్మాయిలు వ్యభిచార వృత్తిలో, థాయి షిప్స్‌లో రొయ్యలు వేటాడేవారిగా, ఇండియాలో ఇటికల బట్టీలలో, బంగ్లాదేశ్‌లో దుస్తుల తయారీలో పనిచేస్తున్నారు. అమెరికా, ఐరోపా దేశాలలో ప్రైవేట్ ఇళ్లల్లో పనిచేసేవారు కూడా బానిసత్వానికి లోనవుతున్నారు. వెట్టి చాకిరీకి సంఘటిత రంగంలోని ఉద్యోగస్తుల మాదిరి సామాజిక భద్రత, ఉద్యోగ భద్రత, వేతనంతో కూడిన సెలవులు, నిర్దిష్ట వేతనం, సురక్షణమైన పని పరిస్థితులు, ఆరోగ్య సదుపాయాలు ఉండవు. కనుక వీరు తరుచూ సులభంగా దోపిడీకి లోనవుతారు. అసంఘటిత రంగం, పేదరికం వెట్టి చాకిరీ కొనసాగడానికి ఉపకరిస్తున్నాయి. పెద్ద కార్పొరేషన్స్‌లో కార్మికులను ఏజన్సీల ద్వారా నియమించు కోవడం వలన కార్మికులకు, కార్పొరేషన్లకు ప్రత్యక్ష సంబంధం ఉండదు. ఆ కారణంగా కార్మికులు దోపిడీకి గురౌవుతున్నారు. ఏజన్సీలు లాభాలు గణిస్తున్నాయి.

భారత దేశంలో 45 కోట్ల మంది అసంఘటితరంగంలో పనిచేస్తున్నారు. వీరి శాతం 85 నుండి 90 వరకు ఉంటుంది. ముఖ్యంగా పట్టణ ప్రాంతాలలో నిర్మాణ రంగం, వస్తు తయారీ రంగం, సేవారంగంలోను గ్రామీణ ప్రాంతాలలో వ్యవసాయం, చేనేత పరిశ్రమలోనూ అసంఘటిత కార్మికులను చూడవచ్చు. భారత దేశంలో 50 లక్షల గృహ కార్మికులలో 92 శాతం మంది మహిళలు, ఆడపిల్లలే. ఈ కార్మికులకు అధికారిక నియామక పత్రాలు, సమంజసమైన వేతనం, సామాజిక రక్షణ, భూమి యజమాన్యం, బ్యాంక్ రుణాలు లేని కారణంగా వడ్డీ వ్యాపారస్థుల ఉచ్చులో చిక్కి నిర్బంధ శ్రామికులుగా మరే ప్రమాదం పెరుగుతున్నది. అసంఘటిత రంగంలో కూడా ఆర్థిక అవకాశాలు లేని కారణంగా పని కోసం

> **“ భారత దేశంలో 45 కోట్ల మంది అసంఘటిత రంగంలో పనిచేస్తున్నారు. ముఖ్యంగా పట్టణ ప్రాంతాలలో నిర్మాణ, వస్తు తయారీ, సేవారంగాల్లో, గ్రామీణ ప్రాంతాలలో వ్యవసాయం, చేనేత పరిశ్రమల్లో అసంఘటిత కార్మికులున్నారు. దేశంలో 50 లక్షల గృహ కార్మికులలో 92 శాతం మహిళలు, ఆడపిల్లలే. వీరికి అధికారిక నియామక పత్రాలు, సమంజసమైన వేతనం, సామాజిక రక్షణ, లేని కారణంగా వడ్డీ వ్యాపారస్థుల ఉచ్చులో చిక్కి నిర్బంధ శ్రామికులుగా మరే ప్రమాదం పెరుగుతున్నది. ”**



ఇటుకల బట్టీల్లో మహిళల వెట్టి చాకిరీ

విదేశాలకు వలసలు వెళ్ళే పరిస్థితికి నెట్టబడుతున్నారు. కపట అజెంట్లు, మధ్య వర్తుల మోసపు నియామకాల కారణంగా ఈ కార్మి కులు అక్రమరవాణా ఉచ్చులో చిక్కు కుంటున్నారు. రాజస్తాన్‌లో శాండ్ స్టోన్ గనులలో పనిచేసే సీజనల్ పనివారు పనిలేని రోజులలో రోజువారీ ఖర్చుల కోసం యజమాని నుండి అప్పు తీసుకున్న వారిని అప్పు తీర్చడానికై పని చేయమని నిర్బంధిస్తున్నట్లు తెలియజేశారు. ఇటువంటి వారిని రెడీమేడ్ దుస్తులు, బట్టల పరిశ్రమలోను, వ్యవసాయం, ఇటికల తయారీ, టీ ఉత్పత్తిలోనూ, అక్రమ మైకా మైనింగ్‌లోనూ చూడవచ్చును. అనేక మంది కార్మికులకు కోవిడ్ మహమ్మారి తరువాత పరిస్తితి మరింత దిగజారింది. కొంతమంది పిల్లలను మంచి జీతం ఇస్తామని నమ్మించి భౌతిక దాడులు చేస్తామని భయపెట్టి గాజుల తయారీలో జీతం ఇవ్వకుండా పనిచేయించుకున్నట్లు రిపోట్లు వచ్చాయి. అదేవిధంగా ఫ్యాక్టరీలో మంచి జీతానికి పని కల్పిస్తామని నమ్మబలికి మానవ అక్రమ రవాణాదారులు గృహ బానిసత్వంలోకి దించిన సంఘటనలను కూడా కోవిడ్ కాలంలో జరిగి నట్టు నివేదికలు తెలియజేస్తున్నాయి. ఉదార వాద విధానాలు అమలుచేసిన తరువాత శాశ్వత కార్మికులను నియమించే బదులు టెంపరరీ కార్మికులను, పీస్ రేట్ కార్మి కులను, ఫిక్స్‌డ్ టైమ్ కార్మికులను, కాంట్రాక్ట్ కార్మికులను, డైలీ వేజ్ కార్మికులను, క్యాజువల్ కార్మికులను నియమిస్తున్నారు. జమాటో, అమెజాన్, స్విగ్గీ, ఉబర్, రెడీమేడ్ దుస్తుల రంగంలో పనిచేసే వారు, స్కీం వర్కర్లు మొదలైనవారందరు ఆధునిక శ్రమ దోపిడీకి గురి అవుతున్న కార్మి కులే.

**ఘర్షణలు, వాతావరణ మార్పులు, ప్రధాన స్రవంతి నుంచి నెట్టివేయబడిన మైనారిటీలు**

జమ్మూ-కాశ్మీర్లో ఉగ్రవాదులకీ, సాయుధబలగాలకీ ఘర్షణ కారణంగా, తూర్పున మావోయిస్టుల తిరుగుబాటు కారణంగా, ఈశాన్య ప్రాంతాలలో జాతుల మధ్య సంఘర్షణ వలన 2022 డిసెంబర్ నాటికి 6,31,000 మంది నిరాశ్రయుల య్యారు. ప్రకృతి విపత్తుల కారణంగా సుమారు 25 లక్షల మంది 2022లో నిర్వాసితులయ్యారు. ఈ సంక్షోభాలను అవకాశంగా తీసుకుని అక్రమ రవాణాదారులు వనరులు, రక్షణ లేనివారిని, బంధువులు స్నేహితుల సహకారం లేని వారిని, వలసలకు సంబంధించిన సమాచారం లేని వారిని ఎంపిక చేసుకుని ఆ వ్యక్తులను దోపిడి చేస్తున్నారు. అబ్బాయిలను సాయుధ ఘర్షణల కోసం నియమిస్తావుంటే మహిళలను నిర్బంధ వివాహలలోనికి రక్షణ పేరుతో దించుతున్నారు. కుల వ్యవస్థ కూడా ఆధునిక బానిసత్వానికి సహకరిస్తున్నది. హిందూ మతం ప్రజలను అగ్ర

> **❝ ప్రస్తుతం ప్రపంచంలో రెండు రకాల వాదనలు ఉన్నాయి. ఒక వాదన ప్రకారం లైంగిక దోపిడీ/ వ్యభిచారం మహిళలను లైంగిక వస్తువులుగా పరిగణిస్తుంది. కనుక దీన్ని అరికట్టాలి. రెండవది, వ్యభిచార వృత్తిని ఇతర ఏ వృత్తి మాదిరిగానే పొట్ట కూటి కోసం చేస్తున్నారు కనుక, వారికి కార్మికుల హోదా ఇచ్చి వారి హక్కులు అమలు అయ్యేటట్లు చూడాలన్నది. ❞**

కులాలు, నిమ్న కులాల వారిగా విభజించింది. చరిత్రాత్మకంగా నిమ్నకులాల వారు విభజనకు, అణిచివేతకు, వెట్టి చాకిరీకి, వివక్షతకు గురవుతున్నారు. రాజ్యాంగం ఏ ఒక్క పౌరుడూ వివక్షతకు గురికాకూడదని చెప్పి నప్పటికి, వెట్టి చాకిరీని నిషేధించినప్పటికీ, కుల వివక్షత, వెట్టి చాకిరీ కొనసాగుతున్నాయి.

**ముగింపు**

మానవ హక్కుల ఎజెండా లైంగిక దోపిడీ, వ్యభిచారం నైతికతను సవాల్ చేస్తున్నది. ప్రస్తుతం ప్రపంచంలో రెండు రకాల వాదనలు ఉన్నాయి. ఒక వాదన ప్రకారం ఏ రకమైన లైంగిక దోపిడీ/ అన్ని రకాల వ్యభిచారం మహిళలను లైంగిక వస్తువులుగా పరిగణిస్తుంది. కనుక లైంగిక దోపిడీని/ వ్యభిచారాన్ని అరికట్టాలి అన్నది ఒక వాదన. రెండవది, వ్యభిచార వృత్తిని ఇతర ఏ వృత్తి మాదిరిగానే పొట్ట కూటి కోసం చేస్తున్నారు కనుక, వారికి కార్మికుల హోదా ఇచ్చి వారి హక్కులు అమలు అయ్యేటట్లు చూడాలన్నది రెండో వాదన. అయితే ఇక్కడ కీలకమైన ప్రశ్న ఏమిటంటే వ్యభిచార వృత్తి స్వచ్ఛందంగా చేసినా లేదా ఒత్తిడితో చేసినా దానిని చట్టపరమైన పనిగా గుర్తించాలా, వద్దా? వ్యభిచారాన్ని పనిగా గుర్తిస్తే మహిళలకు కొన్ని హక్కులు, కొంత మేరకు రక్షణ కల్పించే అవకాశం ఉంటుంది. అదో తాత్కాలిక పరిష్కారమే కానీ శాశ్వత పరిష్కారం కాదు. వ్యభిచారం అన్నది మోనోగామి ఒక వైవాహిక వ్యవస్థగా స్థిరపడిన తరువాత ఎక్కువగా వ్యాప్తి చెందింది. వ్యభిచారం సమాజంలో నిర్మూలించాలి అంటే సమాజంలో ఉన్న అన్ని రకాల అసమానతలను, దోపిడిని నిర్మూలించాలి. అభద్రత ఆధునిక భానిసత్వానికి ప్రధాన కారణాలలో ఒకటి. అభద్రతకు పేదరికం, ఘర్షణలు, రాజకీయ అస్థిరత, ప్రజల హక్కుల హననం, చారిత్రకంగా సామాజిక, ఆర్థిక అసమానతలు, ఒక పద్ధతి ప్రకారం కనీస అవసరాలు తీరకుండా చేయడం వంటివి కారణాలు. ఈ కారణాలవలనే మహిళలు తమ జీవనాన్ని మెరుగుపరుచుకోవడం కోసం, కుటుంబాన్ని ఆదుకోవడం కోసం పనిని వెతుక్కునే క్రమంలోను, పనిలో చేరిన సందర్భంలోనూ బానిసత్వంలోకి నెట్టబడుతున్నారు. మహిళలు ఎగుమతి కోసం ఉత్పత్తి చేసే పరిశ్రమల్లో ఎక్కువగా పనిచేస్తున్నారు. మన దేశం నుండి ఎగుమతి అవుతున్న కొన్ని ప్రధాన ఉత్పత్తులు... రొయ్యలు, చేపలు, రెడీమేడ్ దుస్తులు, కార్పెట్లు, డైమండ్లు, బంగారు నగలు, ఎలెక్ట్రానిక్ వస్తువులు మొదలైనవి. ఈ వస్తువుల ఉత్పత్తిలో మహిళలు అధిక శాతం పాల్గొంటున్నారు. ఈ వస్తువుల తయారీకి ఓపిక, చేతులను చురుకుగా, వేగంగా తిప్ప గలగడం అవసరం. ఇటువంటి పనులను మహిళలు పురుషులకంటే బాగా చేయగలరు. మహిళల వేతనాలు పురుషుల వేతనాలకంటే తక్కువ. ఆ కారణంచేత ఉత్పత్తిసంస్థలు తక్కువ వ్యయానికి ఉత్పత్తి చేసి అంతర్జాతీయ పోటీని ఎదుర్కొని లాభాలను ఆర్జిస్తూన్నాయి. సమాజంలో అనాదిగా వెళ్ళూనికొని ఉన్న పితృస్వామ్య భావజాలాన్ని, మతపరమైన వివక్షతను పెట్టుబడిదారులు ఉపయోగించుకుని మహిళా కార్మికులను తక్కువ వేతనంతో ఎక్కువ గంటలు పని చేయించుకుంటున్నారు. లైంగిక హింస ద్వారా మహిళలను అణచివేస్తున్నారు. కనుక ఉదారవాద విధానాలు అమలైన తరు వాత మహిళలు అత్యంత దోపిడీకి గురవు తున్నారు.

ప్రభుత్వం పాలనాపరంగా, చట్టపరంగా, సంక్షేమానికి సంబంధించిన చర్యలు తీసుకోవ డం ద్వారా ఆధునిక బానిసత్వా న్ని నిర్మూలన చేయ వచ్చును అనే అభిప్రాయం వ్యక్తం చేస్తుంటారు. అయితే ఉదారవాద విధానాలు సంక్షేమ పథకాల అమలుకి అడ్డంకిగా ఉన్నాయి. ఎందుకంటే ప్రభుత్వం తన వ్యయాన్ని తగ్గించుకోవాలని ద్రవ్య పెట్టుబడి షరతు విధిస్తుంది. ప్రభుత్వం లోటుబడ్జెట్ ద్వారానే వ్యయాన్ని పెంచుకోగలదు. కానీ ప్రభుత్వ బడ్జెట్‌లోటు జిడిపిలో 3 శాతం కన్నా ఎక్కువ ఉండకూడదని ఎఫ్ఆర్‌బిఎం చట్టం చెప్తుంది. కనుక ప్రభుత్వం సంక్షేమ పథకాలను అపరిమితంగా అమలుచేయలేదు. అలా చేయాలంటే తన విధానాలను మార్చు కోవలసి ఉంటుంది. ఆధునిక బానిసత్వానికి మూలం ప్రస్తుతం ఆచరణలో ఉన్న సామాజిక ఆర్థిక దోపిడీ వ్యవస్థ. భారత దేశంలోనే చూసుకుంటే ఉదారవాద విధానాలలో భాగంగా పెట్టుబడులను ఆకర్షించాలనే సాకుతో కార్పొరేట్ సంస్థలకు అనుకూలమైన విధానాలను అన్ని రంగాలలో అమలు చేస్తున్నాయి. ఉదాహరణకు రోజుకు పని గంటలను 13 గంటలకు పెంచడం, రైతులకు గిట్టుబాటు ధర, ఎరువులు, విత్తనాలకు రాయితీలు లేకుండా చేయడం, గిరిజనుల భూములను గిరిజనులుకాని వారికి చెందేట్టుగా చట్టాలలో మార్పు చేయడం, సామాజిక వనరులు అయిన భూమి, గనులు, అటవీ సంపద లాంటి వాటిని కార్పొరేట్ సంస్థలకు అతి చవకగా కట్టబెట్టడం లాంటి చర్యలు దోపిడీ వ్యవస్థను బలపరిచే చర్యలే కానీ సామాన్య ప్రజల అభివృద్ధికి ఉపయోగపడే చర్యలు కావు. అదేవిధంగా ఆర్థిక అభివృద్ధికి పెట్టుబడే ప్రధానం, శ్రమకు ప్రాధాన్యత లేనట్టుగా మాట్లాడుతున్నారు. కానీ ఉత్పత్తి శ్రమ లేకుండా జరగదు... అది శారీరక శ్రమ అయినా లేదా మానసిక శ్రమ అయినా. శ్రమ విభజన, యాంత్రీకరణ చోటు చేసుకున్న తరువాత శారీరక శ్రమ తగ్గింది కానీ శ్రమ అవసరం లేకుండా పోలేదు. యంత్రాలలో కూడా శ్రమ దాగివుంది. గతంలో మనిషి చేసిన శ్రమ ఫలితంగా యంత్రాలు తయారయ్యాయి. యంత్రాలలో శ్రమ నిర్జీవ రూపంలో ఉంది. కొత్త యంత్రాలు, యంత్ర పరికరాలు, అన్వేషణలు చేయాలన్నా శారీరక, మానసిక శ్రమ అవసరం. కనుక శ్రమతోనే ఈ ప్రపంచం ముందుకి వెళుతుంది. అటువంటి శ్రమ ప్రాధాన్యతను తగ్గించి పెట్టుబడికి ఎక్కువ ప్రాధన్యత ఇవ్వడమంటే పెట్టుబడిదారీ వ్యవస్థను బలపరచడమే. కనుక పెట్టుబడిదారీ విధానాలను బలపరిచే ఉదారవాద విధానాలకు ప్రత్యామ్నాయ విధానాలను అమలు చేసినప్పుడు మాత్రమే సామాన్య ప్రజలు, మహిళలు స్వేచ్ఛను, సాధికారితను పొందగలుగుతారు. కనుక పెట్టుబడిదారీ వ్యవస్థకు ప్రత్యామ్నాయమైన సోషలిస్టు వ్యవస్థలోనే సామాన్య ప్రజల, ముఖ్యంగా మహిళల హక్కులు కాపాడబడతాయి.

**(సోషల్ సైంటిస్టు వ్యాసం ఆధారంగా)**

రాజకీయ పరిణామాలు

# ప్రజలపై అమెరికా ముడిచమురు ధరల భారం



రచయిత మార్క్సిస్టు పత్రిక ఎడిటోరియల్ బాధ్యులు

**ఎ.కోటిరెడ్డి**

భారత ప్రభుత్వం అమెరికా ఒత్తిడికి తలొగ్గినట్లు వార్తలొస్తున్నాయి. రష్యాపై అమెరికా విధించిన ఆంక్షలను అమలు జరపటం కోసం మన దేశ ప్రయోజనాలను పక్కన పెట్టి, రష్యా నుండి చౌక ధరలకు వస్తున్న ముడి చమురు దిగుమతులను తగ్గించేస్తున్నది. ఫలితంగా ఏర్పడే ముడి చమురు కొరతను తీర్చుకోవటానికి అమెరికా నుండి అధిక ధరలతో చమురును దిగుమతి చేసుకోడానికి సిద్ధమైంది. ఈ అక్టోబరు చివరిలో అమెరికా నుండి డిగుమతి చేసుకుంటున్న ముడి చమురు బ్యారల్ ధర 60.34 డాలర్లు. రష్యా నుండి దిగుమతి చేసుకుంటున్న ముడి చమురు ధరలకన్నా అమెరికా నుండి దిగుమతి చేసుకుంటున్న ముడి చమురుకు బ్యారల్‌కు సగటున ఐదు డాలర్లు-440 రూపాయలు-అదనంగా చెల్లిస్తున్నాం.

రష్యా నుండి ముడి చమురు దిగుమతులను ఆపివేస్తే మనదేశంపై విధించిన సుంకాలను 50 నుండి 15-16 శాతానికి తగ్గిస్తామని అమెరికా వాగ్దానం చేసిందని చెబుతున్నారు. రష్యా ముడి చమురును పక్కన పెట్టి, అమెరికా నుండి ఎక్కువ దిగుమతి చేసుకొంటే దిగుమతుల బిల్లు పెరుగుతుంది. విదేశీ మారకద్రవ్యం కొరత ఏర్పడుతుంది. మన దేశానికి అవసరమైన ముడి చమురులో 86 శాతం విదేశాల నుండి దిగుమతి చేసుకుంటున్నాం. ఆగస్టులో మనదేశం రోజుకు 52 లక్షల బ్యారల్స్ ముడి చమురు దిగుమతి చేసుకోగా, అందులో 38 శాతం -రోజుకు 20 లక్షల బ్యారల్స్- రష్యా నుండి దిగుమతి చేసుకున్నాం. రష్యాలోని రెండు ప్రధాన ముడి చమురు ఉత్పత్తి సంస్థలైన రోస్‌నెఫ్ట్, లుకోయిల్‌ల నుండి ఎక్కువ దిగుమతి చేసుకుంటున్నాం. 2022, ఆగస్టు నుండి ఇప్పటికి రష్యా యేతర దేశాల నుండి చేసుకున్న దిగుమతులతో పోల్చుకున్నపుడు రష్యా నుండి చేసుకున్న ముడి చమురు దిగుమతుల వలన 1,670 కోట్ల డాలర్లు- 1,46,960 కోట్ల రూపాయలు- ఆదా అయాయి. ఈ సంవత్సరం రష్యా బ్యారల్ ముడి చమురుకు 4.7డాలర్లు-413.6 రూపాయలు-రాయితీ ఇచ్చింది. ఇపుడు రష్యా నుండి దిగుమతులను ఆపివేయటం వలన ఆ భారాన్ని పెట్రోలు, డీజిల్ ధరల పెంపకం రూపంలో ప్రజలు భరించాలి. లేదా ప్రభుత్వం ఆ మేరకు సబ్సిడి అయినా ఇవ్వాలి. ఏ విధంగా చూసినా దేశం అదనంగా ఆర్థిక భారం భరించాలి.

అమెరికా ఆదేశాలకు క్రమంగా లొంగిపోతున్న మోడి ప్రభుత్వం గతంలోనే ఇరాన్, వెనిజులా దేశాల నుండి చేసుకుంటున్న ముడి చమురు దిగుమతులను తగ్గించింది. ఆ దేశాలు కూడా మనకు మార్కెట్ కన్నా కొంత మేరకు తక్కువ ధరలకే ముడి చమురును సరఫరా చేశాయి. కానీ అమెరికాతో అంటకాగటమే ప్రధానంగా భావిస్తున్న మోడి ప్రభుత్వం చౌక ధరలకు లభిస్తున్న ముడి చమురును పక్కన పెట్టి, అమెరికా నుండి అధిక ధరలకు ఎక్కువగా కొనుగోలు చేస్తున్నది. ఈ భారాన్నంతా ధరల పెంపు రూపంలో ప్రజలపైకి నెట్టి వేస్తుంది.

ముడి చమురు దిగుమతులు, ధరలు ఒక్కటే ప్రధానం కాదు. ఇది మన దేశ విదేశాంగ విధానానికి కూడా సంబంధించిన అంశం. మన దేశ ప్రయోజనాలకు అనుగుణంగా, ఇతర దేశాలు మన దేశాన్ని విశ్వసించేలా మన విదేశాంగ విధానం ఉండాలి. మోడి హయాంలో అమెరికా ప్రయోజనాలకు అనుగుణంగా వ్యవహరించటమే మన విదేశాంగ విధానంగా మారింది.

పోని వ్రతం చెడ్డా ఫలితం దక్కిందా అంటే అదీలేదు. మనదేశం ఎంతగా అమెరికా తోకపట్టుకొని పోతున్నా, అమెరికా మాత్రం ఈ ప్రాంతంలో తన ప్రధాన మిత్రదేశంగా పాకిస్తాన్‌కు ప్రాధాన్యత ఇస్తున్నది. ప్రధాని మోడి కన్నా పాకిస్తాన్ ప్రధాని, సైన్యాధ్యక్షునికి ప్రాధాన్యత ఇచ్చి, వారితో ట్రంప్ గంటకు పైగా చర్చలు జరిపిన విషయం మీడియాలో ప్రచారమైం ది. గ్రేట్ లీడర్స్ అంటూ ట్రంప్ వారిని పొగిడాడు. మోడి ఎంతగా వెంపర్లాడుతున్నా దక్షిణాసియా విధానంలో పాకిస్తాన్‌ను తన ప్రధాన మిత్రదేశంగా అమెరికా పరిగణిస్తున్నదని ఇవి స్పష్టం చేస్తున్నాయి.

**ప్రజాధనాన్ని అదానికి అప్పగిస్తున్న మోడి**

మోడి నాయకత్వంలోని కేంద్ర ప్రభుత్వం అదాని సంస్థలకు 33 వేలకోట్ల రూపాయల ప్రజా ధనాన్ని తరలించటానికి పథకం రూపొందించినట్లు వాషింగ్టన్ పోస్ట్ పత్రిక వెల్లడించింది. గౌతం అదానికి చెందిన కంపెనీలను అప్పుల నుండి బయటపడవేయటం కోసం ఎల్ఐసి, ఇతర ప్రభుత్వ ద్రవ్యసంస్థల నుండి 3,900 కోట్ల డాలర్లు- సుమారుగా 33,000 కోట్ల రూపాయలు-పెట్టుబడులు పెట్టించిన వివరాలను ఆ పత్రిక పేర్కొంది. ఈ వార్తను అదాని సంస్థలు ఖండించగా, తాము ప్రకటించిన కథనాన్ని రుజువు చేయటానికి అవసరమైన ఆధారాలు అన్నీ తమ వద్ద ఉన్నాయని వాషింగ్టన్ పోస్ట్ ప్రకటిం చింది. 2025, మే నెలలో కేంద్ర ప్రభుత్వ ఆర్థికమంత్రిత్వశాఖ, డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఫైనాన్షియల్ సర్వీసెస్, ఎల్ఐసి, నీతి ఆయోగ్‌లు అదాని సంస్థలలో వేలకోట్ల రూపాయల పెట్టుబడులు పెట్టే అంశంపై సమన్వయంతో వ్యవహరించాలనీ, అదాని పోర్ట్సు జారి చేసిన 5,000 కోట్ల రూపాయల బాండ్లను కొనుగోలు చేయాలనీ నిర్ణయించాయి.

తనకు ఉన్న అప్పులు తీర్చటానికి అదాని గ్రూపు అనుబంధ సంస్థ అదాని పోర్ట్సుకు 285 మిలియన్ డాలర్లు- సుమారు 5,000 కోట్ల రూపాయలు- కావలసి వచ్చాయి. అందుకోసం

> **"ఎల్ఐసి మాత్రమే కాకుండా బ్యాంకులు, ఇతర ప్రభుత్వరంగ ద్రవ్యసంస్థలు అదాని గ్రూపు సంస్థలకు భారీగా రుణాలు అందిస్తున్నాయి. ఎన్ని ఆరోపణలు వస్తున్నా, విమర్శలు ఎదురౌతున్నా ఇప్పటికీ రుణాలు ఇవ్వటం, బాండ్లను కొనుగోలు చేయటం చేస్తూనే ఉన్నాయి."**

ఆ సంస్థ విడుదల చేసిన మొత్తం బాండ్లను ఎల్ఐసి కొనుగోలు చేసింది. తాము విడుదల చేసిన బాండ్లన్నింటినీ ఒకేసంస్థ–ఎల్ఐసి–కొనుగోలు చేసిందని మే నెల 30వ తేదీన అదాని గ్రూపు ప్రకటించింది. అదాని గ్రూపు స్టాక్ మార్కెట్‌లో అక్రమాలకు పాల్పడుతున్న దని, అవినీతి చర్యలతో మోసాలు చేస్తున్నదని దేశంలోనే కాకుండా, ప్రపంచమంతా తెలిసిన విషయమే. అదాని సంస్థల అక్రమాలను హిండెన్‌బర్గ్ షార్ట్ సెల్లర్ సంస్థ గతంలోనే ఆధారాలతో సహా వెల్లడించింది. అవినీతి చర్యలను కప్పిపెట్టి, తమ దేశప్రజల నుండి నిధులు సేకరించటంపై అమెరికా జస్టిస్ డిపార్ట్‌మెంట్‌తో పాటు సెక్యూరిటీస్ అండ్ ఎక్స్ఛేంజ్ బోర్డు కూడా విచారణ జరుపుతున్నది. దేశంలోని వివిధ ప్రాంతాలలో కేంద్ర ప్రభుత్వం, ఆయా రాష్ట్రాలలోని ప్రభుత్వాల ద్వారా వత్తిడి చేయించి, చిన్న, చితకా కంపెనీలను అదాని గ్రూపు బలవంతంగా స్వాధీనం చేసుకొంటున్నది. ఆంధ్రప్రదేశ్‌లోని విశాఖపట్టణం సమీపంలో ఉన్న గంగవరం పోర్టును బలవంతంగా స్వాధీనం చేకోవటం తెలుగు ప్రజలు ఇంకా మర్చిపోలేదు. మరోవైపు అదాని గ్రూపు కంపెనీల ఆర్థిక పరిస్థితి దిగజారుతున్నది. గత సంవత్సరంతో పోల్చుకుంటే ఈ సంవత్సరం అదాని గ్రూపు సంస్థల అప్పులు 20 శాతం పెరిగాయి. అయినప్పటికీ అదాని గ్రూపుపై విశ్వాసాన్ని పెంచటానికి, ఇతర పెట్టుబడిదారులను ఆకర్షించటం కోసమని ప్రభుత్వ మద్దతుతో ఈ పథకం రూపొందించారు.

అమెరికా, యూరోపియన్ బ్యాంకుల నుండి రుణాలు తీసుకోవటానికి అదాని గ్రూపు ప్రయత్నాలు చేసింది. కానీ అదాని సంస్థలపై వస్తున్న ఆరోపణల నేపథ్యంలో రుణాలు ఇవ్వటానికి వారు సందేహించారు. ఈ నేపథ్యంలో కేవలం అదాని గ్రూపు పరపతిని కాపాడటం కోసమే ప్రధాని మోడి వత్తిడితో ప్రభుత్వ ఆధ్వర్యంలోని ద్రవ్యసంస్థల నిధుల ను ఈ విధంగా ఆయాచితంగా అదాని గ్రూపు సంస్థలకు అందిస్తున్నారు. ప్రభుత్వ వత్తిడితోనే ఇంత భారీ మొత్తంతో అదాని గ్రూపు బాండ్ల కొన్నారన్న ఆరోపణలను ఎల్ఐసి బోర్డు తిరస్కరించింది. బోర్డు స్వయంగా తీసుకున్న నిర్ణయంతోనే 5,000 కోట్ల రూపాయల బాండ్లు కొనుగోలు చేశామని చెబుతున్నది. ఒకవేళ ప్రభుత్వ వత్తిడి లేకుండా నిజంగానే బోర్డు నిర్ణయం మేరకు బాండ్లను కొనుగోలు చేసి ఉంటే, ఇన్ని ఆరోపణలు ఎదుర్కొంటున్న, రుణభారం పెరుగుతున్న కంపెని జారీ చేసిన మొత్తం బాండ్లను కొనాల్సిన అవసరమేమిటో ఎల్ఐసి బోర్డు స్పష్టం చేయాలి. ఎల్ఐసిలో 26.85 కోట్లమంది వ్యక్తిగత పాలసిదారులు, 8.48 కోట్ల గ్రూపు పాలసిలు, మొత్తం 35.33 కోట్ల పాలసిలు ఉన్నాయి. 2024, మార్చి 31 నాటికి ఆ సంస్థ వద్ద 44,31,416 కోట్ల రూపాయల నిధులు ఉన్నాయి. కంపెనికి 52,85,503 కోట్ల రూపాయల ఆస్తులు ఉన్నాయి. ఇన్ని కోట్లమంది ప్రజలు లక్షల కోట్ల రూపాయలను ఎల్ఐసిపై విశ్వాసంతో పెట్టుబడులు పెట్టారు. ప్రజల విశ్వాసాన్ని వమ్ము చేసే విధంగా ఎల్ఐసి అదాని గ్రూపు కంపెనీలలో బాధ్యతారహితంగా పెట్టుబడి పెట్టటం ఏ మాత్రం క్షమించరానిది. అదాని కంపెనీలు అక్రమాలకు పాల్పడటంపై అమెరికాలో ఆరోపణలు వెల్లువెత్తటంతో 2024, సెప్టెంబరు 21వ తేదీన స్టాక్ మార్కెట్ ట్రేడింగ్ ప్రారంభమైన నాలుగు గంటలలోనే ఎల్ఐసి 7,850 కోట్ల రూపాయలు నష్టపో యింది. దాని నుండి ఏ మాత్రం పాఠాలు నేర్వకుండా తిరిగి భారీ మొత్తంలో అదాని పోర్ట్సు జారి చేసిన బాండ్లన్నింటినీ ఎందుకు కొనుగోలు చేశారన్న ప్రశ్నకు ఎల్ఐసి సమాధానం చెప్పాలి. బాధ్యతారహితంగా వ్యవహరిస్తున్న ఒక కంపెనికి ప్రజల సొమ్మును ఉదారంగా అందించటం అవినీతి, ఆశ్రిత పక్షపాతాలకు నిదర్శనం.

ఎల్ఐసి మాత్రమే కాకుండా బ్యాంకులు, ఇతర ప్రభుత్వరంగ ద్రవ్యసంస్థలు అదాని గ్రూపు సంస్థలకు భారీగా రుణాలు అందిస్తున్నాయి. ఎన్ని ఆరోపణలు వస్తున్నా, విమర్శలు ఎదురౌతున్నా ఇప్పటికీ రుణాలు ఇవ్వటం, బాండ్లను కొనుగోలు చేయటం చేస్తూనే ఉన్నాయి. ప్రభుత్వ బ్యాంకులు, ఇతర సంస్థల వద్ద ప్రజలు మదుపు పెట్టిన డబ్బు ఉన్నది. ప్రభుత్వం ప్రజలపై వివిధ రకాలైన పన్నులతో లక్షల కోట్ల రూపాయల ఆదాయం పొందుతున్నది. ప్రజలు చెల్లిస్తున్న పన్నుల నుండే ప్రభుత్వం అదాని గ్రూపుకు రాయితీలు ఇస్తున్నది. బ్యాంకులు, ఇతర ద్రవ్యసంస్థల నుండి అదాని కంపెనీలు తీసుకున్న రుణాలను తిరిగి చెల్లించకపోతే ఆ భారాన్ని ప్రజలే భరించాలి. "అత్తసొమ్ము అల్లుడు దానం చేసిన చందంగా" రాయితీలు, రుణాలు, ప్రోత్సాహ కాలు తదితర పేర్లతో ప్రభుత్వం ప్రజల సొమ్మును అదానికి కట్టబెడుతున్నది. ఈ పెట్టుబడుల వలన వచ్చిన లాభాలన్నింటినీ అదాని గ్రూపు స్వంతం చేసుకుంటుంది. నష్టాలను మాత్రం ప్రజలే భరించాలి.

ఆరోపణలు వచ్చిన ప్రతిసారీ తమ ప్రతిష్ఠను, అభివృద్ధిని దెబ్బతీయటానికి తమ సంస్థలకు శత్రువులైన వారు ఇటువంటి ఆరోపణలు చేస్తున్నారని అదాని గ్రూపు ప్రత్యా రోపణలు చేస్తున్నది. తమ సంస్థలపై వస్తున్న ఆరోపణలను "భారతదేశంపై దాడి"గా చిత్రిస్తు న్నారు. వారు ఆధారాలు చూపిస్తున్నా లక్ష్య పెట్టకుండా నోరు మూయించటం కోసం అదాని సంస్థలు కోర్టు కేసులు బనాయిస్తున్నాయి.

అదాని కంపెనీలపై వస్తున్న ఆరోపణ లపై ప్రభుత్వం విచారణ జరిపించటం లేదు. వాటిని కప్పిపెట్టటానికి ప్రయత్నం చేస్తున్నది. అదానిపై ఆరోపణలు చేసేవారు భారతదేశం సాధిస్తున్న అభివృద్ధిని చూసి ఓర్చుకోలేని వారని ముద్ర వేస్తున్నది. ప్రభుత్వ విచారణా సంస్థలు నిష్పక్షపాతంగా వ్యవహరించటం లేదు. విచారణ జరిపినట్లు తతంగం నడిపి, చివరికి ఈ అవినీతి సంస్థకు క్లీన్ చిట్ ఇస్తున్నాయి.

అదాని అక్రమాలపై అమెరికా కోర్టులో విచారణ జరుగుతున్న కేసులో కోర్టు జారి చేసిన సమన్లను భారత ప్రభుత్వ అధికారులు సంవత్సరం నుండి నిందితులకు అందించటం లేదని అమెరికా న్యాయశాఖ అధికారులు వెల్లడించారు. ప్రభుత్వ పక్షపాత ధోరణికి ఇదే నిదర్శనంగా ఉన్నది.

**మోడి అధికారంలోకి రావటంతో దశ తిరిగిన అదాని సంస్థలు**

మోడి గుజరాత్ ముఖ్యమంత్రి అయే నాటికి అదాని గ్రూపు కంపెనీల మార్కెట్ విలువ 73 మిలియన్ డాలర్లు-642.40 కోట్ల రూపాయలు మాత్రమే. మొత్తం ఆస్తులు 375 మిలియన్ డాలర్లు-3,300 కోట్ల రూపాయలు-గా ఉన్నాయి. మోడి ముఖ్యమంత్రిగా ఉన్న 13 సంవత్సరాల కాలంలో అదాని సంస్థలు అపారమైన సంపదను స్వంతం చేసుకున్నాయి. ఈ 13 సంవత్సరాల కాలంలో సెన్సెక్స్ ఎనిమిది రెట్లు మాత్రమే పెరగగా, అదాని గ్రూపు షేర్ల విలువ 85 రెట్లు పెరిగింది. మోడి ప్రధాని అయిన తర్వాత అదాని కంపెనీలు ప్రభుత్వ మద్దతుతో వివిధ రంగాల లోకి ప్రవేశించి, ఆధిపత్య స్థానంలోకి వచ్చాయి.

2014 నాటికి అదాని గ్రూపు ప్రధానంగా గుజరాత్‌లో రియల్ ఎస్టేట్ రంగంలోనే ఉన్నది. 2015లో ముంబయి, గురుగ్రాంలకు కార్యకలాపాలను విస్తరించింది. ముంద్రా, కచ్ జిల్లాలలోని అనేక గ్రామాలలో పశువుల మేతకోసం వదలిన బీడు భూములు, ప్రభుత్వ భూములను ఎస్ఇజడ్ కార్యకలాపాల పేరుతో ఆక్రమించింది.

2013లో 190 కోట్లడాలర్లుగా ఉన్న అదాని సంపద మోడిని ప్రధానిగా ప్రతిపాదించిన 2013, సెప్టెంబరు 13 నుండి ఆయన ప్రధాని అయిన మే, 2014 మధ్యకాలంలో మూడు రెట్లకు పైగా పెరిగి, 6 బిలియన్ డాలర్లకు-రోజుకు 25 మిలియన్ డాలర్ల పెరుగుదల- చేరింది. ఇదే కాలంలో దేశంలోని అత్యంత ధనికుడైన ముకేశ్ అంబాని సంపద 11 శాతం మాత్రమే పెరిగి, 19.8 బిలియన్ డాలర్ల నుండి 22 బిలియన్ డాలర్లకు మాత్రమే చేరింది.

దేశంలో 112 ఎంఎంపిటిఎ సరుకుల ఎగుమతి-దిగుమతులను నిర్వహించగలిగిన అతి పెద్ద ప్రైవేటు ఓడరేవు ముంద్రా పోర్టును 2014-15లో నిర్మించారు. ఒడిషాలోని ధమ్రా పోర్టును 2014లో స్వాధీనం చేసుకున్నారు. 2014 నాటికి 9,280 మెగావాట్ల థర్మల్ పవర్ కేంద్రాలను నిర్మించటం ద్వారా అతి పెద్ద ప్రైవేటు విద్యుత్ ఉత్పత్తిదారుగా మారాడు.

ఈ విధంగా ఒకటి తర్వాత మరో రంగంలోకి ప్రవేశిస్తూ, దేశ పారిశ్రామిక రంగాన్ని, భూములు, మౌలిక వనరులను స్వాధీనం చేసుకుంటున్నది. ఈ రోజు మోడి అండతో దేశం మొత్తంపై ఆధిపత్యం సాధించటానికి ప్రయత్నం చేస్తున్నది. అవినీతి, ఆశ్రిత పక్షపాతంతో, దేశ ప్రయోజనాలకు వ్యతిరేకంగా వ్యవహరిస్తున్న ఇటువంటి సంస్థపై కఠిన చర్యలు తీసుకొని సరైన దారికి తీసుకురాకపోతే దేశానికి, ప్రజల ప్రయోజనాలకు తీరని నష్టం జరుగుతుంది.

**❝2013లో 190 కోట్లడాలర్లుగా ఉన్న అదాని సంపద మోడిని ప్రధానిగా ప్రతిపాదించిన 2013, సెప్టెంబరు 13 నుండి ఆయన ప్రధాని అయిన మే, 2014 మధ్యకాలంలో మూడు రెట్లకు పైగా పెరిగి, 6 బిలియన్ డాలర్లకు-రోజుకు 25 మిలియన్ డాలర్ల పెరుగుదల- చేరింది. ఇదే కాలంలో దేశంలోని అత్యంత ధనికుడైన ముకేశ్ అంబాని సంపద 11 శాతం మాత్రమే పెరిగి, 19.8 బిలియన్ డాలర్ల నుండి 22 బిలియన్ డాలర్లకు మాత్రమే చేరింది.❞**

**ఉపాధి సంక్షోభం ముంగిట భారతదేశంత**

కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాల ఫలితంగా దేశంలోని శ్రామిక ప్రజలు తీవ్రమైన ఉపాధి సంక్షోభాన్ని ఎదుర్కొనే పరిస్థితులు నెలకొంటున్నాయి. యజమానులు కార్మికుల చేత 12 గంటలు పని చేయించుకోవటానికి అవకాశం ఇస్తూ ఆక్యుపేషనల్ సేఫ్టి, హెల్త్ అండ్ వర్కింగ్ కండిషన్స్ కోడ్‌ను కేంద్ర ప్రభుత్వం 2020లో ఆమోదించింది. కేంద్ర ప్రభుత్వ చట్టానికి అనుగుణంగా పనిగంటలను పెంచే చట్టాలు చేస్తూ, సరళీకరణ విధానాలను వేగంగా అమలు జరపటానికి రాష్ట్ర ప్రభుత్వాలు చర్యలు తీసుకుంటున్నాయి. ప్రజలకు, ప్రభుత్వానికి చెందిన భూములు, ఆస్తులను విచక్షణా రహితంగా కార్పొరేట్లకు, తమ అనుయాయులకు ప్రభుత్వాలు అప్పగించటం, మనదేశం నుండి అమెరికాకు చేస్తున్న ఎగుమతులపై ట్రంప్ ప్రభుత్వం విధిస్తున్న అధిక సుంకాలు రానున్న విపత్తుకు సూచనలుగా ఉన్నాయి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఈ విధానాలను యధేచ్ఛగా అమలు చేస్తుండటం వలన ప్రజలు తీవ్రమైన కడగండ్లను ఎదుర్కొంటారు. దేశం కనీవినీ ఎరుగని వినాశనాన్ని ఎదుర్కొంటుంది. వీటి ఫలితాలు ఎంత భయానకంగా ఉంటాయి, ప్రజలు ఎటువంటి వినాశకర పరిస్థితులను ఎదుర్కోబోతున్నారన్న అంశాలను పరిశీలిద్దాం.

కేంద్ర చట్టానికి అనుగుణంగా పని గంటలు పెంచుతూ చట్టాలు చేయాలని కేంద్ర ప్రభుత్వం రాష్ట్ర ప్రభుత్వాలను తీవ్రంగా ఒత్తిడి చేస్తున్నది. వివిధ రాష్ట్రాలలోని ఎన్‌డిఎ ప్రభుత్వాలతో పాటు ఇతర బూర్జువా రాజకీయ పార్టీల నాయకత్వంలోని ప్రభుత్వాలు కూడా పని గంటలు పెంచుతూ చట్టాలు చేస్తున్నాయి. దేశ, విదేశీ పెట్టుబడిదారుల సేవలో తరించిపోవటంలో ముందుండే చంద్రబాబునాయుడు పని గంటలను పెంచటంలో కూడా ముందెత్తునే ఉన్నారు.

'అతని కంటే ఘనుడు ఆచంట మల్లన్న' అన్న చందంగా చంద్రబాబునాయుడు నాయకత్వంలోని ప్రభుత్వం కేంద్ర చట్టానికి మించి, పని గంటలను 13 కు పెంచుతూ చట్టాన్ని ఆమోదించింది. దేశంలోని ఏ రాష్ట్ర ప్రభుత్వమూ ఇప్పటి వరకు కార్మికులు, ఉద్యోగులు రోజుకు 13 గంటలు పని చేయాలనే చట్టాన్ని ఆమోదించలేదు. తెలంగాణలోని కాంగ్రెస్ ప్రభుత్వం వాణిజ్య సంస్థలలో పనిచేసే కార్మికులు, ఉద్యోగుల పని గంటలను 8 నుండి 10కి పెంచుతూ జులై నెలలో జీఒ జారి చేసింది. మహారాష్ట్ర, కర్ణాటకలు కూడా చట్టాలలో మార్పులు తీసుకురావటానికి చర్యలు తీసుకుంటున్నాయి. ఓవర్ టైం పనిని పెంచే నిబంధనలను కూడా ఈ చట్టాలలో పొందు పరుస్తున్నారు. పని గంటల పెంపుకు కార్మికులు, ఉద్యోగులు, ప్రజల నుండి వస్తున్న వ్యతిరేకతను దారి తప్పించటానికి ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్‌లో ర్యాంకులను మెరుగు పరుచుకోవటం, తద్వారా పెట్టుబడులను ఆకర్షించటం కోసం పనిగంటలు పెంచుతున్నా మని పాలకులు సాకులు చెబుతున్నారు.

పని దినాన్ని 13 గంటలకు- కేంద్ర ప్రభుత్వం ఆమోదించిన కోడ్ ప్రకారం 12 గంటలు- పెంచటం వలన ఇప్పుడు పనిచేస్తున్న వారిలో 40 శాతం-దేశంలో మొత్తం పని చేస్తున్న 64.33 కోట్లమందిలో 25 కోట్లమంది- వరకు తాము చేస్తున్న పనులు కోల్పోతారు. ఇప్పుడు ఎనిమిది గంటల పనిదినం అని చట్టాలలో ఉన్నప్పటికీ అనేక పరిశ్రమలు, సంస్థలలో 10 నుండి 12 గంటల

> ❝ఇప్పుడు కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం, రాష్ట్రాల లోని ప్రభుత్వాలు రైతుల చేతులలో ఉన్న భూములను బలవంతంగా లాక్కొని, బడా పెట్టుబడిదా రులకు ఇస్తున్నాయి. అడవులు, గనులు, నదులు, సముద్రాలు, తదితర సహజ సంపదలను దేశ, విదేశాలలోని పెట్టుబడిదారులకు కట్టబెట్టే పనిలో ఈ ప్రభుత్వాలు నిమగ్నమై ఉన్నాయి.❞

వరకు పనిచేయిస్తున్నారు. ఇపుడు 13 గంటల పని దినాన్ని చట్టంగా మార్చితే యజమానులు కార్మికులు, ఉద్యోగుల చేత తమ చిత్తం వచ్చినన్ని గంటలు పని చేయిస్తారు. ఫలితంగా ఉద్యోగాలలో ఉన్నవారిలో మూడో వంతుకు పైగా మిగులు కార్మికులుగా మారతారు. యాజమాన్యాలు భారీసంఖ్యలో ఉద్యోగులు, కార్మికులను పనుల నుండి తొలగిస్తారు. ఇప్పటికే పనులు చేస్తున్నవారు నిరుద్యోగులుగా మారటంతో ఉద్యోగాల కోసం ఎదురు చూస్తున్న నిరుద్యోగుల ఆశలు అడుగంటుతాయి. యువత దిక్కుతోచని స్థితిలో తీవ్ర నిరాశ, నిస్పృహలలో కూరుకుపోతుంది. ఇది తీవ్రమైన సామాజిక అశాంతికి దారి తీస్తుంది. పనిగంటల పెంపు శ్రామికవర్గం, నిరుద్యోగుల పాలిట పెను విపత్తుగా మారటంతో పాటు శాంతి, భద్రతలు దిగజారటానికి కారణమౌతుంది.

పనిగంటల పెంపుతో పనులు కోల్పోయిన కార్మికులు, ఉద్యోగులు తమ కుటుంబాలను పోషించుకోవటానికి ఏదో ఒకపని సంపాదించుకోవటానికి నిరుద్యోగులతో పోటి పడతారు. పోటీ ఏ మేరకు పెరిగితే ఆ మేరకు కొత్తగా పనిలోకి తీసుకొనే వారికి తక్కువ వేతనాలు ఇస్తారు. కొత్తగా వస్తున్నవారు తక్కువ వేతనాలకు పని చేస్తుంటే, అప్పటికే పనిచేస్తున్న వారికి యజమానులు ఎక్కువ వేతనాలు ఎందుకు ఇస్తారు? యజమానులు వారి వేతనాలను కూడా తగ్గిస్తారు. కాబట్టి పనిగంటల పెంపు అనేది కేవలం కార్మికులు, ఉద్యోగుల చేత ఎక్కువ పని చేయించటానికే కాకుండా, వారికి ఇస్తున్న వేతనాలు, జీతాలు తగ్గించటానికి, పని పరిస్థితులు మరింతగా దిగజారటానికి దారితీస్తుంది. దానితో వారి కుటుంబాల జీవన ప్రమాణాలు దారుణంగా దిగజారతాయి. ఆ కుటుంబాలలో ఉండే కొద్దిపాటి ఆనందం కూడా ఆవిరైపోయి, నిరంతరం ఆందోళనతో బతకవలసిన పరిస్థితులు వారికి ఎదురౌతాయి.

### భూములను లాక్కోవటంతో వినాశకర పరిణామాలు

ఇప్పుడు కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం, రాష్ట్రాలలోని ప్రభుత్వాలు రైతుల చేతులలో ఉన్న భూములను బలవంతంగా లాక్కొని, బడా పెట్టుబడిదారులకు ఇస్తున్నాయి. అడవులు, గనులు, నదులు, సముద్రాలు, తదితర సహజ సంపదలను దేశ, విదేశాలలోని పెట్టుబడిదారులకు కట్టబెట్టే పనిలో ఈ ప్రభుత్వాలు నిమగ్నమై ఉన్నాయి. భూములు, సహజ వనరులను కాజేయటానికి అడ్డం వస్తున్న వారిపై ప్రభుత్వాలు దారుణమైన హింసాకాండను ప్రయోగిస్తున్నాయి. 2024-25లో మూడు రాష్ట్రాలు, మహారాష్ట్రలోని గడ్చిరోలి, ఝార్ఖండ్‌లోని పశ్చిమ సింఘ్‌భూమ్, ఛత్తీస్‌ఘడ్‌లో బిజాపూర్, కాన్కర్, నారాయణపూర్, సుక్మా జిల్లాలలో నగ్జల్స్ పేరుతో గిరిజనులను వేటాడాయి. ఆంధ్రప్రదేశ్‌లోని అల్లూరి సీతారామరాజు జిల్లా, మధ్యప్రదేశ్‌లోని బాలాఘాట్, తెలంగాణలోని భద్రాద్రి కొత్తగూడెం, ఒరిస్సాలోని కొన్ని ప్రాంతాలలో కూడా ఈ విధంగానే గిరిజనులపై దాడులు చేస్తున్నారు. గిరిజనులను హత్య చేసి, ఎదురు కాల్పులలో చనిపోయారని ప్రభుత్వాలు ప్రచారం చేస్తున్నాయి. వారిని అడవుల నుండి తరిమి వేసి, వారి భూములు, అడవులు, నదులు, వాగులు వంకలు, కొండలు, గుట్టలు తదితరాలన్నింటినీ కార్పొరేట్లకు అప్పగిస్తున్నారు. కోట్లాది మంది అడవి బిడ్డల జీవనోపాధిని హరించి, వారికి నిలువ నీడలేకుండా చేసి, వారి నెలవుల నుండి తరిమివేస్తున్నారు.

### కార్పొరేట్ల కోసం వ్యవసాయ భూముల కబ్జా

పరిశ్రమల పేరుతో లక్షలాది ఎకరాల వ్యవసాయ భూములను రైతుల నుండి బలవంతంగా గుంజుకొంటున్నప్పటికీ, వాస్తవంగా వివిధ రాష్ట్రాలకు వస్తున్న పరిశ్రమలు అతి తక్కువగా ఉన్నాయి. పరిశ్రమల పేరుతో దశాబ్దాల క్రితం రైతుల నుండి సేకరించిన భూములలో 10 శాతంలో కూడా నేటికీ పరిశ్రమలను ఏర్పాటు చేయలేదు. అయినప్పటికీ ఇప్పుడు కూడా రైతుల నుండి బలవంతంగా భూములు లాక్కుంటున్నారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రస్తుతం రెండు లక్షల ఎకరాలకు పైగా భూములను రైతుల నుండి బలవంతంగా లాక్కొంటున్నది. ఎందుకు తీసుకొంటున్నారో కూడా చెప్పకుండా కొన్నిచోట్ల భూములు లాక్కొంటున్నారు. హిందుపురం జిల్లాలోని లేపాక్షి మండలంలో ఈ విధంగానే రైతులకు ఏ విషయం చెప్పకుండా పరిశ్రమలకు తీసుకోమని రాష్ట్ర ప్రభుత్వం చెప్పిందంటూ అధికారులు రైతులను భూముల నుండి తొలగిస్తున్నారు. అక్కడి రైతులు, ప్రజలు ఈ చర్యను తీవ్రంగా ప్రతిఘటిస్తున్నారు.

పెట్టుబడిదారులు అడిగిందే తడవుగా భూములను అప్పగించటం కోసం రాష్ట్ర ప్రభుత్వం భూ బ్యాంకును ఏర్పాటు చేసింది. రాష్ట్రం చీలిపోయిన తర్వాత 2015లో భూ బ్యాంకులో 2.93 లక్షల ఎకరాల భూమి ఉన్నది. అది 2016కు 7.64 లక్షల ఎకరాలకు-సంవత్సర కాలంలో రెండున్నర రెట్లకు పైగా- పెరిగింది. తెలంగాణ ప్రభుత్వం 1,45,682.99 ఎకరాలతో భూ బ్యాంకును ఏర్పాటు చేసింది. 2011 నాటికి మహారాష్ట్ర ప్రభుత్వం పరిశ్రమల పేరుతో 1.63 లక్షల ఎకరాల భూమిని తీసుకున్నది. వివిధ రాష్ట్రాలలోని ప్రభుత్వాలు కూడా ఈ విధంగానే పరిశ్రమల పేరుతో లక్షలాది ఎకరాల భూమిని రైతుల నుండి లాక్కొంటున్నాయి.

ఆంధ్ర, తెలంగాణలలో పరిశ్రమల కోసమంటూ ప్రభుత్వం తీసుకున్న భూములు బడా పెట్టుబడిదారుల చేతుల్లోకిపోతున్నాయి. కొన్ని చోట్ల సంవత్సరాల తరబడి భూములు బీడుపడిపోయాయి. ప్రభుత్వం తీసుకున్న భూములలో పరిశ్రమలు రానప్పటికీ, తిరిగి వ్యవసాయం చేయటం సాధ్యం కాదు. ప్రభుత్వం సేకరించిన భూమిలో దాదాపు 90 శాతం ఖాళీగా ఉండటం అంటే అంత భూమిలో రైతులు వ్యవసాయం చేయటం సాధ్యం కాదు. అక్కడి వ్యవసాయ కార్మికులకు పనులు దొరకవు. లక్షలాది ఎకరాలలో పనిచేసే రైతులు, కూలీలు ఉపాధి కోల్పోవటంతో సంభవించే పరిణామాలు ఎంత తీవ్రంగా ఉంటాయనేది ప్రభుత్వాలు పరిగణనలోకి తీసుకోవటం లేదు.

పరిశ్రమలతో పాటు రియల్ ఎస్టేట్ పేరుతో లక్షలాది ఎకరాలలో నిర్మాణ కార్యకలాపాలు జరుగుతున్నాయి. పరిశ్రమల కంటే మూడు నాలుగు రెట్లు ఎక్కువ భూములలో రియల్ ఎస్టేట్ కార్యకలాపాలు జరుగుతున్నాయి. రియల్ ఎస్టేట్ రంగంలో నిర్మాణ కార్యకలాపాలు జరుగుతున్నపుడు కూలీలకు పనులు లభిస్తాయి. ఆరు నెలలు లేదా సంవత్సరంలో రియల్ ఎస్టేట్ ప్రాజెక్టు పూర్తవుతుంది. ఆ తర్వాత అక్కడ ఎటువంటి పనులు దొరకవు. వ్యవసాయ భూమి తగ్గిన మేరకు వ్యవసాయ కార్మికులు శాశ్వతంగా పనులు కోల్పోతారు.

భూములు తీసుకున్న ప్రాంతాలలో వచ్చిన పరిశ్రమలలో కూడా స్థానికులకు ఉద్యోగాలు దొరకటం లేదు. ఇతర రాష్ట్రాల నుండి వలస వచ్చి, తక్కువ కూలికి పని చేస్తున్న వారినే పనులలోకి తీసుకొంటున్నారు. పరిశ్రమలలో మాత్రమే కాకుండా రాష్ట్ర రాజధాని అమరావతి నిర్మాణంలో కూడా ఇదే పరిస్థితి ఉన్నది. సచివాలయ నిర్మాణ సమయంలో పరిశీలన చేసినపుడు అక్కడ పనిచేస్తున్న నిర్మాణ కూలీలలో స్థానికులు ఎవరూ లేరని స్పష్టమైంది. ప్రభుత్వ ఆధ్వర్యంలో జరుగుతున్న సచివాలయ నిర్మాణంలోనే ఇలా ఉంటే మిగతా వాటిని గురించి చెప్పుకోవలసింది ఏముంటుంది! ప్రభుత్వం భూములు తీసుకున్న ప్రతిచోటా భూముల యజమానులైన రైతులతో పాటు, ఆ భూములలో పనిచేస్తున్న వ్యవసాయ కార్మికులు కూడా పనులు కోల్పోతున్నారు. దేశవ్యాపితంగా భూములు కోల్పోతున్న రైతులు, పనులు కోల్పోతున్న వ్యవసాయ కార్మికుల సంఖ్య కోట్లలో ఉంటుంది.

**"భూములు తీసుకున్న ప్రాంతాలలో వచ్చిన పరిశ్రమలలో కూడా స్థానికులకు ఉద్యోగాలు దొరకటం లేదు. ఇతర రాష్ట్రాల నుండి వలస వచ్చి, తక్కువ కూలికి పని చేస్తున్న వారినే పనులలోకి తీసుకొంటున్నారు. పరిశ్రమలలో మాత్రమే కాకుండా రాష్ట్ర రాజధాని అమరావతి నిర్మాణంలో కూడా ఇదే పరిస్థితి ఉన్నది. సచివాలయ నిర్మాణ సమయంలో పరిశీలన చేసినపుడు అక్కడ పనిచేస్తున్న నిర్మాణ కూలీలలో స్థానికులు ఎవరూ లేరని స్పష్టమైంది."**

### భారతీయుల ఉపాధిపై ట్రంప్ దెబ్బ

తమ దేశంలో సరుకుల ఉత్పత్తి రంగాన్ని పునరుజ్జీవింపజేయటానికి, వాణిజ్య విధానాలలో తమకు జరుగుతున్న అన్యాయాన్ని సరిదిద్దటానికి చర్యలు తీసుకొంటున్నామంటూ అమెరికా వివిధ దేశాల నుండి దిగుమతి చేసుకుంటున్న సరుకులపై 25 శాతం సుంకాలను పెంచింది. రష్యా నుండి ఆయిల్ దిగుమతి చేసుకుంటున్నందు వలన పెనాల్టి వేస్తున్నామంటూ మరో 25 శాతం, మొత్తం 50 శాతం సుంకాలను భారతదేశంపై విధించింది.

అమెరికా విధించిన సుంకాలతో మన ఆర్థికవ్యవస్థలోని అనేక రంగాలు, ప్రధానంగా అసంఘటిత రంగం తీవ్రంగా దెబ్బ తింటుంది. అసంఘటిత రంగంలో దాదాపుగా 40 కోట్లమంది పని చేస్తున్నారు. జనవరి–మార్చితో పోల్చుకుంటే ఏప్రిల్–జూన్ త్రైమాసికలో అసంఘటిత రంగం 9.3 శాతం కుంచించుకు పోయింది. 2.1 శాతంకు పైగా ఉద్యోగులు తగ్గారు. ఇదే సమయంలో పరిశ్రమల సంఖ్య కూడా 4.7 శాతం తగ్గింది.

ఉదాహరణకు తమిళనాడులోని అంబూరు–రాణిపేట బెల్టులో చర్మశుద్ధి, చర్మ ఉత్పత్తులను తయారు చేసే పరిశ్రమలు 300లకు పైగా ఉన్నాయి. 440 కోట్ల డాలర్ల విలువైన చెప్పులు, చర్మ ఉత్పత్తులు ఇక్కడి నుండి వివిధ దేశాలకు ఎగుమతి అవుతున్నాయి. ఇందులో 100 కోట్ల డాలర్లకు పైగా ఉత్పత్తులు అమెరికాకే వెళుతున్నాయి. 50 శాతం సుంకాలు అమలులోకొచ్చిన ఈ కొద్దికాలంలోనే 50కి పైగా పరిశ్రమలు మూతపడ్డాయి. 20 శాతం సుంకాలు అమలులో ఉన్న యూరప్ దేశాలకు జరుగుతున్న ఎగుమతులు యధాతథంగా ఉండగా, అమెరికాకు జరుగుతున్న ఎగుమతులు తీవ్రంగా దెబ్బతిన్నాయి. వస్త్ర పరిశ్రమ కూడా ఇదే విధమైన పరిస్థితులను ఎదుర్కొంటున్నది. ముఖ్యంగా ఎలక్ట్రానిక్, ఎలక్ట్రికల్ రంగాలు తీవ్రంగా దెబ్బతింటాయి. ఐటి, సాఫ్ట్‌వేర్ రంగం పెద్ద సంక్షోభాన్ని ఎదుర్కొనబోతుదని భావిస్తున్నారు. రత్నాలు, విలువైన రాళ్ళు తదితరాలను ఎగుమతి చేసే రంగాలు కూడా దెబ్బతింటాయి.

ట్రంప్ విధించిన సుంకాలు దేశ జిడిపిని దెబ్బతీస్తాయని ఆర్థిక నిపుణులు అంచనా హెచ్చరిస్తున్నారు. టారిఫ్‌ల పెంపు వలన జిడిపి 0.5–0.6 శాతం వరకు తగ్గవచ్చునని కేంద్ర ప్రభుత్వ ఆర్థిక సలహాదారు వి అనంత నాగేశ్వరన్ వెల్లడించాడు. కాని ఒక శాతానికి పైగా తగ్గినా ఆశ్చర్యం లేదు.

### వీసా ఫీజు పెంపు ప్రభావం

మనదేశం నుండి ఉద్యోగాల కోసం వెళ్ళేవారికి జారి చేసే హెచ్ 1బి వీసాకు చెల్లించే మొత్తాన్ని లక్ష డాలర్లకు పెంచటంతో ఉద్యోగాలు చేయటానికి అమెరికా వెళ్ళాలనుకుంటున్న వారి ఆశలు గల్లంతవుతున్నాయి. భారతీయ విద్యార్థులపై ట్రంప్ ప్రభుత్వం విధించిన ఆంక్షలు, అమెరికా ఐటి రంగంలో వచ్చిన మాంద్య పరిస్థితులు కూడా భారతీయుల ఆదాయాలను దెబ్బతీస్తున్నాయి. ఆర్థికవ్యవస్థకు ఊతమిస్తున్న వేలకోట్ల రూపాయల ఆదాయం హరించుకుపోతుంది. ట్రంప్ విధానాలు ఎగుమతులతో పాటు, ఉద్యోగార్థులను, ఉద్యోగాలు చేస్తున్న వారిని కూడా తీవ్రంగా దెబ్బతీస్తాయి.

వీటన్నింటి ఫలితాలను పరిశీలిస్తే రానున్న కాలంలో భారతదేశం వినాశకరమైన పరిణామాలను ఎదుర్కొనున్నదని స్పష్టమౌతున్నది. రైతుల నుండి బలవంతంగా లక్షలాది ఎకరాల భూములను లాక్కోవటం, అధిక టారిఫ్‌లతో ఎగుమతులు తగ్గటంతో ఉపాధి అవకాశాలు హరించుకుపోవటం, పని గంటలను పెంచటంతో భారీస్థాయిలో ఉద్యోగులు, కార్మికులు నిరుద్యోగులు కావటం, ఆంక్షలతో అమెరికా ఉద్యోగాలకు దూరం కావటం తదితరాలను కలిపి పరిశీలిస్తే ఎదురుకానున్న భయానక పరిస్థితులు కళ్ళకు కడతాయి. ఈ చర్యల ఫలితంగా ఆర్థికవ్యవస్థ క్షీణతకు దారితీసే అవకాశం ఉంది. రైతుల నుండి బలవంతంగా భూములు లాక్కోవటం వలన లక్షలాది మంది– దేశవ్యాపితంగా కోట్లలో ఉంటారు–రైతు, వ్యవసాయ కార్మికులు ఉపాధి కోల్పోతారు. గ్రామీణ ప్రాంత ఆర్థికవ్యవస్థకు పునాదిగా ఉన్న ఈ రెండు వర్గాలు ఉపాధి కోల్పోయిన తర్వాత వ్యవసాయరంగంపై ఆధారపడి జీవిస్తున్న మిగతా వర్గాల ప్రజానీకానికి బతుకుదెరువు ఉండదు. మున్నెన్నడూ కనీవినీ ఎరుగని విషాదకర పరిణామాలకు గ్రామీణ ప్రాంతం నెలవుగా మారుతుంది.

❋

# నిరంకుశత్వానికి ప్రతిఘటన
# నో కింగ్స్‌డే - 2.0


రచయిత మార్క్సిస్టు ఎడిటర్

**ఎస్ వెంకట్రావు**

అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ నిరంకుశ విదానాలకు అమెరికాలోనూ, ప్రపంచ వ్యాపితంగానూ పెరుగుతున్న వ్యతిరేకతకు అద్దం పడుతూ గత నెల 18వ తేదీన అమెరికాలోని 50 రాష్ట్రాల్లో 2,700కు పైగా నగరాలు, పట్టణాల్లో లక్షలాది మంది ప్రజలు రోడ్లమీదకు వచ్చి నిరసన తెలిపారు. "నో కింగ్స్ డే" పేరుతో ఇటువంటి నిరసనలు జరగడం గత నాలుగు మాసాల్లో ఇది రెండో సారి. ఈ ఏడాది జూన్ 14వ తేదీన అమెరికాలోని అన్ని రాష్ట్రాల్లోనూ లక్షల మంది 'నో కింగ్స్ డే" ప్రదర్శనలు నిర్వహించారు. అందుకే అక్టోబర్ 18న జరిగిన నిరసన ప్రదర్శనలను "నో కింగ్స్ డే – 2.0" అని పిలుస్తున్నారు.

'నో కింగ్స్ డే –1.0'తో పోలిస్తే రెండో సారి జరిగిన ఈ ప్రదర్శలు మరింత విస్తృతంగా, మరింత పెద్ద సంఖ్యలో, మరింత శాంతియుతంగా జరగడం విశేషం. మొదటి సారి జరిగిన ప్రదర్శనల్లో సుమారు 50 లక్షల మంది ప్రజలు పాల్గొనగా ఈసారి ప్రదర్శనల్లో 70 లక్షల మంది పాల్గన్నారని నిర్వాహకులు తెలిపారు. మొదటిసారి జరిగిన ప్రదర్శనలు అమెరికా సరిహద్దులకు పరిమితం కాగా ఈ సారి అమెరికాతోపాటు యూరప్‌లోని అనేక దేశాలకు ప్రదర్శనలు విస్తరించాయి.

గతంలో 'నో కింగ్స్ డే' ప్రదర్శనల తీవ్రతను గమనించిన ట్రంప్ ప్రభుత్వం ఈ సారి ప్రదర్శనలపై ఉక్కు పాదం మోపడానికి అనేక ప్రయత్నాలు చేసింది. అయినప్పటికీ జన సమీకరణ మీద కేంద్రీకరించిన నిర్వాహకులు నిరసన ప్రదర్శ నలు అత్యంత శాంతియుతంగా జరపడం ద్వారా ట్రంప్ ప్రభుత్వానికి అవకాశం ఇవ్వకుండా అడ్డుకోగలిగారు.

ట్రంప్ విధానాలకు వ్యతిరేకంగా అమెరికాలో గత ఆరుమాసాలుగా పెద్ద ప్రజా ఉద్యమం జరుగుతున్నది. 'నో కింగ్స్ డే' ఉద్యమం అందులో భాగమే. రాజకీయ పార్టీల ప్రమేయం పెద్దగా లేకుండా ప్రజలు సోషల్ మీడియా ద్వారా అనుసంధానించబడుతూ పెద్ద ఎత్తున ప్రజలు ఉద్యమాల్లోకి వస్తున్నారు. వీటిలో 50501 పేరుతో జరుగుతున్న ఉద్యమం, వలస దారులపై ప్రభుత్వ దాడులకు వ్యతిరేకంగా 'డే వితవుట్ ఇమ్మిగ్రెంట్స్' ఉద్యమం, గాజాలో నరమేధానికి వ్యతిరేకంగా జరుగుతున్న ఉద్యమం ముఖ్యమైనవి. ఈ ఉద్యమాల్లో భాగంగా గత కొద్ది మాసాలుగా ప్రజలు లక్షల సంఖ్యలో వీధుల్లోకి వచ్చి అనేక రకాలుగా నిరసన కార్యక్రమాలు నిర్వహిస్తు న్నారు. ఇటీవలి కాలంలో అమెరికాలోని యూనివర్శిటీలు, ఉన్నత విద్యా సంస్థలు ఉద్యమ వేదికలుగా మారిపోయాయి. వాటిపై ప్రభుత్వం పెద్ద ఎత్తున నిర్బంధం విధిస్తోంది. వీటన్నిలోకీ ట్రంప్ ప్రభుత్వాన్ని గడగడ లాడిస్తున్నదీ, అమెరికా ప్రజలనే కాక యూరప్ ప్రజలను కూడా ఆకర్షించింది 'నో కింగ్స్ డే' ఉద్యమం.

**అమెరికా చరిత్రలోనే అతి పెద్ద నిరసన**

'నో కింగ్స్ డే – 2.0' అమెరికా చరిత్రలోనే అతి పెద్ద నిరసన కార్యక్రమం అని చెబుతున్నారు. దేశంలోని విభిన్న వర్గాల ప్రజలు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. కార్మికులు, యువకులు, విద్యావేత్తలు, వృత్తి నిపుణలు, మహిళలు, రిటైర్డ్ ఉద్యోగులు ప్రతి నగరంలో వేలాదిగా వీధుల్లోకి వచ్చి ట్రంప్ నిరంకుశత్వానికి నిరసన తెలిపారు. దేశంలోని 2,700 వందలకు పైగా నగరాల్లో ఈ రాజకీయ ప్రదర్శనలు జరిగాయి. గతంలో 50 లక్షల మంది నిరసనల్లో పాల్గనడమే అత్యధికం అనుకున్నారు. ఈ సారి మరో 20 లక్షల మంది అదనంగా పాల్గొనడం నిర్వాహకులకు ఉత్సాహానిన ఇచ్చింది.

న్యూ యార్క్, చికాగో, బోస్టన్, లాస్ ఏంజెల్స్, రాజధాని నగరమైన వాషింగ్టన్ డిసితో సహా అన్ని ప్రధానమైన నగరాల్లోనూ పెద్ద ఎత్తున ప్రదర్శనలు జరిగాయి. ఇవి కాకుండా దేశంలోని దాదాపు అన్ని నగరాలు, చిన్న పట్టణాల్లో కూడా ప్రజలు ప్రదర్శనల్లో పాల్గొనడం విశేషం. ఈ సారి ప్రదర్శనలు అమెరికాలోని నగరాలకే పరిమితం కాలేదు. విదేశాల్లో ముఖ్యంగా ఐరోపాలోని లండన్, పారిస్, బెర్లిన్, మాడ్రిడ్, స్టాక్‌హోమ్, రోమ్ నగరాలతో సహా అనేక చిన్న చిన్న నగరాల్లో కూడా ట్రంప్ నాయకత్వానికి వ్యతిరేకంగా 'నో కింగ్స్ డే' నిరసనలు జరిగాయి.

అమెరికాలో జాత్యహంకారాన్ని, వలసదారుల వ్యతిరేకతను రెచ్చగొడుతూ, మేక్ అమెరికా గ్రేట్ ఎగైన్ (మాగా) నినాదంతో ఇష్టం వచ్చినట్లు వ్యవహరిస్తున్న ట్రంప్, ఆయన మంత్రివర్గానికి అమెరికన్ ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత అంతకంతకూ పెరుగుతోందన్న విషయాన్ని ఈ నిరసన ప్రదర్శనలు లోకానికి చాటాయి. అంతే కాదు 'నో కింగ్స్ డే' ప్రదర్శనలు డెమోక్రాటిక్ పార్టీలోని రాడికల్స్, సోషలిస్టులు, మార్క్సిస్టులు రెచ్చగొట్టడం వల్ల జరుగుతున్నాయని ట్రంప్‌కు చెందిన కన్సర్వేటివ్ పార్టీ నాయకులు చేస్తున్న ప్రకటనలు, కార్పొరేట్ మీడియా ఏక కంఠంతో చేస్తున్న ప్రచారం పూర్తిగా తప్పు అని ఈ ప్రదర్శనల్లో పాల్గొన్న విభిన్న వర్గాల ప్రజల వైవిధ్యం నిరూపించింది. పేద ప్రజలు ఎక్కువగా ఈ ప్రదర్శనల్లో పాల్గొన్నారు. సొంతంగా తయారు చేసుకున్న ప్లకార్డులు పట్టుకుని వారు ప్రదర్శనల్లో నడిచారు. ప్రజలపై ట్రంప్ ప్రభుత్వం సాగిస్తున్న దమన కాండను

> మొదటి 'నో కింగ్స్ ' కార్యక్రమానికి ముందుగా ప్రభుత్వవర్గాలు పెద్దగా ప్రతిస్పందంచలేదు. కానీ రెండోసారి మరింత పెద్ద ఎత్తున్న నిరసనకారులు రోడ్లమీదకు వస్తున్నారని తెలుసుకుని ట్రంప్ ప్రభుత్వం బెంబేలెత్తింది. మితవాద రాజకీయ నాయకులు ఈ కార్యక్రమంపై తీవ్రమైన దుష్ప్రచారం చేస్తూ ప్రకటనలు ఇచ్చారు. నిరసనకారులంతా 'హమాస్ మద్దతుదారులు', 'ఇంతిఫదా ఉగ్రవాదులు', 'అక్రమ వలసదా రులు', 'కరడుగట్టిన నేరస్తులు' అని ప్రభుత్వ 'పెద్దలు' వివిధ ప్రకటనల్లో నోరుపారేసుకున్నారు.

నిరసించారు. ప్రజాస్వామ్య హక్కులను హరించడాన్ని ఖండించారు. వలస ప్రజలపై దాడులను, అమెరికన్ పట్టణాల్లోకి ఫెడరల్ సైన్యాన్ని పంపడాన్ని, షట్‌డౌన్ పేరుతో ఫెడరల్ ఉద్యోగులను సామూహికంగా ఉద్యోగాలనుండి తొలగించడాన్ని, సంక్షేమ కార్యక్రమాలపై మితవాద ప్రభుత్వం విధించిన కోతలను వారు తీవ్రంగా వ్యతిరేకిస్తూ ప్లకార్డులు ప్రదర్శించారు. గాజాలో మారణహోమం సాగిస్తున్న ఇజ్రాయిల్‌కు అమెరికా ఇస్తున్న మద్దతను కూడా నిరసించారు. యుద్ధాన్ని, నిరుద్యోగాన్ని కూడా నిరసిస్తూ బ్యానర్లు ప్రదర్శించారు.

### ప్రభుత్వ పక్షం ప్రతిస్పందన

జులైలో జరిగిన మొదటి 'నో కింగ్స్ డే' కార్యక్రమానికి ముందుగా ప్రభుత్వవర్గాలు పెద్దగా ప్రతిస్పందంచలేదు. కానీ రెండోసారి మరింత పెద్ద ఎత్తున్న నిరసనకారులు రోడ్లమీదకు వస్తున్నారని తెలుసుకుని ట్రంప్ ప్రభుత్వం బెంబేలెత్తింది. మితవాద రాజకీయ నాయకులు ఈ కార్యక్రమంపై తీవ్రమైన దుష్ప్రచారం చేస్తూ ప్రకటనలు ఇచ్చారు. నిరసనకారులంతా 'హమాస్ మద్దతుదారులు', 'ఇంతిఫదా ఉగ్రవాదులు', 'అక్రమ వలసదారులు', 'కరడుగట్టిన నేరస్తులు' అని ప్రభుత్వ 'పెద్దలు' వివిధ ప్రకటనల్లో నోరుపారేసుకున్నారు. ప్రదర్శనలకు ముందు అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఫాక్స్ న్యూస్‌కు చెందిన మారియో బార్టిరోమోకు ఇంటర్వ్యూ ఇస్తూ "మరిచిపోకండి: నేను తిరుగుబాటు వ్యతిరేక చట్టాన్ని ఉపయోగించగలను'' అని బెదిరింపులకు దిగారు. డెమోక్రటిక్ పార్టీ అధికారంలో ఉన్న సాన్ ఫ్రాన్సిస్కోకు నేషనల్ గార్డులను పంపించే విషయం ఆలోచిస్తున్నానని ఆయన చెప్పారు. వివిధ రాష్ట్రాలకు సైన్యాన్ని పంపడానికి అధ్యక్షుడు అనుమతి మంజూరు చేశారని ట్రంప్ ప్రభుత్వాధికారులు వార్తలను లీక్ చేశారు.

ప్రదర్శకులపై ట్రంప్ చాలా అసహ్యమైన రీతిలో తన సోషల్ మీడియాలో పోస్టులు పెట్టారు. ట్రంప్ రాజులాగా నెత్తిమీద కిరీటం, రాజు దుస్తులు ధరించి, విమానం మీద నుండి టైమ్స్ స్క్వేర్‌లో 'నో కింగ్స్' ప్రదర్శకుల మీద మలం జారవిడిచినట్లు ఒక ఎఐ సృష్టించిన పోస్టు పెట్టారు. అమెరికా ఉపాధ్యక్షుడు జెడి వాన్స్ మరో అడుగు ముందుకేసి, ట్రంప్ రాజుకు మారిడిలా కత్తిపట్టుకుని ఉనట్టూ, ఆయన ముందు డెమోక్రాటిక్ పార్టీ నాయకులు తలవొంచి ఉన్నట్లూ మరో ఎఐ నిర్మిత పోస్టు పెట్టారు. దాంతో సరిపెట్టుకోలేదు. ప్రదర్శకులను 'ప్రమాదకరమైన' మార్క్సిస్టులు, సోషలిస్టులు అని కమ్యూనిస్టు వ్యతిరేక సెంటిమెంటు రెచ్చగొట్టడానికి ప్రయత్నించారు.




అమెరికాలోని వివిధ నగరాల్లో నో కింగ్స్ ప్రదర్శనలకు హాజరైన జనసందోహం

అంతేకాదు, నో కింగ్స్ ప్రదర్శకు లను భయపెట్టేందుకు ట్రంప్ ప్రభుత్వం ఫాసిస్టు తరహాలో బెదిరింపులకు దిగింది. జూన్ 14న మొదటి దఫా నో కింగ్స్ ప్రదర్శనల సందర్భంగా ట్రంప్ రాజధాని నగరంలో బలప్రదర్శనకు దిగారు. అమెరికా సైన్యం 250వ వార్షికోత్సవం పేరుతో ఆయన యుద్ధ ట్యాంకులు, సాయుధ శకటాలు, 6000 మందికి పైగా సైనికులతో వాషింగ్టన్ డిసిలో పెద్ద సైనిక ప్రదర్శన నిర్వహించారు. సాయుధ దళాల వార్షికోత్సవం పేరు చెప్పినప్పటికీ ఆ రోజు ట్రంప్ పుట్టిన రోజు. ట్రంప్ బల ప్రదర్శన గురించి తెలిసిన నో కింగ్స్ నిర్వాహకులు అమెరికా అంతటా ప్రదర్శనలకు పిలుపిచ్చినా రాజధాని నగరాన్ని మినహాయించారు. అదే పద్ధతిలో అక్టోబర్ 18 నాడు కూడా ట్రంప్ ప్రభుత్వం కాలిఫోర్నియా రాష్ట్రంలోని పెండెల్టన్ మెరైన్ సైనికుల బేస్ క్యాంపులో పెద్ద బల ప్రదర్శన జరిపింది. త్వరలో జరగనున్న మెరైన్ దళాల 250వ వార్షికోత్సవానికి సన్నాహక కార్యక్రమం పేరుతో ఈ కార్యక్రమం నిర్వహించారు. ఉపాధ్యక్షుడు జెడి వాన్స్ ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా యుద్ధ విమాన విన్యాసాలు, ఫిరంగి కాల్పులు, జలంలోనూ భూమి మీద తిరిగే ఆంఫిబియస్ వాహనాల విన్యాసాలతో పెండెల్టన్ బేస్

**❝ బెదిరింపులిలా ఉన్నప్పటికీ లెక్క చేయకుండా ప్రదర్శకులు లక్షల సంఖ్యలో నిరసన కార్యక్రమాలు జరిపారు. నిర్బంధం ప్రయోగించడం కోసం ప్రభుత్వం ఎన్ని కవ్వింపు చర్యలకు దిగినప్పటికీ వాటిని అధిగమించి దేశ వ్యాపితంగా నిరసన ప్రదర్శనలు అత్యంత శాంతియుతంగా జరగడం విశేషం.❞**

క్యాంపులో యుద్ధం లాంటి పరిస్థితిని సృష్టించారు. శాన్ డీగో, లాస్ ఏజెంల్స్ రాష్ట్రాల మధ్య 20 కిలోమీటర్లకు పైగా రోడ్డును భద్రత పేరుతో బ్లాక్ చేశారు. దాంతో కీలకమైన ఈ త్రోవ గుండా ప్రదర్శకుల రాకపోకలకు అంతరాయం కలిగింది.

బెదిరింపులిలా ఉన్నప్పటికీ లెక్క చేయకుండా ప్రదర్శకులు లక్షల సంఖ్యలో నిరసన కార్యక్రమాలు జరిపారు. నిర్బంధం ప్రయోగించడం కోసం ప్రభుత్వం ఎన్ని కవ్వింపు చర్యలకు దిగినప్పటికీ వాటిని అధిగమించి దేశ వ్యాపితంగా నిరసన ప్రదర్శనలు అత్యంత శాంతియుతంగా జరగడం విశేషం.

వివిధ నగరాల్లో జరిగి ప్రదర్శనలకు హాజరైన జన సంఖ్యను చూస్తేనే మనకు ఈ కార్యక్రమం ఎంత పెద్ద ఎత్తున జరిగిందో అర్థమవుతుంది. న్యూ యార్క్‌లో జరిగిన ప్రదర్శనకు లక్ష మంది హాజరయ్యారు, సియాటెల్‌లో 90,000 మంది, చికాగోలో 2.5 లక్షల మంది పాల్గొన్నారు. బోస్టన్‌లో లక్ష మంది, రాజధాని వాషింగ్టన్ డిసిలో లక్ష మంది, పోర్ట్‌లాండ్ (ఒరెగాన్)లో 30 నుండి 50 మంది మధ్య, చార్లెట్ (నార్త్ కరోలినా) డెన్వర్ లలో 10 నుండి 20 వేల మంది, డాలస్, హూస్టన్ (టెక్సాస్) లో 5 నుండి 10 వేల మంది పాల్గొన్నారు. అదే రాష్ట్రంలోని ఆస్టిన్ నగరంలో రిపబ్లికన్ పార్టీకి చెందిన రాష్ట్ర గవర్నర్ గ్రెగ్ అబ్బట్, నేషనల్ గార్డులను మోహరించి ప్రదర్శనలను అణచి వేస్తానని బెదిరించినప్పటికీ 50 నుండి 70 వేల మంది ప్రజలు ప్రదర్శనల్లో పాల్గొనడం విశేషం.

ప్రధాన నగరాలు కాకుండా చిన్నా పెద్ద నగరాలు, పట్టణాలు కలుపుకుంటే దేశవ్యాపితంగా మొత్తం 2,700 చోట్ల నో కింగ్స్ నిరసనలు జరగడం దేశ చరిత్రలోనే మొదటిసారి అని చెబుతున్నారు. దేశ వ్యాపితంగా 70 లక్షల మందికి పైగా ప్రజలు పాల్గొనడం కూడా ఇదే ప్రథమం అని అంచనా వేస్తున్నారు.

'నో కింగ్స్' నిరసనలు యూరప్‌లో కూడా ప్రతిధ్వనించాయి. ఇటీవలనే వలసలకు వ్యతిరేకంగా మితవాద, ఫాసిస్టు సంస్థల సభ్యులు పెద్ద సంఖ్యలో ప్రదర్శన నిర్వహించిన లండన్ నగరంలో పొద్దున్నే వందలాది మంది ప్లకార్డులు పట్టుకుని వీధుల్లో నో కింగ్స్ నిరసన తెలిపారు. అమెరికాలోనే కాదు బ్రిటన్‌లో కూడా వలస దారులపై దాడులను వారు నిరసించారు. లండన్‌తోపాటు మాడ్రిడ్ (స్పెయిన్), బెర్లిన్ (జర్మనీ), స్టాక్‌హోమ్ (స్వీడన్), రోమ్ (ఇటలీ), పారిస్ (ఫ్రాన్స్)లలో పెద్ద ఎత్తున ప్రదర్శనలు జరగగా, బ్రిస్టల్, సౌథాంప్టన్, బార్సిలోనా, మలగా, సెవిల్లె, ఆమ్‌స్టర్‌డామ్, బ్రస్సెల్స్, మ్యూనిచ్, స్టట్‌గార్ట్, ఫ్రాంక్‌ఫర్ట్, నైస్, టౌలోస్, లియోన్ నగరాల్లో చిన్న సంఖ్యల్లో నిరసన ప్రదర్శనలు జరిగాయి.

**రానురాను పెరుగుతున్న నిరసనల విస్తృతి**


గతంతోనూ, ట్రంప్ మొదటి పరిపాలనా కాలంతోనూ పోలిస్తే ట్రంప్ రెండవ పరిపాలనా కాలంలో అమెరికాలో ప్రజా నిరసనలు సంఖ్యలోనూ, విస్తృతిలోనూ పెరుగుతున్నాయని ఆ దేశానికి చెందిన ముగ్గురు విశ్లేషకులు తెలిపారు. ఎరిక్ చెనోవెత్, సోహా హమ్మమ్, జెరెమీ ప్రెస్‌మాన్‌లు తమ క్లౌడ్ కౌంటింగ్ కన్సార్టియమ్ డేటా ద్వారా గతంలోనే ఈ విషయాన్ని తెలియజేశారు. వారు ముందుగా చెప్పినట్లే 'నో కింగ్స్ –2.0' ప్రదర్శనలు కూడా సంఖ్యలో గతంలో అన్నిటికన్నా పెద్దదిగా జరిగింది. రానున్న కాలంలో నిరసనలు మరింత శాంతియుతంగా, మరింత ప్రభావ వంతంగా, దేశంలోని అన్ని మూలల్లో, గతంలో కన్నా మరింత నిరంతరాయంగా జరుగుతాయని వారు చెప్పారు. ఈ నిరసనలు డెమోక్రాట్లు పాలించే ప్రాంతాల్లోనే ఎక్కువగా జరుగుతున్నాయా అని వాళ్లు పరిశీలించగా విశ్లేషణలో కాదని సమాధానం వచ్చింది. రిపబ్లికన్లు పాలించే ప్రాంతాల్లో కూడా ఇవి పెద్ద ఎత్తున జరుగుతున్నాయి. స్వతంత్రులు, ట్రంప్ వీరభక్తులు కాని మద్దతుదారులు క్రమంగా నిరసనల్లోకి వస్తున్నారు. మొత్తం మీద చూస్తే ట్రంప్‌కు మద్దతిచ్చే ప్రాంతాల్లోకి నిరసనలు చొచ్చుకు పోతున్నాయని వారు తెలిపారు.

ఉదాహరణకు, టెన్నెస్సీ రాష్ట్రంలోని సుల్లివాన్ కౌంటీలో ట్రంప్ గత ఎన్నికల్లో 54 శాతం పాయింట్లతో గెలుపొందాడు. ఆ రాష్ట్రంలోని కింగ్స్‌పోర్ట్ పట్టణంలో 2000 మంది అంటే పట్టణ జనాభాలో దాదాపు 10 శాతం మంది ప్రజలు రోడ్డుమీదకు వచ్చి 'నో కింగ్స్ డే' నిరసన కార్యక్రమంలో పాల్గొన్నారు. ఇదే విధంగా ట్రంప్‌కు సంపూర్ణ మద్దతు తెలిపిన అనేక కౌంటీలలో గతంతో పోలిస్తే ఇప్పుడు నిరసనల ఉధృతి పెరిగింది.

ట్రంప్ నిరంకుశ చర్యలపైనా, అమెరికా ప్రభుత్వ విధానాలపైనా నిరస తెలుపుతూ ప్రజలు రానురాను మరింత పెద్ద సంఖ్యలో రోడ్లమీదకు వస్తున్నప్పటికీ ఈ నిరసనల వెనుక దండలో దారంలా ఒక సమస్య ఉంది. అదే అమెరికా పెట్టుబడిదారీ వ్యవస్థలో సంక్షోభం. 2008 ద్రవ్య సంక్షోభం తరువాత అమెరికా ఆర్థిక వ్యవస్థ పూర్తిగా కోలుకున్నదే లేదు. అమెరికా కార్పొరేట్ బేహారులు గతంలో గరిష్ట లాభాల కోసం ఉత్పత్తిని సరిహద్దులు దాటించి విదేశాలకు తరలించారు. దాంతో దేశంలో నిరుద్యోగం పెరిగింది. అంతకు ముందునుండీ కొనసాగుతున్న ఆర్థిక అసమానతలు తీవ్రతరమైనాయి. ద్రవ్యోల్బణం పెరగడం, జీవన ప్రమాణాలు నానాటికీ పడిపోవడంతో ప్రజల్లో అసంతృప్తి పెరుగుతోంది. ఈ అసంతృప్తిని ఉపయోగించుకుని "మేక్ అమెరికా గ్రేట్ ఎగైన్ – మాగా (అమెరికాను మళ్లీ గొప్ప దేశంగా మార్చాలి) అనే నినాదంతో ట్రంప్ తిరిగి అధికారంలోకి వచ్చారు. అధికార పగ్గాలు చేపటినప్పటి నుండి ఆయన అనుసరిస్తున్న విధానాలు, తీసుకుంటున్న చర్యలు దేశ ప్రజల్లో అసంతృప్తిని మరింతగా పెంచుతున్నాయి. తీవ్రమైన అశాంతికి గురిచేస్తున్నాయి. ఈ అసంతృప్తినీ, అశాంతినీ అణచివేయడానికి ఆయన తీసుకుంటున్న నిరంకుశ చర్యలకు ప్రజల నుండి ప్రతిఘటన పెరుగుతున్నది. అమెరికాలో నేడు నిత్యం జరుగుతున్న నిరసన కార్యక్రమాలు ఈ అసంతృప్తికీ, ప్రతిఘటనకూ ప్రతిరూపాలే.

❋

# 'సంఘ్‌పరివార్‌కు వివేకానందుడు సైద్ధాంతిక శత్రువు'



వి. గోవిందకృష్ణన్

'వివేకానంద : ద ఫిలాసఫర్ ఆఫ్ ఫ్రీడమ్' పేరిట ఈ మధ్యనే వి. గోవిందకృష్ణన్ ఒక పుస్తకాన్ని విడుదల చేశారు. వివేకానందుని మితవాద విలువలకు ప్రతీకగా చిత్రీకరించి సంఘ్ పరివార్ సాగిస్తున్న ప్రచారం శుద్ధ తప్పు అని ఈ రచన ద్వారా ఆయన ఎండగట్టాడు. గోవిందకృష్ణన్ స్వామి వివేకానంద రచనలను లోతుగా అధ్యయనం చేసాడు. వివేకనందుడి ఆలోచనలు, బోధనలు హిందూమతంతో పెనవేసుకు ఉన్నప్పటికీ ఆయన ప్రతీఘాత పునరుద్ధరణ వాదాన్ని వ్యతిరేకించడమే కాకుండా ఆధునికత వైపు నికరంగా నిలిచాడని గోవిందకృష్ణన్ ఈ పుస్తకంలో సోదాహరణంగా వివరించాడు. వివేకానందుడి రచనలు విషయపరంగా, విస్తృతి పరంగా అసాధారణమైనవి. అసమ్మతికి ఉండాల్సిన ప్రాముఖ్యత, శాస్త్రీయ ఆలోచన అవసరాలను తన రచనల ద్వారా వివరిస్తూనే చరిత్రను విశాలదృక్పథంతో, వ్యక్తులను గానీ, ఘటనలను గానీ అవసరానికి మించి అద్భుతంగా చిత్రించడం గానీ, ద్వేషంతో దూషించడానికి గానీ పాల్పడకుండా హుందాగా వ్యవహరించాడు అంటాడు గోవిందకృష్ణన్. పుస్తకరచయిత వి. గోవిందకృష్ణన్‌తో చరిత్రకారుడు, రచయిత మను.ఎస్.పిళ్ళై ఇంటర్వ్యూ పూర్తి పాఠం ఇక్కడ పొందుపరుస్తున్నాం.... సంపాదకుడు

**ప్రశ్న :** ఆర్.యస్.యస్ అక్కున చేర్చుకున్న వివేకానందుడి గురించి లోతుగా పరిశోధించి ప్రత్యేకంగా ఒక పుస్తకం రాయాలని మీరు ఎందుకు భావించారు? అసలు మీ ఈ ప్రయాణం ఎలా మొదలయ్యింది.?

**జవాబు :** నేను చిన్నతనంలోనే వివేకానందుడి గురించి విన్నాను. నా పదహారవ ఏటనే 'ఈ జీవితానికి అర్థము, పరమార్థము ఏమిటి' అన్న అస్థిత్వస్పృహకు లోనయ్యాను. నా గురువులుగాని, నా తల్లిదండ్రులు గానీ, నా స్నేహితులు గానీ, నా మార్గదర్శకులుగానీ ఎవరూ ఈ విషయంలో నా సందేహాలను తీర్చలేకపోయారు. కాలేజీలో అడుగు పెట్టాక అక్కడ స్వామీ వివేకానంద సంపూర్ణ రచనలు అందుబాటులోకి వచ్చాయి. మొదటి సంపుటి చదవడం మొదలుపెట్టాను, ఏకధాటిగా ఎనిమిది సంపుటాలు చదివా, మంత్రముగ్ధుడిని అయిపోయా. వివేకానందుడు నే ఎదుర్కొన్న అస్థిత్వ సమస్యలన్నింటికీ జవాబుగా నిలిచాడు. నా ఆలోచనా ప్రపంచమే విప్లవాత్మకంగా మారిపోయింది. అయితే వివేకానందుడి దగ్గర నాకు లభించిన జవాబులు, బుద్ధుడి ప్రబోధాలవలె సంతృప్తి కలిగించలేదు. నేను ఎదుర్కొన్న అనేక ప్రశ్నలకు జవాబులు లభించినట్లే, అవి నాలో మరికొన్ని ప్రశ్నలు తలెత్తేలా చేసాయి. అయితే మతం పట్ల, హిందూయిజం పట్ల నా అవగాహనను తీర్చిదిద్దింది మాత్రం వివేకానందుడే. సంపూర్ణ స్వేచ్ఛ, విమర్శనాత్మకంగా ప్రశ్నించే ధోరణి. అప్రమాణీకత లక్షణాలు ఆధ్యాత్మికతకు, ఆధునిక మానవుడికి అత్యవసరంగా ఉండాల్సినవి అంటాడు వివేకానందుడు. హిందూమతాన్ని సరిగా అర్థం చేసుకుంటే ఈ ఉదాత్త విలువలనే ఆదర్శనీయం, ఆచరణీయం అని తెలియవస్తుంది అని వివరించాడు.

ఇక ఆర్.యస్.యస్. సంఘ్‌పరివార్‌లకు సంబంధించిన అవగాహన నేను పాత్రికేయ వృత్తిలోకి దిగాక కలిగింది. 2009లో మంగుళూరు పబ్ మీద జరిగిన దిగజారుడు దాడి తర్వాత ఈ సంస్థల గురించి మరింత లోతుగా అర్థం చేసుకునే ప్రయత్నం చేసాను. మంగుళూరులో హిందూత్వ ఉగ్రమూకలు పేట్రేగిపోవడం వెనుక, మతపరమైన 'పోలీసింగ్' వెనుక ఉన్న కులరాజకీయాలు గురించి వార్తలు, నివేదికలు ఇచ్చిన తొలి ఆంగ్ల పాత్రికేయుడిని నేనే. ఈ ఉగ్రమూకలు, ఆర్.యస్.యస్.లు వివేకానందుడిని తమ వాడిగా స్వంతం చేసుకుని ప్రచారం చేస్తుంటాయి. ఆ కాలంలో చోటు చేసుకున్న అనేక వికారపు పోకడల నుండి ఒక ఘటన గురించి వివరిస్తాను. వివేకానందుడి పేరుతో ఉన్న గ్రూపు విద్యాసంస్థలకు చెందిన ఒక కాలేజీలో ముస్లిం ఆడపిల్లలు నుదుట బొట్టు పెట్టుకుతీరాలని వెంటపడి వేధిస్తుంటే నేను అడ్డుకున్నాను. దాంతో ఆ మూకకి నాయకత్వం వహిస్తున్న వ్యక్తి వెనక్కితగ్గి, 'మేం విద్యార్థులను భారతీయ సంస్కృతి అలవర్చుకోవాలని నచ్చ చెబుతున్నాం అంతే' అంటూ సంజాయిషీగా చెప్పుకొచ్చాడు. అప్పుడు నేను 'నీదృష్టిలో భారతీయ సంస్కృతి అంటే ఏమిటి?' అనడిగాను. 'మద్యం సేవించకపోవడం, పొగ తాగకుండా ఉండడం, ఒంటి నిండుగా బట్ట ధరించడం' అని చెప్పాడు అతను. 'వివేకానందుడు నిత్య అగ్ని హోత్రావధాని, సిగరెట్లు కాల్చేవాడు, అదీ బహిరంగంగానే – ఈ విషయం తెల్సా నీకూ' అని నేను అడిగేసరికి కిమ్మనకుండా వెళ్ళిపోయాడు.

సంఘ్‌పరివార్ మతతత్వ ధోరణుల వ్యాప్తి మీదా, దేశంలోని కొన్ని రాష్ట్రాల్లో పాలనా యంత్రాంగం ఈ ధోరణులకు చట్టబద్ధత కల్పించడం మీదా నేను చాలా ఏళ్ళుగా వార్తలు, నివేదికలు ఇస్తూ వచ్చాను. ఒక దశలో నేను చాలా నిస్సహాయతకు, నిస్పృహకు లోనయ్యా. ఎమర్జెన్సీ తర్వాత ప్రస్తుతం మనదేశం చాలా పెద్ద ఎత్తున అస్థిత్వ సవాళ్ళను ఎదుర్కొంటుంది. వివేకానందుడి వారసత్వాన్ని హైజాక్ చేసి మరీ ఈ మతతత్వశక్తులు మన ప్రజాస్వామ్యం మీద, మత సహిష్ణుత మీదా తీవ్రంగా దాడి చేస్తున్నాయి. ఈ నేపథ్యంలోనే సంఘ పరివార్ సిద్ధాంతానికి వివేకానందుడి బోధనలకు ఎంత మాత్రం పొసగదు, చెప్పాలంటే వివేకానందుడి బోధనలు

సంఘపరివార్‌కు సైద్ధాంతిక శత్రువు అన్న విషయం ప్రజలకు తెలియచెప్పాలనే ఉద్దేశ్యంతో నేనీ పుస్తకం రాసాను. ఈ దేశంలో ముస్లింలు, క్రైస్తవులు పోషిస్తున్న పాత్ర, భారతీయ చరిత్రను, సమాజాన్ని వివేకానందుడు అధ్యయనం చేసిన తీరు – ఈ రెండూ కూడా సంఘ్ పరివార్ తాత్విక దృక్పథానికి పూర్తిగా భిన్నమైనవి. హిందూ మతం పట్ల వివేకానందుడి దృక్పథం హిందూ మతాన్ని రాజకీయ ప్రాజెక్టుకి వాడుకోవడాన్ని ఎంత మాత్రం అనుమతించదు.

**ప్రశ్న :** వివేకానందుడు విస్తారమైన రచనలు చేసాడు కదా, వేర్వేరు నేపథ్యాలలో ఆయన ఒకదానికి ఒకటి పొసగని వైరుధ్యపూరిత భావాలు ఎక్కడన్నా వెలువరించారా? అంటే వివేకానందుడి బోధనలలో హిందూత్వశక్తులు తమకు అనుకూలంగా మలుచుకునే ధోరణులు ఎక్కడన్నా ఉన్నాయా? విమర్శనాత్మకంగా పరిశీలిస్తే ఇందుకు అవకాశాలు ఉన్నాయా?

**జవాబు:** ఈ ప్రశ్నకు అవును, కాదు అనేదేనా సమాధానం. మన ఆలోచనలలో ఉన్న అసందిగ్ధత మీద జవాబు అధారపడి ఉంటుంది. వివేకానందుడుతో తాను చెప్పిన దానికి పూర్తి భిన్నంగా మాట్లాడిన ధోరణిని మనం గమనించవచ్చు. దీనికి ఆయన జీవించి ఉన్న చారిత్రక కాలం ఒక కారణం. పశ్చిమదేశాలు ఆచరించిన విక్టోరియన్ విలువల ఆఖరి దశాబ్దం అది, అలాగే భారతదేశంలో జాతీయోద్యమం ఆరంభానికి పూర్వదశ కూడా. ఆ కాలంలో మేథోపరంగా, రాజకీయంగా, సాంస్కృతిక పరంగా భావజాలాల మధ్యన తీవ్రమైన ఘర్షణ కొనసాగుతున్న నేపథ్యంలో వివేకానందుడు కొన్ని సందర్భాలలో పరస్పర విరుద్ధమైన భావాలను వెల్లడించాడు. వీటిని వలస పాలకుడు – వలస పీడితుడు, ప్రతిఘటన – ప్రతీఘాతవాదాలు తూర్పు – పశ్చిమ (పాశ్చాత్య), హిందూ సంస్కరణవాదం – హిందూ సంప్రదాయ వాదం తదితర భావజాలాల దృష్ట్యా మనం అర్థం చేసుకోవాలి. అందుకే ఈ పుస్తకంలో నేను నాటి చారిత్రక సందర్భాన్ని విశాల దృక్పథంతో వివరించేందుకు ప్రయత్నించాను. వివేకానందుడిలో తాత్విక మేథో లక్షణాలు ఉన్నాయి. వివేకానందుడు ఏదైనా విషయం మీద నిక్కచ్చిగా పదే పదే చెప్పినదానికి భిన్నంగా వేరే ఏదన్నా సందర్భంలో చెప్పిన దాఖలాలు ఉండడం వాస్తవం. దీని మూలంగా వివేకానందుడి మీద సందేహాలు ముసురుకున్నాయి. వివేకానందుడు నికరం లేని మనిషి అనో చిత్తశుద్ధి లేనివాడనో అనుమానించే అవకాశాలూ ఉన్నాయి. అయితే వివేకానందుడి రచనలను పలుమార్లు లోతుగా, క్షుణ్ణంగా అధ్యయనం చేసి, ఆయన ఆలోచనలతో మమేకమవుతూ, ఆ ఆలోచనాధోరణిని సంగ్రహిస్తే తప్ప ఆయనలోని గొప్ప తాత్విక శక్తిని మనం అర్థం చేసుకోలేము. కాకపోతే చాలామంది విమర్శకులు ఈ విషయమై అలక్ష్యంగా, అల్పంగా వ్యవహరించిన సందర్భాలూ ఉన్నాయి.

వివేకానందుడి రచనలు నే చదివి, అర్థం చేసుకున్న మేరా ఒక విషయం స్పష్టంగా చెప్పగలను. 'ఏదృక్పథమైనా, అది ఎంత వాస్తవికమైనది అయినా, సంపూర్ణ సత్యం కాదు' అని వివేకానందుడు భావించాడు. మనం ఏ అంశాన్నీ సంపూర్ణంగా వీక్షించలేం, ఎంతోకొంతమేర మన దృష్టికి అందని రీతిలో మరుగునపడే ఉంటుంది. ఈ దృష్ట్యానే వివేకానందుడు ఏదన్నా అంశాన్ని తాజాగా పరిశీలించాలి అనుకున్నప్పుడు అంతకు ముందున్న ఆలోచనలకు పూర్తి భిన్నమైన కోణం నుండి ఆలోచించి విభిన్నమైన నిర్ధారణకు వచ్చేవాడు. ఈ కోణం నుండి చూస్తే ఇదీ వాస్తవంగానే అనిపిస్తుంది. అయితే ఇది గతంలో వచ్చిన నిర్ధారణను పూర్వపక్షం చెయ్యడానికి బదులు దానికి సమర్థింపుగా పరిగణించాలి.

కానీ సరిగ్గా ఇక్కడే హిందూత్వశక్తులకు కాలు మోపడానికి అవకాశం దక్కింది. వివేకానందుడు చెప్పిన మాటలను వాటి నేపథ్యం నుండి విడగొట్టి మతతత్వ సైద్ధాంతిక కోణం నుండి ప్రచారంలో పెట్టాయి. దురదృష్టవశాత్తు కొందరు విమర్శకులు కూడా వివేకానందుడి బోధనలను ఈ దృష్టి కోణం నుండే విమర్శించారు. అందుకు వారికి మతతత్వవాదులు అనుసరించిన దుష్ట తలంపును అంటగట్టలేం. కాకపోతే వారిలో వివేకానందుడిని సరిగా అంచనా వేసే తీరు లోపించిందని మాత్రం చెప్పవచ్చు.

దాదాపుగా అనేకమంది తత్వవేత్తల ఆలోచనలు, బోధనలలో మనం ఈ రకమైన ద్వైదీభావనలను గమనించవచ్చు. ఆయా తాత్వికవేత్తల చారిత్రక నేపథ్యం మూలంగా ఇవన్నీ సహజం అని పరిగణనలోకి తీసుకోవాలి. ఆయా తత్వవేత్తల బోధనలు అర్థం చేసుకోవడానికి నిర్దిష్టమైన చారిత్రక, ఆత్మకథనాత్మక ప్రమాణాలు ఉన్నాయి. ఈ పుస్తకంలో వివేకానందుడి భావాలు పంచుకోవడానికి మౌలికంగా నేను అనుసరించిన పద్ధతి కూడా అదే. వివేకానందుడి బోధనలను సునిశితమైన మేథతో విశ్లేషిస్తే ఆయనలోని నికార్సయిన తాత్వికధోరణులను పట్టుకోవచ్చు. అప్పుడు ఆయన ఆలోచనల్లోని ద్వైదీ భావనలలోని అసందిగ్ధత తొలిగిపోతుంది.


**ప్రశ్న:** వివేకానందుడిని ఒక మనిషిగా, తాత్విక ఆలోచనాపరుడిగా, సన్యాసిగా మీరు ఎలా అంచనా వేస్తారు? మీ పరిశోధనలో ఆశ్చర్యకరంగా తోచిన అంశాలు ఏమన్నా ఉన్నాయా?

**జవాబు:** ఆధునిక చరిత్రలో వివేకానందుడిని నేను అద్భుతమైన వ్యక్తులలో ఒకరిగా పరిగణిస్తాను. ఆయన తనలోని ద్వర్థి ఆలోచనలను, స్వభావాలను శక్తివంతంగా వ్యక్తీకరిస్తూనే వాటిని సామరస్యపరిచాడు. అచంచలమైన విశ్వాసం, రాజీపడని తాత్విక సంశయవాదం, సంప్రదాయాల పట్ల ఎలాంటి వెరపూలేని అసంప్రదాయవాదం, మిథ్యావాదం పట్ల కత్తి వాదరను పోలిన కార్యకారణవాదం, జ్ఞానంతో కూడిన భక్తివాదం, తీవ్రమైన ఆదర్శవాదం, స్పష్టమైన ఆశావాదం, అలౌకిక ప్రపంచం పట్ల నిరాశావాదం, అద్భుతమైన మానవీయతావాదం వివేకానందుడి స్వంతం. అందుకే ఈ అంశాల మధ్య ఉన్న పరస్పర భిన్నత్వం, ఘర్షణాత్మక వైఖరులు ఆయన ఆలోచనలలో బోధనలలో ప్రస్ఫుటమవుతాయి. డొల్లబారిన సంప్రదాయాల మూలాధారాల పట్ల వివేకానందుడిలోని అసంప్రదాయతత్వం మనల్ని ముగ్ధులను చేస్తుంది. ఈ చరాచర ప్రపంచం ఒక మిధ్య అని త్రోసి పుచ్చేవారిని వివేకానందుడి మానవీయతావాదం ఈ భూమ్మీదకి నడిపిస్తుంది.

ఆధునిక జీవితంలోని విలాసాలను అనుభవించడం పట్ల వివేకానందుడిలో ఉదారవాద ధోరణులు ఉన్నప్పటికీ తాను సన్యాసి ఆచారాలను తీవ్రంగా పాటించాడు. కొన్ని రోజుల తరబడి నిరాహారంగా ఉండి తనని తాను ఒకసారి మరణానికి చేరువ చేసుకున్నాడు. అయితే సన్యాసిగా మారినప్పటికీ ఆయన తన జ్ఞానానికి పరిమితులు విధించుకోలేదు, కేవలం ఆధ్యాత్మిక భావనలకే పరిమితం కాలేదు. ఇది వివేకానందుడిలో నాకు నచ్చిన గొప్ప లక్షణం.

సన్యాసి జీవితం గడుపుతూనే విశ్వపౌరుడిగా జీవిచడం వివేకానందుడికే చెల్లింది. ప్రపంచపౌరుడిగా తన బౌద్ధిక, సామాజిక బాధ్యతలను నెరవేర్చాడు. ఆయన ఈ భౌతిక ప్రపంచ భావబంధాలు తెంచుకోలేదు. ఆధ్యాత్మికత పేరిట తన బాధ్యతల నుండి ఎన్నడూ తప్పించుకోలేదు. లోతైన రాజకీయ విశ్లేషణల ద్వారా ఐరోపా యుద్ధం సంభవిస్తుంది (మొదటి ప్రపంచయుద్ధం) ముందుగానే చెప్పాడు, రష్యాలో 'భారీ తిరుగుబాటు' (1917 లో రష్యా విప్లవం) జరగనున్నదని హెచ్చరించాడు. సోషలిజం అనేది నియంతృత్వానికి

దారి తీస్తుంది అనే అభిప్రాయం ఉన్నప్పటికీ (ఇది లెనినిజం మీద రోజా లగ్జెంబర్ విమర్శ) రష్యాలో జరుగుతున్న ఉద్యమం పట్ల సానుభూతి వ్యక్తం చేసాడు. మహిళలు అనుభవిస్తున్న ఈతిబాధల పట్ల ఒక దార్శనికుడిలా ఎంతో ముందుచూపుతో ఆనాడే ఆవేదన వ్యక్తం చేసాడు.




నేను ఈ పుస్తకం రాయడానికి సాగించిన పరిశోధనల్లో ఎన్సైక్లోపిడియా స్థాయిలో వివేకానందుడిలో ఉన్న విస్తారమైన జ్ఞానానికి నే ఆశ్చర్యపోయాను. వివేకానందుడు అసాధారణమైన అద్భుత జ్ఞాపకశక్తి కలవాడు అంత విస్తృతంగా చదవడానికి ఆయనకి సమయం ఎలా చిక్కిందో ఎవరి ఊహకీ అందదు. హార్వర్డ్ యూనివర్శిటీకి చెందిన సంప్రదాయవాది జాన్‌రైట్ అయితే అప్పటికి కేవలం 30 ఏళ్ళ వయసు ఉన్న వివేకానందుడుని ఉద్దేశించి 'మాదగ్గర ఉన్న నిష్ణాతులైన ప్రొఫెసర్లు అందరికన్నా ఎక్కువ జ్ఞానవంతుడు' అని కితాబు ఇచ్చాడు. ప్రాశ్చ్య, పశ్చిమ తత్వశాస్త్రాలు, ఆంగ్ల సాహిత్యం, సాంప్రదాయ సంస్కృత భాష, లిఖిత సాహిత్యం, భారతీయ, ప్రపంచ చరిత్రలు, భౌతిక శాస్త్ర నియమాలు (వైరూప్య గణితం కూడా స్వయం సాధనతో నేర్చుకున్నాడు అనడానికి తగిన కారణాలు ఉన్నాయి), క్రైస్తవ మత సిద్ధాంతాలలో వివేకానందుడుకి అపారమైన పరిజ్ఞానం ఉన్నది.

ఇక చరిత్ర పట్ల వివేకానందుడుకి ఉన్న విస్తారమైన పరిజ్ఞానంతో పోలిస్తే ఇవాల్టి రోజుల్లోని చాలామంది వృతిగత చరిత్రకారుల పరిజ్ఞానాన్ని దాటి ముందు ఉన్నాడు. భారతదేశ ప్రాచీన, ఆధునిక చరిత్రలు, యూరప్, పశ్చిమాసియా, ఉత్తర ఆఫ్రికా, చైనా, ప్రాచీన రష్యా చరిత్రల మీద చాలా పట్టు ఉన్నది. యూరప్ చరిత్ర విషయానికి వస్తే ప్రాచీన గ్రీకు చరిత్ర మొదలు మధ్యయుగాల క్రూసేడ్లు (మతయుద్ధాలు), పునర్వికాసోద్యమం వరకు చాలా లోతైన అవగాహన కలిగి ఉన్నాడు. గ్రీకు విజ్ఞానానికి, యూరప్ పునర్వికాసోద్యమానికి ఇస్లామిక్ తోడ్పాటు గురించి కూడా ఎరుక ఉన్నవాడు. ఇది చాలా ఆసక్తికరమైన అంశం. ఎందుకంటే ఆనాడు చరిత్ర అంతా యూరప్ కేంద్రకంగా లిఖించబడింది. 20వ శతాబ్ధంలో కొన్ని దశాబ్ధాలు గడిచాక గానీ యూరప్ నాగరికత మీద ఇస్లాం ప్రభావం గురించి ఆంగ్లంలో ఎటువంటి గ్రంధాలూ వెలువడలేదు.

ఒక తాత్విక ఆలోచనాపరుడిగా వివేకానందుడుని తక్కువగా అంచనా వేసారని నా అభిప్రాయం. విద్యావేత్తలు ఆయనను అద్వైత వేదంతవేత్తగా బహుళ ప్రచారంలోకి తీసుకువచ్చారు తప్పితే ఆయనలోని తత్వవేత్తను వెలుగులోకి తీసుకురాలేదు.

**ప్రశ్న:** మనదేశంలో ముస్లింలు, ఇస్లాం పట్ల వివేకానందుడి అభిప్రాయాల గురించి వివరించండి.

**జవాబు:** మతపరంగా ఇస్లాంను వివేకానందుడు ఎంతో గౌరవించాడు. ఇస్లామిక్ సమాజాల్లో సాపేక్షంగా ఉన్న సర్వమానవ సమానత్వ స్వభావాన్ని, సామాజిక న్యాయానికి ఖురన్ కట్టుబడి ఉ ండడాన్ని వివేకానందుడు అభినందించాడు. ఖురాన్, హదితీలు ఆ కాలపు సామాన్యశాస్త్రాలతో పాటు అన్ని రకాల శాస్త్ర శిక్షణలపై వ్యాఖ్యానించాయి. బైబిల్‌లో కానీ హిందూమత గ్రంథాల్లో గానీ ఈ విధమైన ప్రస్థావనలు లేవు అని వివేకానందుడు గమనించాడు మతాల గురించి సాపేక్షంగా అధ్యయనం చేసిన తాత్విక ఆలోచనాపరుడిగా, విస్వశ్రేయోమత అభిలాషిగా వివేకానందుడు ఏ మతంలో ఉన్న మంచిని అయినా అభినందిస్తూ, లొసుగులను పదునుగా విమర్శించాడు. ఈ దృష్టితో ఇస్లాం మతంలో లొసుగులనూ విమర్శించాడు. అయితే హిందూమత తత్వశక్తులు ముస్లింలపట్ల తమకు ఉ న్నవిద్వేషాన్ని సమర్థించుకోవడానికి ఇస్లాంపై వివేకానందుడి విమర్శలను అడ్డం పెట్టుకుంటున్నాయి. తద్వారా వివేకానందుడు ఇస్లాం విద్వేషి, మతతత్వవాది అని కొంతమంది ఉ దారవాదులు విమర్శించడానికి భూమిక కల్పించాయి. అలా అనుకుంటే వివేకానందుడు ఇతరమతాల కన్నా హిందూ మతంలో ఉన్న లొసుగులను అంతకన్నా తీవ్రంగా విమర్శించాడు అన్న విషయం మనం గుర్తుంచుకోవాలి.

భారతదేశం వెయ్యేళ్ళ పాటు విదేశీపాలనలో మగ్గిపోయింది అన్న ప్రచరం విస్తృతంగా సాగుతున్నది. ఇస్లాం రాజులు మనదేశాన్ని దురాక్రమించి హిందువులను ఊచకోత కోసారని, బలవంతపు మత మార్పిడులకు పాల్పడ్డారని, ఇవాళ దేశంలో ఉన్న ముస్లింలు అలా మతాంతీకరణకు గురయిన వారో కాకుంటే క్రూరులయిన ఇస్లాం పాలకుల వారసులో అని విద్వేష ప్రచారానికి పూనుకుంటున్నారు. అయితే మహమ్మద్‌గజనీ, నాదిర్‌షాలు తప్ప సామ్రాజ్య విస్తరణ కాంక్షతో చేసిన యుద్ధాలు తప్ప మనదేశంలో జరిగిన యుద్ధాలన్నీ – అవి ముస్లిం – హిందూ రాజుల మధ్య జరిగినా – రాజ్యాల మధ్య జరిగిన యుద్ధాలే తప్ప మత యుద్ధాలు కాదని వివేకానందుడు స్పష్టంగా వివరించాడు.

13వ శతాబ్దంలో కొంతమేరకు మత మార్పిడులు జరిగిన మాట వాస్తవమే కానీ 600ఏళ్ళ పాటు సాగిన ఇస్లాం రాజరిక పాలనతో పోలిస్తే ఆ కొద్దిపాటి కాలంలో జరిగిన ఘటనలకు పెద్దగా ప్రాముఖ్యత ఇవ్వాల్సిన అవసరం లేదనేది వివేకానందుడి అభిప్రాయం. భారతదేశంలో మొగలుల పరిపాలనా కాలం మెరుగైన పాలనా కాలం అనీ అక్బర్ చక్రవర్తి గొప్ప పరిపాలనా దక్షుడు అని వివేకానందుడు భావించాడు.

హిందువుల మహాసభను ఉద్దేశించి వివేకానందుడు ప్రసంగిస్తూ – "మహమ్మదీయులు పాలనకు మనం రుణపడి ఉండాలి. ఈ కాలంలోనే కొందరికే పరిమితమైన ప్రత్యేక హక్కులు ధ్వంసం చెయ్యబడ్డాయి. అంతమాత్రాన ఆ పరిపాలన చెడ్డదని చెప్పలేం. ఏ పాలనలో అయినా అంతా మంచి, అంతా చెడు అంటూ ఉండదు. భారతదేశాన్ని మహమ్మదీయులు ఆక్రమించుకున్నాక అట్టడుగు వర్గాల ప్రజానీకం, పేదలకు విముక్తి లభించింది. అందుకే మన జనాభాలో ఐదవ వంతు మంది ప్రజలు మహమ్మదీయ మతం పుచ్చుకున్నారు. ఇది పీక మీద కత్తిపెట్టి సాగించింది కాదు. భయపెట్టో, బెదరించో సాగించింది కాదు. హిందూ సమాజంలో నెలకొని ఉన్న కులాధిపత్యం కారణంగా అణగారిపోయిన అట్టడుగు కులాల వారు ఇస్లాం మతం పుచ్చుకున్నారు" అని వివేకానందుడు వివరించాడు. అలాగే హిందూ సమాజంలోని అగ్రకులాలు నిమ్నకులాల వారిపట్ల సాగించిన దుర్నీతి, అంటరానితనాల మూలంగానే వారు క్రైస్తవమతాన్ని ఆశ్రయించారని వివేకానందుడు మత మార్పిడులకు మూల కారణాలను విశదీకరించాడు, క్రైస్తవ మిషనరీలు మతాంతీకరణకు పాల్పడుతున్నాయన్న అంశం మీద వివేకానందుడు అసలు స్పందించలేదు. వివేకానందుడి రచనల్లోగానీ, ప్రసంగాల్లో గానీ, ఉత్తరప్రత్యుత్తరాల్లోగానీ ఈ అంశం గురించిన ప్రస్థావన ఎక్కడా కనిపించదు.

**(అనువాదం: కె. సత్యరంజన్)**

# సావర్కర్ విచ్ఛిన్నకర వాదనలు

(2వ పేజీ తరువాయి)

సావర్కర్ 1923 లోనే తన హిందుత్వ పుస్తకం ద్వారా "ద్విజాతి" సిద్ధాంతాన్ని మొదటిసారిగా రూపొందించాడు. భారత దేశంలో హిందువులు, ముస్లింలు అనే రెండు జాతులు ప్రధానంగా ఉన్నాయని, అందువలన హిందుస్థాన్‌లో హిందువులే అసలైన జాతి అని ఈ దేశం హిందువులదే అని ప్రకటించాడు. ముస్లింలు కేవలం మైనారిటీ తెగ మాత్రమే అన్నాడు. సావర్కర్ ప్రతిపాదించిన ఈ ద్విజాతి సిద్ధాంతాన్ని 1939లో మహమ్మద్ అలీ జిన్నా లంకించుకున్నాడు. దానితో దేశ విభజనకు పునాది పడింది. కానీ దేశ విభజనకు కారణం గాంధీ, నెహ్రూ, ముస్లింలు, కమ్యూనిస్టులు అని అబద్ధ ప్రచారాలు ఇప్పటికీ సంఘపరివార్ చేస్తూనే ఉండటం మనం గమనిస్తూనే ఉన్నాం.

1947 జూలై 22న రాజ్యాంగ సభ ఆమోదించిన జాతీయ జెండాను (త్రివర్ణ పతాకాన్ని) సైతం అంగీకరించ నిరాకరించాడు సావర్కర్. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ "అయితే ఆ జెండా ఏనాటికీ హిందుస్థాన్ జాతీయ జెండా కాజాలదని నేను నొక్కి చెప్తున్నా. ఎందువలనంటే రాజ్యాంగ సభ బ్రిటిష్ వారి అభీష్టానుసారం ఏర్పడింది తప్ప, మన ప్రజలు ఎన్నుకున్న సభ కాదు. మన ప్రజల అభిప్రాయ సేకరణ జరగలేదు. అంతేకాదు ఇండియన్ యూనియన్ అనే పదం పలకటమే, భారతజాతి ఐక్యత విచ్ఛిన్నమైన విషయాన్ని గుర్తు చేస్తుంది. మన మాతృదేశం ముక్కలైన విషయం, ఆ ముక్కలు చేసిన నేరంలో కాంగ్రెస్ వాదుల విద్రోహపూరిత తోడ్పాటును గుర్తుచేస్తుంది. అందుకు చిహ్నమైన ఆ జెండాకు ఏ నిజమైన జాతీయ వాది అయినా అదొక జాతీయ పతాకంగా గుర్తించి ఎలా నమస్కారం చేయగలడు?". అంటే మన రాజ్యాంగ నిర్ణాయకసభ ఎంచుకున్న త్రివర్ణ పతాకాన్ని తిరస్కరిస్తాడు సావర్కర్. అదే సమయంలో ఎలాంటి జెండా ఉండాలో ఆయన సూచిస్తూ ఇలా చెప్తున్నాడు."మన మాతృభూమి పవిత్ర భూమి సింధూ నది నుండి సముద్రాల వరకు అవిభజిత అంటే విభజించడానికి సాధ్యం కాని హిందుస్థాన్‌కు, హిందూ జాతికి కాషాయ పతాకమే మన పతాకం. ఆ జెండా మధ్య "ఓం, స్వస్తిక్, కత్తి ఉంటాయి. ఈ పతాకం తప్ప మరొక పతాకం మన దేశ జెండా కాజాలదు". ఆ జెండా "వేద కాలం నుండి మన జాతి ఆదర్శాలకు అర్థం పడుతుంది"అంటాడు సావర్కర్. ఈ విధంగా మన జాతీయ పతాకాన్ని సైతం తిరస్కరిస్తూ అవమానిస్తాడు సావర్కర్. అందువల్లనేమో నాగపూర్ ఆర్ఎస్ఎస్ ఆఫీసు మీద ఇటీవల కాలం వరకు జాతీయ జెండా ఎగురవేయలేదు.

**సావర్కర్ రాజకీయ జీవితం**

సావర్కర్ సృష్టించిన హిందుత్వ ఊటను తనివితీరా తాగిన ఎల్కే అద్వానీ తనను మలిచిన మహాపురుషుడు సావర్కర్ అని చెప్పుకుంటారు. ఆయన కొన్నేళ్ల క్రితం సావర్కర్ పేరుతో ఒక పార్కుకు ప్రారంభోత్సవం చేస్తూ సావర్కర్ గొప్ప స్వాతంత్ర సమరయోధుడని, విప్లవకారుడని, ఆయన విప్లవ కార్యకలాపాల వల్ల అండమాన్ జైలు పాలు అయ్యాడని అన్నారు. ఇది ఏమాత్రం నిజం కాదనీ, పచ్చి అబద్ధమనీ సావర్కర్ రాజకీయ జీవితం చూస్తే ప్రతి వారికీఅర్థమవుతుంది. ఒక క్రూరమైన, ఉద్దేశపూర్వకమైన హత్యలో చేతులు కలిపినందుకు పడిన శిక్ష. మరో హత్యను ప్రేరేపించిన కేసులో తృటిలో శిక్ష నుంచి తప్పించుకున్నాడు సావర్కర్. ఈ రెండు సందర్భాల్లో అతను విప్లవకారుడుగా తుపాకీ పట్టలేదు. ఒక హంతకుడినీ వెంటబడి ప్రోత్సహించాడు. తన జోక్యం కనిపించకుండా జాగ్రత్త పడ్డాడు. ఇది విప్లవకారులు అనుసరించే పద్ధతేనా? ఇతర విప్లవకారులు అవసరమైనప్పుడు ఆయుధం పట్టడానికి ఏమాత్రం వెనకాడలేదు. మదన్‌లాల్ ధింగ్రా సావర్కర్‌కు నమ్మకమైన, అంకిత భావం గల అనుచరుడు. సావర్కర్ ఇతడిని సర్ విలియం కర్జన్ వైలేని హత్య చేయటానికి పురికొల్పాడు. ప్లాన్ చేసింది సావర్కర్, ఆచరించింది మదన్ లాల్ ధింగ్రా. ఒక నికెల్ ప్లేటెడ్ రివాల్వర్ ఇస్తూ "ఒకసారి విఫలమైంది. ఈసారి విఫలమైతే నీ ముఖం నాకు చూపకు" అని గట్టిగా చెప్పాడు. హత్య చేసిన తర్వాత ఉరి

# సోషలిజానికి పరివర్తనలో కార్మిక-కర్షక ఐక్యసంఘటన

(9వ పేజీ తరువాయి)

లా చేస్తాయి. సోషలిజం అంటే స్థానిక సమాజాన్ని భిన్నత్వంతో కూడినదిగా రూపొందించటం కాదు. సోషలిజం సమాజాలను దూరం పెట్టదు. కానీ సంకుచిత దృక్పథంతో స్థానిక ఉద్రిక్తతలను పెంచే దృక్పథాన్ని ఒదులుకొనే అవకాశాన్ని ఇస్తుంది. స్థానిక సమాజం, దేశవ్యాపితంగా సోషలిజంలో ఉన్న మొత్తం సమాజాల మధ్య సామరస్యం నెలకొనటానికి, స్థానిక, దేశవ్యాపిత చైతన్యాలలో ఏదో ఒక దానికి ప్రాధాన్యత ఇవ్వకుండా సమతూకంతో వ్యవహరించటానికి కృషి చేస్తుంది. తారతమ్యాలతో కూడిన పన్నులు విధించటం, కేంద్ర పెట్టుబడుల విధానం ద్వారా స్థానిక సమాజాల మధ్య ఆర్థిక అంతరాలను ఒక పరిధికి లోపల ఉంచుతుంది.

సాధారణ అంశాలను వివరించాలనే భావనతో మాత్రమే ఈ విషయాలను ప్రస్తావించాం. కానీ సాధారణ అంశాలను అమలు జరుపుతూ సోషలిజానికి పరివర్తన చెందే క్రమంలో ఎదురయే సమస్యల ప్రాతిపదికగా వివరమైన సూచనలు చేయాలి. ఒక సోషలిస్టు సమాజం ఎలా ఉండాలి, సోషలిస్టు పరివర్తన క్రమంలో ప్రతి అంశం ఎలా ఉండాలి అన్నది వివరించటం మన లక్ష్యం కాదు. వీటిపై నిర్దిష్టంగా వివరణలు ఇవ్వకుండా మార్క్స్ తెలివిగా వ్యవహరించాడు. మార్క్స్, లెనిన్ సిద్ధాంతాల విశ్లేషణ, అవసరమైన మార్పుల కోసం ఈ అధ్యయనంలో పూనుకున్నప్పటికీ వారు వ్యక్తం చేసిన దృక్పథం పరిధిలోనే మౌలికాంశాలు ఉన్నాయి. వ్యక్తులను ఒంటరి చేసి, వారి అస్థిత్వాలను రద్దు చేయటం ఈ సమాజంలో ఉండదు. గ్రామాలు, పట్టణాలకు మధ్య ఉన్న అంతరాలను గణనీయంగా తగ్గిస్తారు. నిరుద్యోగం ప్రజల జీవితాలపై ఎటువంటి దుష్ప్రభావం చూపదు. వ్యక్తులు, సమాజాల ఆదాయాల మధ్య అంతరాలపై అదుపు ఉంటుంది. పెట్టుబడిదారీ సమాజాలలోని అసమానతలు, అణచివేతతో స్థంభించిపోయిన సామాజిక దృక్పధానికి భిన్నమైన సామాజిక దృక్పథం ప్రజలలో అభివృద్ధి అవుతుంది. సృజనాత్మకంగా అభివృద్ధిని సాధించటానికి ఈ సమాజాలలోని ప్రజలు తమ జీవితాలను అంకితం చేస్తారు. ఆ విధమైన దృక్పథం అప్పుడు ఆచరణాత్మక అజెండా మీదికి వస్తున్నది.

(అనువాదం: ఎ కోటిరెడ్డి)

శిక్షబడితే ఈ లోకం మొత్తం నిన్ను అమరుడుగా గుర్తుపెట్టుకుంటుంది అని సావర్కర్ అతనిని ప్రోత్సహించాడు. 1909 లో మదన్‌లాల్ థింగ్రా సర్ విలియం కర్జన్ వైలేని హత్య చేశాడు. ఈ హత్యలో సావర్కర్ హస్తం ఉందని లండన్ పోలీసులు గట్టిగా అనుమానించారు. అయితే అతనిని శిక్షించేందుకు తగిన ఆధారాలు లభ్యం కాలేదు. ఈ కేసును విచారిస్తున్న నాసిక్ మెజిస్ట్రేట్, కలెక్టర్ అయిన ఏఐటి జాక్సన్ అదే సంవత్సరం డిసెంబర్‌లో హత్యకు గురయ్యాడు. సర్ కర్జన్ వైలే, జాక్సన్ హత్యలకు సావర్కర్ బాధ్యుడు. అయితే ఆయుధాన్ని ప్రయోగించింది మాత్రం ఇతరులు. జాక్సన్ హత్య కేసులో ఇతర కుట్ర దారుల వద్ద సావర్కర్ రాసిన ఉత్తరాలు దొరికాయి. కుట్ర దారులు వాడిన పిస్టల్ సావర్కర్ సరఫరా చేసిందని తేలింది. సావర్కర్ కుట్ర బయటపడింది. దానితో సావర్కర్‌ను 1910 మార్చి 13న లండన్ విక్టోరియా స్టేషన్లో అరెస్ట్ చేశారు. చక్రవర్తికి వ్యతిరేకంగా యుద్ధం చేయటం లేదా అలాంటి యుద్ధాన్ని ప్రోత్సహించటం, ఆయుధాలు సేకరించి పంచటం, జాక్సన్ హత్యను ప్రోత్సహించటం, రాజద్రోహ ఉపన్యాసాలు ఇవ్వడం అతని మీద మోపిన ఆరోపణలు. 1910 జులై 22న బొంబాయికి తీసుకుని వచ్చారు. 69 రోజులపాటు విచారణ సాగింది. మొదటి కేసులో సావర్కర్‌కు యావజీవశిక్ష పడింది. జాక్సన్ హత్య కేసులో 50 సంవత్సరాలు అండమాన్ సెల్యులార్ జైల్లో ఉండేలా శిక్ష పడింది. 1911 జులై 4న అండమాన్ ముఖ్య పట్టణమైన పోర్టు బ్లెయరుకు సావర్కర్‌ను తీసుకొచ్చి జైల్లో వేశారు.

జైలులో ఏడాది నిండకముందే బ్రిటిష్ ప్రభుత్వానికి ''దయా బిక్ష'' పెట్టమని అనేకసార్లు క్షమాపణ పత్రాలు పంపుకున్నాడు సావర్కర్. సావర్కర్ తన విన్నపంలో 1911లో దయాభిక్ష కోరుతూ పంపిన విన్నపాన్ని గుర్తుచేస్తూ 1913 నవంబర్ 14న మరో దయాభిక్ష పత్రంతో బ్రిటిష్ ప్రభుత్వానికి విన్నవించుకున్నాడు. అందులో "ప్రభుత్వం ఏ విధంగా సేవ చేయమన్నా నేను చేస్తాను. ఎందువలనంటే నాలో వివేకపూరితమైన పరివర్తన వచ్చింది. భవిష్యత్తులో కూడా నేను అలానే ప్రవర్తించగలనని హామీ ఇస్తున్నాను. నన్ను జైల్లో ఉంచడం కంటే విడుదల చేస్తే మీకు మరింత సేవ చేయగలను. నన్ను విడుదల చేయటం ద్వారా మీరు పొందగలిగినంత ప్రయోజనం, నన్ను జైల్లో ఉంచితే పొందలేరు. దారి తప్పిన బిడ్డను నేను. దారితప్పి ప్రవర్తించిన బిడ్డ తల్లిదండ్రుల వంటి ప్రభుత్వ గడప తొక్కటం తప్ప మరి ఎక్కడికి పోగలడు? శక్తివంతుడే కరుణామయుడు కాగలడు. అంతటి కరుణామయులు, దయార్ద్ర హృదయులు మీరే. దండించి కసి తీర్చుకోవటం కన్నా మన్నించి బాగుపరిచే విషయం బాగా తెలిసిన ప్రభుత్వానికి కృతజ్ఞత తెలియజేస్తు న్నాను. నాకు లాగానే తప్పుదారి పట్టిన అనేకమంది యువకులను తిరిగి వెనుకకు మళ్ళించి మీ సేవలో నిమగ్నం కాగలిగేలా చేయగలను. ప్రభుత్వం కోరిన స్థాయిలో సేవ చేసేందుకు నేను సిద్ధం. ఈ విషయాలన్నింటినీ ఘనత వహించిన తమరు పరిగణలోనికి తీసుకోగలరు అన్న ఆశతో ఎదురుచూస్తు న్నాను". ఈ విప్లవకారుడు రాసుకున్న దయాభిక్ష అర్జీలు చూచిన తర్వాత కూడా ఇతగాడిని విప్లవకారుడు అని అనగలమా? విప్లవతత్వం అతనిలో ఏమైనా ఉన్నదా? బ్రిటిష్ వలసవాదులకు ఈ రకమైన లొంగు బాటు, స్వాతంత్రం కోసం పోరాడిన పోరాదే యోధులకు మచ్చ తెచ్చేదిగా లేదా? ఇంతగా దిగజారి పాదక్రాంతంగా, అప్రతిష్టకరంగా ఈ వేడుకోలు ఉన్నాయి.


అండమాన్ సెల్యులార్ జైల్లో దేశ స్వతంత్రం కోసం పోరాడిన అనేక మంది విప్లవకారులు చిత్రహింసలు అనుభవించారు. కానీ వారు సావర్కర్ లాగా దిగజారి జుగుప్సాకారంగా దయాభిక్ష కోరాలని కలలోనైనా అనుకోలేదు. వీడి సావర్కర్ తొలి దశలో స్వాతంత్ర పోరాటంలో పాల్గొన్న విషయం నిజమే. కానీ చిట్టగాంగ్ విప్లవ వీరులు, భగత్ సింగ్, కుదిరామ్ బోస్ తదితరులు తలవంచని వీరులు. ప్రభుత్వంతో పోరాటం సాగిస్తూ అమరత్వాన్ని ఆహ్వా నించారు. సావర్కర్ అలాంటి తత్వం ఏమాత్రం లేనివాడు. భగత్ సింగ్ అయితే ఉరి కంభం ఎదురైనప్పటికీ ఎవరి దయ కోసం పాకులాడలేదు. నిజానికి తనను ఉరితీయటానికి బదులు, బ్రిటిష్ రాజుకు వ్యతిరేకంగా యుద్ధం చేసాము కనుక, యుద్ధ ఖైదీ లాగే కాల్చి చంపమని వాదించాడు. ఈ వీరుల్లో ఉన్న ఒక్క త్యాగగుణమైన సావర్కార్లో ఉన్నదా? ఆర్ఎస్ఎస్ సంఘ పరివార్ ఇతగాడిని వీరుడు, శూరుడు, ధీరుడు అంటూ భుజకీర్తులు, విశేషణాలు తగిలించి వీర సావర్కర్ అంటూ పొగుడుతూ ఉంటారు. నిజానికి సావర్కర్ ఒక భీరువుగా, ఒక పిరికిపందలా దేశ స్వాతంత్ర పోరాటానికి ద్రోహం చేసిన ద్రోహిగా చరిత్రలో మిగిలి పోయాడు. సావర్కర్ రాసుకున్న క్షమాపణ పత్రాలు చూసిన తర్వాత దీనిలో వీరత్వం ఏముంది? ఆయన ఏమైనా మహత్తర జాతీయ వాదా? ఉన్నతమైన దూరదృష్టి కలవాడా? ఆయన జీవితం ఏమైనా త్యాగమయ జీవితమా? ఉన్నతమైన స్వభావమా? ఆయన బతికిన 83 ఏళ్ల జీవితంలో ఈ లక్షణాలలో ఒకటైనా ఉన్నదా? భీరువుగా బ్రిటిష్ వాళ్ళకి లొంగి వారికి సేవ చేయటం మినహాయించి ఈయన దేశానికి చేసినది ఏమున్నది? ఏమాత్రం సిగ్గు ఎగ్గు లేకుండా బ్రిటిష్ ప్రభుత్వం పెట్టిన షరతులకు అంగీకరించి, నేను గత కాలంలో చేసిన హింసాత్మక మార్గాలను హృదయపూర్వకంగా విసర్జిస్తున్నానని, నా శక్తి కొలది బ్రిటిష్ చట్టాన్ని, రాజ్యాంగాన్ని గౌరవించడం నా విద్యుక్త ధర్మంగా భావిస్తున్నానని, భవిష్యత్తులో నన్ను అనుమతించిన మేరకు మీ సంస్కరణలను విజయవంతం చేసేందుకు సిద్ధంగా ఉన్నాననీ ప్రకటించి అప్పటి వైస్రాయ్ "లిన్ లిత్ గో"పెట్టిన షరతులను ఆమోదించి జైలు నుంచి బయటపడ్డాడు ఈ నకిలీ విప్లవకారుడు, నకిలీ దేశభక్తుడు.

1914లో మొదటి ప్రపంచ యుద్ధం మొదలైంది. ఆ సందర్భాన్ని ఉపయోగించుకుని తనను విడుదల చేయాలని కోరుతూ బ్రిటిష్ ప్రభుత్వానికి ఇలా రాసుకున్నాడు సావర్కర్."మా నిజాయితీని రుజువు చేసుకునే అవకాశం ప్రభుత్వం వారు మాకు ఇవ్వగలరు. భారతదేశాన్ని బానిసత్వంలో ఉంచిన శృంఖలాలను బద్దలు కొట్టేందుకు ఇంగ్లాండు సిద్ధంగా ఉన్నదని ప్రజలను నమ్మించేందుకు మమ్మల్ని విడుదల చేయాలి. బ్రిటిష్ సైన్యంలో భారతీయులను పెద్ద సంఖ్యలో సైనికులుగా రిక్రూట్ చేయగలం. అందుకు మా శక్తినంత ఒడ్డీ కృషి చేస్తాము. ఇది మా గౌరవాన్ని పణంగా పెట్టి ఇస్తున్న హామీ. ఇంగ్లాండ్ విజయానికి ఆ సైనికులలో మేము కూడా వాలంటీర్లుగా చేరుతాం. మమ్మల్ని విడుదల చేయండి" అని పదేపదే మొరపెట్టుకున్నాడు. ఇది బ్రిటిష్ వలసవాదులకు మరొక లొంగు బాటు. అంతేకాదు 1950లో ప్రివెంటివ్ డిటెన్షన్ చట్టం కింద సావర్కర్‌ను భారత ప్రభుత్వం అరెస్టు చేసినప్పుడు తనను జైలు నుండి విడుదల చేయమని అభ్యర్థిస్తూ 1950 ఏప్రిల్ 26న రాష్ట్ర ప్రభుత్వానికి ఉత్తరం రాశాడు సావర్కర్. "భేషరతుగా విడుదల చేయమనే తన అభ్యర్థనను ప్రభుత్వం మన్నించాలి, లేకుంటే ప్రభుత్వం నిషేధించి నంత కాలం తాను నిత్య రాజకీయాలలో పాల్గొనబోననే షరతు పైన అయినా తనను విడుదల చేయాలి" అని సావర్కర్ అభ్యర్థిం చాడు. ఇతగాడి జీవితమంతా లొంగుబాటు మయమే. అందువల్ల టార్చిలైటు వేసి వెతికినా ఆయన జీవితంలో విప్లవకారుడు, దేశభక్తుడు దొరకడు.

❋

Date of Publication : 30th of every month. Date of Posting : 5th & 7th of every month.
Postal Regd. No. D/VJ/172/2024-26, Marxistu Monthly Magazine, Volume 21, issue: 6 Vijayawada
RNI Reg. No. APTEL/2006/17554 - Rs. 15/- Total Pages : 36

# తగ్గిపోయిన భారత పాస్‌పోర్ట్ ర్యాంకింగ్




హెన్లే పాస్‌పోర్ట్ సూచీలో భారత పాస్‌పోర్ట్ ర్యాంకింగ్ 2024లో 80వ స్థానం నుండి 2025 నాటికి 85వ స్థానానికి దిగిపోయింది. ఒక దేశపు పాస్‌పోర్టుతో ఎన్ని దేశాల్లో వీసా లేకుండా లేక వీసా ఆన్ ఎరైవల్‌తో ప్రయాణించగలరు అనే అంశం ఆధారంగా పాస్‌పోర్టు ర్యాంకింగ్ అంచనా వేస్తారు. దీని ప్రకారం భారత పాస్‌పోర్టుతో 57 ఆసియా, ఆఫ్రికా, కరేబియన్, పసిఫిక్ దేశాలను మాత్రమే విసా లేకుండా లేక వీసా ఆన్ ఎరైవల్‌తో సందర్శించగలం.

హెన్లే పాస్‌పోర్ట్ సూచీ 2025 ప్రకారం ప్రపంచంలో అత్యంత శక్తివంతమైన పాస్‌పోర్ట్ సింగపూకు చెందుతుంది. అది మొత్తం 104 ర్యాంకుల్లో మొదటి స్థానాన్ని ఆక్రమించింది. తరువాత రెండు, మూడు స్థానాల్లో దక్షిణ కొరియా, జపాన్‌లు నిలుస్తాయి. సింగపూర్ పాస్‌పోర్ట్ గలిగిన వ్యక్తి ప్రపంచంలోని 193 దేశాలను వీసా లేకుండా లేక వీసా ఆన్ ఎరైవల్‌తో సందర్శించగలడు. దక్షిణ కొరియా పాస్‌పోర్టుతో 190, జపాన్ పాస్‌పోర్టుతో 189 దేశాలు సందర్శించవచ్చు.

ఒక దేశపు పాస్‌పోర్టు ర్యాంకింగ్ దానిపై ప్రపంచ దేశాలకు ఉన్న నమ్మకాన్ని సూచిస్తుంది. ఆయా దేశ పౌరుల సగటు ఆర్థిక పరిస్థితి, వారిపై నమ్మకాన్నిబట్టి ఆ దేశ పౌరులకు వివిధ దేశాలు వీసాలు జారీ చేస్తాయి. పాస్‌పోర్టు ర్యాంకింగ్ తక్కువగా ఉందీ అంటే అర్థం ఆ దేశ పౌరులు విద్యా, వ్యాపారం, సందర్శనల కోసం విదేశాలకు వెళ్లాలంటే ఎన్నో పత్రాలు సమర్పించాల్సి ఉంటుంది, ఫీజులు అధికంగా చెల్లించాల్సి ఉంటుంది.

భారత దేశ పాస్‌పోర్టు ర్యాంకింగ్ 2006లో అత్యధికంగా 71 స్థానంలో ఉండేది, తరువాత క్రమంగా తగ్గుతూ 85 వ స్థానానికి పడిపోయింది. ప్రపంచ పాస్‌పోర్టు ర్యాంకింగ్స్ 2025లో అత్యంత బలహీనమైన పాస్‌పోర్టుగా ఆఫ్ఘనిస్థాన్ పాస్‌పోర్టు నిలుస్తుంది. దాని తరువాత సిరియా, ఇరాక్, పాకిస్థాన్‌లు రెండు, మూడు, నాలుగో స్థానాల్లో నిలుస్తాయి. నేపాల్ పాస్‌పోర్టు క్రింది నుండి 7 స్థానంలో ఉంది.

ఈ సూచీలో అమెరికా ర్యాంకు గతంలో కన్నా దిగజారిపోయి 12 స్థానాన్ని ఆక్రమించింది. పై 10 స్థానాల నుండి అమెరికా ర్యాంకు క్రిందికి దిగిపోవడం ఇదే ప్రథమం. ఈ పాస్‌పోర్టుతో 180 దేశాలను వీసా లేకుండా సందర్శించవచ్చు. హెన్లే పాస్‌పోర్ట్ సూచీ ప్రకారం చైనా 64వ ర్యాంకులో ఉంది. ఈ పాస్‌పోర్టు ఉన్న వాళ్లు 85 దేశాలను వీసా లేకుండా సందర్శించగలరు. 2015లో 94వ ర్యాంకు నుండి దాని స్థానం బాగా మెరుగుపడింది.

**చిరునామా**

**మేనేజర్,**

**మార్క్సిస్టు (సైద్ధాంతిక మాసపత్రిక), ప్రజాశక్తి భవనం, అమరారెడ్డి కాలనీ, అరవింద స్కూల్ వద్ద, తాడేపల్లి , పిన్ : 522501, గుంటూరు జిల్లా. సెల్: 94900 99422**

**చందా వివరాలు**

విడిప్రతిక: **రూ.15,** సంవత్సర చందా:**రూ.150,** పోస్టు ద్వారా రూ. **180** పోస్టు ద్వారా లేదా ఏజెంటు ద్వారా తెప్పించుకోవచ్చు. లేదా మీ స్థానిక పార్టీ కార్యాలయంలో సంప్రదించండి. ప్రజాశక్తి బుక్‌హౌస్ అన్ని బ్రాంచీలలోనూ లభిస్తాయి.

**చందాదారుని చిరునామా**

**పోస్టు స్టాంపు**

ఇంటి నెంబరు ................................................

వీధి ................................................

గ్రామం ................................................

మండలం లేదా పట్టణం ................................

జిల్లా ................................................

e m a i l : marxistap@gmail.com
venkataraosankarapu@gmail.com

Printed and Published by B.V. Raghavulu on behalf of CPIM AP Committee. Printed at Prajasakti Printers & Publishers Private Ltd. D .No 14-12-19, Krishna Nagar, Tadepalli (M) Guntur Dt. 94900 99422.
Editor : S. Venkatarao.